# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

14.12.2025
ఆదివారం Sunday

సంపుటి (volume): 1
సంచిక (Issue): 165

పేజీలు : 8
Pages : 8

వెల రూ. 2.00

Published from : Hyderabad
Circulated to : Telangana



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింద నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944
7897222788 - 7897222789






హైదరాబాద్‌లో ఫుట్‌బాల్ అభిమానులకు మరుపురాని దృశ్యం ఆవిష్కృతమైంది. అంతర్జాతీయ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సీ తొలిసారి నగరానికి రాగా, ఆయన రాకతో ఉప్పల్ స్టేడియం సందడిగా మారింది.

# మెస్సీ మ్యాచ్ జోష్!

## ఉప్పల్‌లో ఆద్యంతం ఆనంద క్షణాలు

- మెస్సీతో కలిసి ఫుట్ బాల్ ఆడిన రేవంత్
- అపర్ణ మెస్సీపై సింగరేణి టీమ్ విజయం
- మనవడిని మెస్సీకి పరిచయం చేసిన సీఎం
- మెస్సీని కలుసుకున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్
- స్టేడియంలో ప్రియాంక కూతురు, కొడుకు
- మెస్సీకోసం అభిమానుల రాకతో సందడి





**హైదరాబాద్, డిసెంబర్ 13:** ఉప్పల్ స్టేడియం వేదికగా జరిగిన ఎగ్జిబిషన్ మ్యాచులో అపర్ణ మెస్సీ టీమ్‌పై సీఎం రేవంత్ నేతృత్వంలోని సింగరేణి టీమ్ విజయం సాధించింది. మెస్సీ అపర్ణ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సీ విన్నర్, రన్నరప్ జట్లకు కప్‌లు అందించారు. కాగా, గోట్ ఇండియా టూర్ 2025లో భాగంగా శనివారం మెస్సీ హైదరాబాద్‌కు వచ్చారు. కోల్‌కతా నుంచి ప్రత్యేక విమానంలో శంషాబాద్ ఎయిర్ పోర్టుకు

మిగతా 2 లో

# నేడు రెండో విడత పంచాయతీ పోరు

- 3,911 సర్పంచులు, 29,903 వార్డు సభ్యులకు ఎన్నిక
- దాదాపు 28,278 మంది పోటీ
- ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్
- భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు



**హైదరాబాద్, డిసెంబర్ 13:** తెలంగాణలో రెండో దశ పంచాయతీ ఎన్నికలు ఆదివారం జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో ఎన్నికల సామగ్రిని అధికారులు పరిశీలించుకున్నారు. అలానే ఓటు హక్కును వినియోగించుకొనేందుకు పట్టణాల్లో ఉంటున్న ప్రజలు తమ స్వగ్రామాలకు బయలుదేరారు. దీంతో పలు చోట్ల ట్రాఫిక్ జామ్ నెలకొంది. ఏకగ్రీవాలు కాకుండా రెండో దశలో 3,911 పంచాయతీలకు సర్పంచులు, 29,903 వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్ జరగనుంది. తెలంగాణ రాష్ట్రంలో రెండో దశ గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారం శుక్రవారం సాయంత్రం ముగియడంతో, అధికారులు పోలింగ్‌కు సన్నద్ధమయ్యారు. మొత్తం 4,332 గ్రామ పంచాయతీలు, 29,903 వార్డు సభ్యుల స్థానాలకు రెండో విడతలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ విడతలో ఇప్పటికే 415 సర్పంచ్ స్థానాలు, 8,304 వార్డులు ఏకగ్రీవమయ్యాయి.

మిగతా 2 లో




## ఐదుగురు కొత్త ఐఏఎస్‌ల కేటాయింపు

2024 బ్యాచ్ అధికారుల జాబితా విడుదల

03



02

## నల్లమల ప్రాజెక్టుకు అనుమతులివ్వొద్దు

### ఏపీపై కేంద్రానికి తెలంగాణ ఫిర్యాదు


ఏపీ చేపట్టనున్న నల్లమల ప్రాజెక్టుకు అనుమతులివ్వొద్దని తెలంగాణ కేంద్రాన్ని కోరింది. ఈ మేరకు లేఖను రాసింది. కృష్ణా, గోదావరి నీటి కేటాయింపులు, తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు కోరుతూ కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి కాంతారావుకు తెలంగాణ జలవనరుల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేఖ రాశారు.

## తిరువనంతపురం కార్పొరేషన్‌పై కాషాయ జెండా

- కార్పొరేషన్ ఎన్నికల్లో లెఫ్ట్ పాలనకు చరమగీతం
- 101 స్థానాలకు 50 సీట్లు గెల్చుకున్న ఎన్డీఏ
- కేరళ రాజకీయాల్లో ఇదో కీలక మలుపు అన్న ప్రధాని
- పని చేసిన కార్యకర్తలను అభినందించిన మోదీ



04



హిట్ అండ్ రన్ కేసులో

## బెయిల్ నిరాకరణ

ఇలాంటి వారికి గుణపాఠం నేర్పాల్సిందే: సుప్రీం

04

## ఈవెంట్ మేనేజర్‌లా రేవంత్ వ్యవహారం

- సమస్యలు పక్కన పెట్టి ఆటలా?
- కవిత ఆరోపణలపై విచారణ జరిపించాలి
- బండి పీఆర్‌వో పోస్టుపై ఈటెల ఆగ్రహం

03



## వసూళ్లు మానుకోండి

ట్రాన్స్‌జెండర్లపై హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఆగ్రహం

02



## ఓడిన సర్పంచ్ అభ్యర్థుల ఆందోళన

- లక్షలు ఖర్చు చేసినా ఓట్లేయలేదని నిలదీత
- తమ డబ్బులు వాపస్ ఇవ్వాలంటూ ఒత్తిడి



తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించినవారు టపాసులు కాల్చుతూ చిందులు వేస్తున్నారు. ఐతే ఓడిన అభ్యర్థులు ఒక్కో రకంగా స్పందిస్తున్నారు. కొందరైతే తమకు ఓట్లు వేయాలని ఇంటింటికి డబ్బులు పంచామనీ, తమ డబ్బు తిరిగి ఇవ్వాలంటూ ఇంటింటికీ తిరిగి డిమాండ్ చేస్తున్నారు.

02

## హాస్టల్ విద్యార్థులకు పట్టెడన్నం పెట్టలేరా?



- కలుషితాహారం కేసులు కనిపించడం లేదా
- మెస్సీతో ఫుట్‌బాల్ మీదున్న ధ్యాస పిల్లల మీద ఉండదా?
- సీఎం రేవంత్‌పై హరీష్ రావు ఆగ్రహం

03



## ఓటు వేసేందుకు వెళ్తూ..

ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం

జనగామ జిల్లాలో ఇద్దరు యువకులు మృతి

02

# నేడు రెండో విడత పంచాయతీ పోరు

మొదటి పేజీ తరువాయి

మిగిలిన 3,911 సర్పంచ్ స్థానాలకు 14న ఆదివారం పోలింగ్ జరగనుంది. ఈ స్థానాలకు దాదాపు 28,278 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగనుంది. అనంతరం 2 గంటల నుంచి కౌంట్ పక్రియ ప్రారంభం కానుంది. ఇదిలా ఉండగా, ఇటీవల ముగిసిన తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారాయి. మొత్తం 3,834 సర్పంచ్, 27,600కు పైగా వార్డులకు జరిగిన తొలి విడత పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రారంభమైన కౌంటింగ్‌లో అధికార కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు అద్భుతమైన సత్తా చాటారు. తొలి విడతలో మెజారిటీ స్థానాలను కైవసం చేసుకున్న కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు ఏకంగా 2,872 స్థానాల్లో విజయం సాధించారు. పల్లెపోరును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామని ప్రకటించినా, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మద్దతుదారులు కేవలం 1,160 స్థానాల్లో మాత్రమే గెలుపొందారు. బీజేపీ మద్దతుదారులు దారుణంగా కేవలం 195 స్థానాలకే పరిమితమయ్యారు. 460 మంది స్వతంత్ర అభ్యర్థులు కూడా విజయం సాధించారు. తొలి విడత ఎన్నికల సందర్భంగా, కౌంటింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు



చోటుచేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. డీజీపీ శివధర్ రెడ్డి ఆదేశాల మేరకు విజయోత్సవ ర్యాలీలకు అనుమతి ఇవ్వలేదు. ఇప్పుడు, తొలి విడత ఫలితాల జోరుతో రెండో విడత పోలింగ్‌కు అన్ని రాజకీయ పార్టీలు, అధికారులు సన్నద్ధమయ్యారు. ఇక మూడో విడత ఎన్నికలకు పోలింగ్ ఈనెల 17న జరుగనుంది. వికారాబాద్ జిల్లాలో రెండో విడత సర్పంచ్ ఎన్నికలు సాఫీగా జరిగేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ప్రతీక్? జైన్ సూచించారు. ఈ నెల 14న 7 మండలాల్లో పోలింగ్ ఉందన్నారు. 13 ఉదయం డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకుని, సాయంత్రం పోలింగ్ మెటీరియల్ ను తీసుకొని బూత్‌లకు వెళ్లిపోయేలా ఆదేశాలు ఇచ్చారు. గుర్తింపు లేని వ్యక్తులను పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించవద్దన్నారు.

# మెస్సీ మ్యాచ్ జోష్!



మొదటి పేజీ తరువాయి

చేరుకున్న మెస్సీ భారీ బందోబస్తు నడుమ విమానాశ్రయం నుంచి నేరుగా ఫలక్ నుమా ప్యాలెస్‌కు వెళ్లారు. ఫలక్ నుమా ప్యాలెస్?లో మెస్సీకి సీఎం రేవంత్ రెడ్డి గ్రాండ్ వెల్కమ్ చెప్పారు. ఆ తర్వాత ఫలక్ నుమా ప్యాలెస్‌లో నిర్వహించిన ప్రత్యేక మీట్-అండ్-గ్రీట్ కార్యక్రమంలో మెస్సీ, సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. మెస్సీ మ్యాచ్ చూసేందుకు హైదరాబాద్ వచ్చిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా మీట్ అండ్ గ్రీట్‌లో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మెస్సీని కలిశారు. ఈ కార్యక్రమం తర్వాత మెస్సీ, రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి నేరుగా ఉప్పల్ స్టేడియానికి వెళ్లారు. మెస్సీ అపర్ణ, రేవంత్ సింగరేణి జట్ల మధ్య జరిగిన ఫ్రెండ్లీ మ్యాచును తిలకించారు. మ్యాచ్ 18వ నిమిషంలో గ్రౌండ్‌లోకి దిగిన సీఎం రేవంత్ రెడ్డి వచ్చి రాగానే గోల్ కొట్టి అలరించారు. మ్యాచ్ అనంతరం నిర్వహించిన పెనాల్టీ షూటౌట్‌లో కూడా గోల్ కొట్టారు. పెనాల్టీ షూటౌట్‌లో మెస్సీ కూడా రెండు గోల్స్ కొట్టి అలరించారు. మ్యాచ్ ముగిశాక గ్రౌండ్ లోకి దిగిన మెస్సీ సీఎం రేవంత్ తో పాటు ఆటగాళ్లతో సరదాగా కాసేపు ఆట ఆడారు. సీఎం రేవంత్ తన మనువడిని గ్రౌండ్‌లోకి తీసుకొచ్చి మెస్సీకి పరిచయం చేశారు. రేవంత్ మనువడితో మెస్సీ కాసేపు ఫుట్‌బాల్ ఆడారు. అనంతరం తన మనువడితో కలిసి సీఎం రేవంత్ మెస్సీతో ఫొటో దిగారు. మెస్సీ మ్యాచ్ చూసేందుకు హైదరాబాద్ వచ్చిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ.. మ్యాచ్ అనంతరం అతడితో కలిసి ఫొటో దిగారు. ఇక, తన కోసం వచ్చిన ప్రేక్షకులకు స్టేడియం చుట్టూ తిరుగుతూ మెస్సీ అభివాదం చేశారు. దీంతో ఉప్పల్ స్టేడియం మొత్తం మెస్సీ నామస్మరణతో మోరుమోగిపోయింది. మొత్తానికి మెస్సీ హైదరాబాద్ పర్యటన విజయవంతంగా ముగిసింది.






# మెస్సీ కోసం హనీమూన్ క్యాన్సిల్

## యువతి వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్



**కోల్‌కతా, డిసెంబర్ 13:** భారత ఫుట్‌బాల్ అభిమానులు ఎంతోగానో ఎదురుచూస్తోన్న రోజు రానే వచ్చింది. ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సి ఇండియాలో అడుగుపెట్టాడు. 'గోట్ టూర్ ఆఫ్ ఇండియా' పేరుతో సాగనున్న ఈ పర్యటనలో భాగంగా.. మెస్సి కోల్‌కతా చేరుకున్నాడు. కోల్‌కతా అంతా ఇప్పుడు అంతా మెస్సి జపమే చేస్తోంది. 2011 తర్వాత ఈ స్టార్ ఆటగాడు ఇక్కడికి రావడం ఇదే తొలిసారి. ఈ నేపథ్యంలో అభిమానులంతా భారీ ఎత్తున ఇప్పటికే స్టేడియానికి చేరుకున్నారు. ఇందులో ఓ లేడీ ఫ్యాన్ మాట్లాడిన మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గత శుక్రవారమే నాకు పెళ్లి అయింది. మెస్సి ఇక్కడికి వస్తున్నాడని తెలిసి.. పట్టరాని సంతోషంలో మునిగిపోయాం. ఈరోజు మా హనీమూన్ షెడ్యూల్ ఉంది. కానీ మెస్సిని చూడటం కోసం మా హనీమూన్ రద్దు చేసుకున్నాం. నేను, నా భర్త మెస్సిని చూడటం కోసం ఈ నిర్ణయం తీసుకున్నాం. ఇప్పటికే ఇక్కడికి వచ్చి దాదాపు రెండు గంటలైంది. మరికొద్ది సేపట్లో మెస్సిని చూడబోతున్నాం. ఇది జీవితంలో ఒకే ఒక్కసారి వచ్చే అవకాశం. హనీమూన్‌కి ఎప్పుడైనా వెళ్లొచ్చు.. అందుకే మెస్సిని చూసే అవకాశాన్ని చేజార్చుకోవాలని అనుకోలేదు' అని ఓ మహిళ మెస్సిపై తన అభిమానాన్ని వివరించింది. చాలా మంది అభిమానులు మెస్సిన చూడటం కోసం ఎంతో ఆసక్తిగా, ఉత్సుకతతో ఎదురుచూస్తున్నారు. ఒక్కొక్కరు తమ అభిమానాన్ని ఒక్కో రకంగా వెల్లడిస్తున్నారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# నల్లమల ప్రాజెక్టుకు అనుమతులివ్వొద్దు

## ఏపీపై కేంద్రానికి తెలంగాణ ఫిర్యాదు

**హైదరాబాద్, డిసెంబర్ 13:** ఏపీ చేపట్టనున్న నల్లమల ప్రాజెక్టుకు అనుమతులివ్వొద్దని తెలంగాణ కేంద్రాన్ని కోరింది. ఈ మేరకు లేఖను రాసింది. కృష్ణా, గోదావరి నీటి కేటాయింపులు, తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు కోరుతూ కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి కాంతారావుకు తెలంగాణ జలవనరుల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిస్తున్న నల్లమల సాగర్ ప్రాజెక్టు, అల్మట్టి డ్యాం కోసం కర్ణాటక చేపడుతున్న భూ సేకరణకు అనుమతులు నిరాకరించాలని కోరారు. గోదావరి నీటిని తరలించేందుకు ఏపీ ప్రభుత్వం కొత్తగా నల్లమల సాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి సిద్ధమవుతోందని, ఇది బచావత్ ట్రిబ్యునల్ తీర్పునకు విరుద్ధంగా ఉందని లేఖలో పేర్కొన్నారు. గతంలో పోలవరం-బనకచర్ల ప్రాజెక్టును ఏపీ ప్రతిపాదించగా.. ప్రీ ఫీజిబిలిటీ నివేదికను కేంద్ర అటవీ, పర్యావరణశాఖ తిరస్కరించినట్లు గుర్తు చేశారు. ఆ ప్రాజెక్టు స్థానంలో తాజాగా నల్లమల సాగర్ నిర్మాణానికి డీపీఆర్ తయారీ కోసం ఏపీ సర్కారు టెండర్ నోటీసు విడుదల చేసిందని పేర్కొన్నారు. 2026-2031 సంవత్సరాలకు తెలంగాణలోని ప్రాణహిత చేవెళ్ల సుజల స్రవంతి, నారాయణ్‌పేట్- కొడంగల్ లిఫ్ట్, సీతారామ లిఫ్ట్, పాలమూరు, రంగారెడ్డి లిఫ్ట్, ముక్తేశ్వర్ లిఫ్ట్, మోడికుంట వాగు, చనక-కొరాట ప్రాజెక్టులకు పీఎంకేఎస్‌వై-ఏఐబీపీ కింద నిధులు కేటాయించాలని ఉత్తమ్ విజ్ఞప్తి చేశారు. కృష్ణా ట్రిబ్యునల్-2 విచారణ త్వరగా పూర్తి చేసి.. ఈ ప్రాజెక్టులకు అనుమతులివ్వాలని కోరారు. పాలమూరు -రంగారెడ్డి తొలిదశ, సమ్మక్క-సారక్క ప్రాజెక్టుల డీపీఆర్‌లు ఇప్పటికే కేంద్ర జలసంఘానికి అందించామని తెలిపారు. ఈ



రెండు ప్రాజక్టులకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని కోరారు. మంత్రి రాసిన లేఖను రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా.. జలశక్తి కార్యదర్శికి అందజేశారు.



# ఓటు వేసేందుకు వెళ్తూ..

## మెదక్ జిల్లాలో బైకును ఢీకొన్న వాహనం

## ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం

## జనగామ జిల్లాలో ఇద్దరు యువకులు మృతి

**మెదక్/జనగామ, డిసెంబర్ 13:** జిల్లాలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట హైవేపై వెళ్తున్న బైక్‌ని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలుస్తుంది. చనిపోయిన వారి వివరాలు.. కూర్మ లింగయ్య (45), సాయవ్వ(40), సాయిలు (18), మానస(8). మృతులు కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం మాగి గ్రామానికి చెందినవారిగా తెలుస్తోంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఆదివారం జరగబోయే రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు హైదరాబాద్ నుంచి తమ స్వగ్రానికి వెళ్తుండగా ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఒక్కసారిగా శోకసంద్రంలో మునిగిపోయారు. గతంలో కూడా పెద్దశంకరంపేటలో రోడ్డు ప్రమాదాలు జరిగినట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## జనగామ జిల్లాలో ఇద్దరు యువకులు





జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మండలం రాఘవాపూర్ దగ్గర జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మ ృతి చెందారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మ ృతదేహాలను పోస్ట్ మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు పోలీసులు. మృతులను హన్మకొండ జిల్లా ఐనవోలు మండలం నందనం గ్రామానికి చెందిన బుర్ర కళ్యాణ్ (27), బుర్ర నవీన్ (27)గా గుర్తించారు పోలీసులు. పంచాయతీ ఎన్నికల్లో ఓటేసేందుకు సొంత గ్రామానికి వెళ్తుండగా ఈ దురెటన జరిగింది. నవీన్, కల్యాణ్ మ ృతితో నందనం గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. చేతికి అందొచ్చిన కొడుకులు చనిపోవడంతో మ ృతుల తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.

# చాంద్రాయణగుట్టలో దారుణం

## బాలుడిని హత్య చేసిన సవతి తండ్రి

**హైదరాబాద్, డిసెంబర్ 13:** హైదరాబాద్ నగరంలోని చాంద్రాయణగుట్టలో దారుణం చోటుచేసుకుంది. పక్కింటి పిల్లలతో తరచూ గొడవ పడుతున్నాడనే కోపంతో పదేళ్ల బాలుడిని సవతి తండ్రి కిరాతకంగా హత్య చేశాడు. బాలుడి తలను రోడ్డుకేసి బాదడంతో తీవ్రంగా గాయపడగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. పోలీసుల కథనం ప్రకారం.. చాంద్రాయణగుట్టకు చెందిన ఓ మహిళకు గతంలో వివాహమైంది. భర్తతో విభేదాల కారణంగా విడాకులు తీసుకుని, అదే ప్రాంతానికి చెందిన మరో వ్యక్తిని రెండో వివాహం చేసుకుంది. ఆమె మొదటి భర్త కుమారుడైన షేక్ మహ్మద్ అజహార్ (10) కూడా వారితోనే ఉంటున్నాడు. అయితే, అజహార్ తరచూ ఇరుగుపొరుగు పిల్లలతో గొడవ పడేవాడు. ఈ విషయమై స్థానికులు బాలుడి సవతి తండ్రిని నిలదీసేవారు. ఈ క్రమంలోనే ఈ నెల 7న తీవ్ర ఆగ్రహానికి గురైన నిందితుడు.. బాలుడి తలను పట్టుకుని రోడ్డుకేసి బలంగా కొట్టాడు. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలైన అజహార్‌ను కుటుంబసభ్యులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న చాంద్రాయణగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడైన సవతి తండ్రిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు

# వసూళ్లు మానుకోండి

## ట్రాన్స్‌జెండర్లకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ హెచ్చరిక



**హైదరాబాద్, డిసెంబర్ 13:** ట్రాన్స్‌జెండర్ల బెదిరింపు వసూళ్లపై హైదరాబాద్ సీపీ సజ్జనార్ సీరియస్ అయ్యారు. ఇకపై బలవంతపు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వారికి కఠిన హెచ్చరికలు జారీ చేశారు .ప్రభుత్వ అవకాశాలను వాడుకుని ట్రాన్స్‌జెండర్లు కూడా సమాజంలో గౌరవంగా బతకాలని సూచించారు. గ్రూపు తగాదాలు, ఆధిపత్య పోరు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నాయని సజ్జనార్ ఆందోళన వ్యక్తం చేశారు. వారి సమస్యల పరిష్కారానికి 'ప్రైడ్ ప్లేస్' ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ మధ్య కాలంలో ట్రాన్స్‌జెండర్ల ఆగడాలకు సంబంధించిన వార్తలు నిత్యం వెలుగు చూస్తూనే ఉన్నాయి. వేడుక జరిగితే చాలు.. అది చిన్నది, పెద్దది అనే తేడా లేకుండా.. గుంపులుగా అక్కడకు చేరి బెదిరించి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు. గతంలో కొందరు నెటిజనులు ఈ సమస్యను సీపీ సజ్జనార్ ద ృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో తాజాగా సజ్జనార్ ట్రాన్స్‌జెండర్లకు వార్నింగ్ ఇచ్చారు. ఇక మీదట వారు బలవంతపు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. తాజాగా అమీర్‌పేటలోని సెస్ ఆడిటోరియంలో సుమారు 250 మంది ట్రాన్స్‌జెండర్లతో సమావేశం నిర్వహించారు. సీపీ సజ్జనార్ ఈ సమావేశానికి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. బలవంతపు వసూళ్లకు పాల్పడితే ట్రాన్స్‌జెండర్ల మీద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గత కొంతకాలంగా ట్రాన్స్‌జెండర్ల మధ్య గ్రూపు తగాదాలు పెరుగుతున్నాయనిరు..అనంతరం ఏడీజీ చారు సిన్హా మాట్లాడుతూ.. ట్రాన్స్‌జెండర్ల సమస్యలను పరిష్కరించడానికి గాను మహిళా భద్రతా విభాగంలో 'ప్రైడ్ ప్లేస్' అనే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపారు. ట్రాన్స్‌జెండర్లకు ఎలాంటి సమస్యలు ఎదురైనా, వారిని ఎవరైనా వేధింపులకు గురిచేసినా.. వెంటనే ఈ వింగ్‌ను సంప్రదించవచ్చని చారు సిన్హా తెలిపారు. ట్రాన్స్‌జెండర్ల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి మహిళా భద్రతా విభాగం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఆమె హామీ ఇచ్చారు.

# బీజేపీకి అంత సీన్ లేదు

**సర్పంచ్ ఎన్నికల్లో బీజేపీకన్నా ఇండిపెండెంట్‌లే ఎక్కువ**

**జూబ్లీహిల్స్‌లో అయితే డిపాజిట్ రాలేదు**

**మాజీ ఎంపీ వి.హనుమంత రావు కీలక వ్యాఖ్యలు**



**హైదరాబాద్,డిసెంబర్13:** రాష్ట్రంలో బీజేపీకి అంత సీన్ లేదని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంత రావు కీలక వ్యాఖ్యలు చేసారు. ప్రధానమంత్రే ఇటీవల వారిని మందలించారని అన్నారు. ఇక.. సర్పంచ్ ఎన్నికల్లో బీజేపీ కంటే ఇండిపెండెంట్ అభ్యర్థులే ఎక్కువ చోట్ల విజయం సాధిస్తున్నారని కాంగ్రెస్ నేత విమర్శించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఆ పార్టీ డిపాజిట్ కోల్పోయిందన్నారు. బిసి రిజర్వేషన్లపై మాట్లాడుతూ... బీజేపీ ఎంపీలంతా తమను తీసుకెళ్లాలని, న్యాయం చేయాలని కోరారు. విషయమై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తమను ప్రధానమంత్రి దగ్గరకు తీసుకెళ్తే అంతా కలిసి వస్తామని ఈ సందర్భంగా హనుమంత రావు అన్నారు. తాను గతంలోనే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కలిసి జనగణనలో కులగణన చేయాలని కోరినట్టు ఆయన తెలిపారు. ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖనూ ఏర్పాటుచేయాలని అభ్యర్థించినట్టు కూడా హనుమంత రావు చెప్పారు. ఈ విషయమై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ. పాదయాత్రలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ బీసీల సమస్యలు తెలుసుకున్నారన్నారు. 'జనగణనలో కులాల వారిగా లెక్కలు తెలుస్తామని రాహుల్ గాంధీ పాదయాత్ర సందర్భంగా ప్రజలకు హామీ ఇచ్చారు. బాపూజీ రోజ్ గార్ యోజనను ప్రధాని మోదీ.. మన్‌రేగా అని పేరు మార్చారు. వెనుకబడిన కులాలకు 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చారు. అప్పుడు ఓబీసీలం ఏమీ మాట్లాడలేదు. జనగణన కోసం ప్రభుత్వం రూ. 11,700 కోట్లు కేటాయించింది. జనాభాలో 56 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలు ఉన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి ఓబీసీలకు అన్యాయం జరుగుతూనే ఉంది. ఓబీసీలలో ఎంతో మంది బీజేపీ ఎంపీలు ఉన్నారు.. వారెందుకు మాట్లాడ్డం లేదు? తెలంగాణ బీజేపీ నేతలు గెలిచి కూడా ఏమీ చేయడంలేదని మోదీ ఇటీవల అన్నారు. 9వ షెడ్యూల్‌లో అయినా ఓబీసీలకు రిజర్వేషన్లు పెంచాలి' అని హనుమంత రావు చెప్పారు.

# తెలంగాణకు ఐదుగురు కొత్త ఐఏఎస్‌ల కేటాయింపు

**కేంద్ర ప్రభుత్వం 2024 బ్యాచ్ అధికారుల జాబితా విడుదల**




**హైదరాబాద్, డిసెంబర్ 13:** కేంద్ర ప్రభుత్వం తాజాగా 2024 బ్యాచ్‌కు ఎంపికైన 179 మంది ఐఏఎస్ అధికారులకు రాష్ట్రాల కేటాయింపులు చేసింది. ఇందులో భాగంగా, తెలంగాణ రాష్ట్రానికి ఐదుగురు ఐఏఎస్ అధికారులను కేటాయించింది. తెలంగాణకు కేటాయించిన ఈ ఐదుగురిలో ఇద్దరు తెలంగాణకు చెందినవారు కాగా, ఒకరు ఆంధ్రప్రదేశ్, మిగిలినవారు కర్ణాటక, బిహార్ రాష్ట్రాలకు చెందినవారు ఉన్నారు. రాష్ట్రానికి కేటాయించిన వారిలో ఎట్టబోయిన సాయిశివాని, పోతురాజు హరిప్రసాద్ (తెలంగాణ), పి. సురేశ్ (ఆంధ్రప్రదేశ్), సచిన్ బసవరాజ్ గుట్టూర్ (కర్ణాటక), పారస్‌కుమార్ (బిహార్)లు ఉన్నారు. అలాగే, తెలంగాణ రాష్ట్రానికి చెందిన మరికొందరు అధికారులు ఇతర రాష్ట్రాలకు కేటాయించబడ్డారు. రావుల జయసింహారెడ్డిని పశ్చిమ బెంగాల్‌కు, కె. ఆదిత్యశర్మ, చింతకింది శ్రవన్‌కుమార్‌రెడ్డిలను ఆంధ్రప్రదేశ్‌కు, సాయిచైతన్య జాదవ్‌ను తమిళనాడుకు, వడ్త్యావత్ యశ్వంత్ నాయక్‌ను ఛత్తీస్‌గఢ్‌కు కేటాయించారు. ఈ మేరకు కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అధికారికంగా లేఖ రాసింది.

# పోగుబంధంతో ఫోన్ బంధం

**క్యూఆర్ కోడ్ సిరిసిల్ల నేతన్న శాలువా.. ఆవిష్కరించిన కేటీఆర్**



**హైదరాబాద్, డిసెంబర్ 13:** సిరిసిల్ల నేతన్నల నైపుణ్యం మరోసారి ప్రపంచానికి తెలిసింది. సాంకేతికతను, మగ్గాన్ని జోడించి సిరిసిల్లకు చెందిన ప్రముఖ నేతన్న నల్ల విజయ్ కుమార్ రూపొందించిన 'క్యూఆర్ కోడ్' (%ు= జశీఎవ%) శాలువాను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈరోజు తన నంది నగర్ నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ ప్రతిభను కేటీఆర్ ప్రత్యేకంగా అభినందించారు.

**శాలువా ప్రత్యేకతలు**

"పోగు బంధంతో ఫోన్ బంధం" అనే కాన్సెప్ట్‌తో ఈ శాలువాను రూపొందించారు. శాలువాపై నేసిన క్యూఆర్ కోడ్‌ను మొబైల్ ఫోన్‌తో స్కాన్ చేయగానే తెలంగాణ చరిత్ర, సంస్కృతి, ప్రముఖ దేవాలయాలు, చారిత్రక కట్టడాలు మనకు కనిపిస్తాయి. అంతేకాకుండా, కేసీఆర్ హయాంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్టుల గొప్పతనాన్ని, యాదాద్రి ఆలయ వైభవాన్ని తెలిపేలా ఈ కోడ్‌ను తీర్చిదిద్దారు. కేవలం 15 రోజుల వ్యవధిలో ఇంతటి అద్భుతమైన శాలువాను విజయ్ కుమార్ రూపొందించడం విశేషం. నేతన్న నల్ల విజయ్ కుమార్ మాట్లాడుతూ: "మా నాన్నగారు గతంలో అగ్గిపెట్టెలో పట్టే చీరను తయారు చేశారు. ఆయనే నాకు స్ఫూర్తి. గతంలో నేను రంగులు మారే చీరను, అగ్గిపెట్టెలో పట్టే చీరను తయారు చేసినప్పుడు, అప్పటి సీఎం కేసీఆర్ గారి చేతుల మీదుగా ఉగాది పురస్కారం అందుకోవడం నా అదృష్టం. కేసీఆర్ గారు తెలంగాణకు చేసిన అభివృద్ధిని, మన వారసత్వ సంపదను పదిమందికి తెలియజేయాలనే ఆలోచనతోనే ఈ క్యూఆర్ కోడ్ శాలువాను రూపొందించాను. సిరిసిల్ల ఎప్పుడూ కొత్త ఆవిష్కరణలకు అడ్డా అని నిరూపించడమే నా లక్ష్యం," అని తెలిపారు. ఈ అద్భుత ఆవిష్కరణను కేటీఆర్ గారి ద్వారా కేసీఆర్ గారికి అందించాలనే తన కోరికను విజయ్ వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన కేటీఆర్, తప్పకుండా ఈ శాలువాను కేసీఆర్ గారికి అందజేస్తానని హామీ ఇచ్చారు. నేతన్నలకు కేటీఆర్ ఎల్లప్పుడూ అండగా ఉంటూ ప్రోత్సహిస్తున్నారని, భవిష్యత్తులో మరిన్ని అద్భుతాలు సృష్టిస్తామని విజయ్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, పార్టీ జనరల్ సెక్రటరీ రావుల చంద్రశేఖర్ రెడ్డి, సీనియర్ నాయకులు జాన్సన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# హాస్టల్ విద్యార్థులకు పట్టెడన్నం పెట్టలేరా?

- కలుషితాహారం కేసులు కనిపించడం లేదా
- మెస్సీతో ఫుట్‌బాల్ మీదున్న ధ్యాస పిల్లల మీద ఉండదా?
- సీఎం రేవంత్‌పై హరీష్ రావు ఆగ్రహం





**హైదరాబాద్, డిసెంబరు 13:** రేవంత్ రెడ్డి పిల్లల పాలిట 'పాయిజన్ 2047'గా మారాడని సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. పేద పిల్లల మీద ముఖ్యమంత్రి పగబట్టాడు. రెండేండ్లలో 116 మంది పిల్లలను పొట్టన పెట్టుకున్నాడని చెప్పారు. ఇంతమంది విద్యార్థులు చనిపోతున్నా రేవంత్ రెడ్డికి కనీసం చీమకుట్టినట్లయినా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీ రెండేండ్ల పాలనలో స్కూలు విద్యార్థులకు కనీసం పట్టెడన్నం పెట్టలేక పోతున్నావని మండిపడ్డారు. విద్యాశాఖమంత్రిగా, ముఖ్యమంత్రిగా రేవంత్ అట్టర్ ఫ్లాప్ అయ్యాడని దుయ్యబట్టారు. ఫుడ్ పాయిజన్ బారిన పడి హైదరాబాద్ కింగ్ కోఠి దవాఖానలో చికిత్స పొందుతున్న బాగ్ లింగంపల్లి మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థులను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్ కలిసి హరీశ్ రావు పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతిరోజూ ఏదో ఒక గురుకుల పాఠశాలలో, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు కలుషిత ఆహారం తిని హాస్పిటల్ పాలవుతున్నారు. మొన్న షామీర్‌పేట బీసీ గురుకుల పాఠశాలలో అన్నంలో పురుగులు వస్తున్నాయని విద్యార్థులు ఏకంగా పోలీస్ స్టేషన్‌కి వెళ్లే పరిస్థితి వచ్చింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై విద్యార్థులే ఫిర్యాదు చేశారు. నిన్న మాదాపూర్‌లోని చందునాయక్ తండాలో మధ్యాహ్న భోజనం వికటించి 43 మంది పిల్లలు దవాఖానలో చేరారు. ఇప్పుడు ముషీరాబాద్ నియోజకవర్గంలో బాగ్ లింగంపల్లి మైనార్టీ గురుకులంలో కలుషిత ఆహారం తిని 90 మంది ఆసుపత్రి పాలయ్యారు. రేవంత్ రెడ్డి విజన్ 2047 అని డబ్బా కొట్టుకుంటున్నాడు. ఇది విజన్ 2047 కాదు.. విద్యార్థుల పాలిట పాయిజన్ 2047గా మారింది. రేవంత్ రెడ్డి పిల్లల పాలిట పాయిజన్ 2047గా మారిండు. ప్రభుత్వ హాస్టళ్లలో పిల్లలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నారు. కేసీఆర్ హయాంలో సన్నబియ్యంతో మంచి నాణ్యమైన ఆహారం విద్యార్థులకు అందేది. ఇప్పుడు దొడ్డు బియ్యం పెడుతున్నారు, అన్నం ఉడకడం లేదు, సరైన భోజనం పెట్టట్లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫుట్‌బాల్ ఆడడంలో సీఎం బిజీగా ఉంటాడు. మెస్సితో ఫుట్‌బాల్ ఆడటానికి మేస్త్రి కోట్లు ఖర్చు చేస్తున్నాడు. ఈరోజు రాష్ట్రంలో దాదాపు 300 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటే రాహుల్ గాంధీ రాడు. 160 మంది ఆటో డ్రైవర్లు చనిపోతే రాడు. 116 మంది విద్యార్థులు చనిపోతే రాడు. 42 శాతం రిజర్వేషన్ కోసం బీసీలు పోరాటం చేస్తున్నా రాడు. రాష్ట్రంలో ఎన్ని సమస్యలు ఉన్నా ముఖం చాటేసి, ఈరోజు ఫుట్‌బాల్ మ్యాచ్ చూడటానికి వస్తున్నాడు. రాహుల్ గాంధీ ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు వచ్చి రేవంత్‌రెడ్డి ఆడే ఫుట్‌బాల్ మ్యాచ్ చూసి పరవశిస్తాడంట. కలుషిత ఆహారంతో కడుపునొప్పి భరించలేక ఏడుస్తున్న విద్యార్థుల కన్నీళ్లు చూడు రాహుల్ గాంధీ అని హరీష్ ఎద్దేవా చేశారు. విద్యార్థులకు పాడైన భోజనం పెట్టి వారి ప్రాణాలతో చెలగాటమాడుతారా? అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ మండిపడ్డారు. బాగ్‌లింగంపల్లి మైనారిటీ గురుకులంలో ఫుడ్ పాయిజన్ ఘటనపై ఆయన స్పందిస్తూ విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత విషయంలో నిర్లక్ష్యం తగదని సూచించారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించే లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసి సకల వసతులు కల్పించిందని గుర్తుచేశారు. 2016లో బాగ్‌లింగంపల్లి మైనార్టీ గురుకులాన్ని ఏర్పాటు చేయగా బీఆర్ఎస్ పాలనలో ఏనాడూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకోలేదని పేర్కొన్నారు. నాడు విద్యార్థులకు నాణ్యమైన విద్య, మంచి ఆహారం అందించామని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను, విద్యార్థులను పట్టించుకోకపోవడం వల్లనే ఇలాంటి ఘటనలు నిత్యం జరుగుతున్నాయని మండిపడ్డారు.

# ఈవెంట్ మేనేజర్‌లా రేవంత్ వ్యవహారం

- సమస్యలు పక్కన పెట్టి ఆటలా?
- కవిత ఆరోపణలపై విచారణ జరిపించాలి

**బండి పీఆర్‌వో పోస్టుపై ఈటెల ఆగ్రహం**



**హనుమకొండ, డిసెంబరు 13:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈవెంట్ మేనేజర్‌లా వ్యవహరిస్తున్నారని భాజపా ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. ప్రజా సమస్యలు పక్కన పెట్టి మెస్సితో ఫుట్‌బాల్ ఆడుతున్నారని మండిపడ్డారు. సింగరేణిలో క్వార్టర్లు బాగు చేయడానికి, సిబ్బందికి జీతాలు ఇవ్వడానికి డబ్బులు లేవు. కానీ సింగరేణి డబ్బులు రూ. 100 కోట్లు పెట్టి ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడుతున్నారు. పేదల ఇళ్లను కూలుస్తున్న హైడ్రా.. పెద్దల కబ్జాను పట్టించుకోవడం లేదు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత చేసిన ఆరోపణలపై ప్రభుత్వం విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గుర్తులు ఉండవు. ఈ ఎన్నికలంటేనే అధికార పార్టీకి అనుకూలంగా ఉంటాయి. అధికారంలో ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ 50 శాతం కూడా గెలవలేదు. గెలిచిన వారిని తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేస్తోంది. ప్రజలకు ఆ పార్టీ పట్ల ఎంత విముఖత ఉందో దీన్ని బట్టి అర్థం చేసుకోవాలని ఈటల రాజేందర్ అన్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ పీఆర్వో సోషల్ మీడియాలో పెట్టిన పోస్టుపై ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను బీజేపీ ఎంపీనని.. తాను కూడా కొన్ని పోస్టులను చూశానని ప్రస్తావించారు. అవగాహన లేకుండా కొంతమంది తనపై కుట్ర పూరితంగా పోస్టులు పెడుతున్నారని మండిపడ్డారు. అయితే వాటిని తాను పట్టించుకోనని స్పష్టం చేశారు. అవగాహన ఉన్నవారు అలా పోస్టులు పెడతారా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. తాను ఏ పార్టీలో ఉండాలో ప్రజలు తేల్చుకుంటారని చెప్పుకొచ్చారు. ఈ అంశాలను బీజేపీ హై కమాండ్ తేలుస్తుందని.. సమయమే ఇది డిసైడ్ చేస్తుందని వ్యాఖ్యానించారు. తనపై ఎవరు ఏమి చేస్తున్నారు.. ఎవరేం చెబుతున్నారో ప్రజలకు అర్థమవుతోందని తెలిపారు. సందర్భం వచ్చినప్పుడు అన్ని విషయాలు చెబుతానని అన్నారు. రెండు, మూడో విడత పంచాయతీ ఎన్నికలు పూర్తి అయ్యాక ఇటీవల జరిగిన పరిణామాలన్నీ తాను చెబుతానని ఈటల రాజేందర్ పేర్కొన్నారు .

# ఓడిన అభ్యర్థుల ఆందోళన

- లక్షలు ఖర్చు చేసినా ఓట్లేయలేదని నిలదీత
- తమ డబ్బులు వాపస్ ఇవ్వాలంటూ ఒత్తిడి

"తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించినవారు టపాసులు కాల్చుతూ చిందులు వేస్తున్నారు. ఐతే ఓడిన అభ్యర్థులు ఒక్కో రకంగా స్పందిస్తున్నారు. కొందరైతే తమకు ఓట్లు వేయాలని ఇంటింటికి డబ్బులు పంచామనీ, తమ డబ్బు తిరిగి ఇవ్వాలంటూ ఇంటింటికీ తిరిగి డిమాండ్ చేస్తున్నారు."



**నల్లగొండ, డిసెంబర్ 13:** తెలంగాణలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగాయి. రెండోవిడత ఆదివారం జరుగబోతున్నాయి. తొలివిడతో ఓడిపోయిన సర్పంచ్ అభ్యర్తులు ఇప్పుడు లబోదిబోమంటున్నారు. ఈ ఎన్నికల కోసం బరిలోకి దిగిన అభ్యర్థులు ఎంతో ఖర్చు పెట్టారు. తమను గెలిపించాలని ఇంటింటికీ తిరిగి ఓటర్లను కోరారు. అంతేకాకుండా ఓటర్లను తమ వైపుకు తిప్పుకునేందుకు భారీగా డబ్బులు ఖర్చుపెట్టారు. అయితే ఈనెల 11న మొదటి విడత ఎన్నికలు జరుగగా.. అదే రోజు ఫలితాలు వచ్చేశాయి. ఎన్నికల్లో గెలుస్తామనే ఆశతో.. పెద్ద మొత్తంలో డబ్బులు ఖర్చు పెట్టినప్పటికీ కొందరు అభ్యర్థులు మాత్రం ఎన్నికల్లో ఓటమిని చవిచూశారు. దీంతో ఓటమిపాలైన అభ్యర్థులు కన్నీరు పెట్టుకుంటున్న పరిస్థితి కనిపిస్తోంది. చివరకు ఎన్నికల్లో ఖర్చు పెట్టిన డబ్బులను తమకు తిరిగి ఇచ్చేయాలంటూ ప్రాధేయపడుతున్నారు. నల్లగొండ జిల్లాలో ఓ సర్పంచ్ అభ్యర్థి ఎన్నికల్లో ఓడిపోయాడు. దేవుడి ఫోటోతో ఇంటింటికీ తిరుగుతూ తన డబ్బులు ఇవ్వాలని కోరుతున్నాడు. జిల్లాలోని నార్కట్ పల్లి మండలం ఔరవాణి గ్రామంలో ఓడిపోయిన సర్పంచ్ అభ్యర్థి ఇంటింటికీ తిరుగుతూ.. ఎన్నికల్లో ఓడిపోయానని ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని గ్రామస్తులను కోరుతున్నాడు. అయితే ప్రజలు మాత్రం అతడికే ఓటు వేసినట్లు చెబుతున్నారు. దీంతో ఓట్లు వేశామని చెబుతున్న ఓటర్లను దేవుడిపై ప్రమాణం చేయించుకుంటున్నాడు సదరు సర్పంచ్ అభ్యర్థి. అందరూ తనకే ఓట్లు వేస్తే ఎలా ఓడిపోయానంటూ ఓటర్లను నిలదీస్తూ కన్నీరు పెట్టుకుంటున్నాడు. ఈ ఎన్నికల కోసం రూ. 10 లక్షలకు పైగా ఖర్చు చేశానని బాధితుడు వాపోతున్నాడు. మరికొన్ని గ్రామాల్లో కూడా ఓడిపోయిన అభ్యర్థులు ఇలానే తమ డబ్బులు తమకు ఇవ్వాలని ఓటర్లను కోరుతున్నట్లు తెలుస్తోంది. డబ్బులు ఇవ్వకపోతే చచ్చిపోతామంటూ ఓడిపోయిన అభ్యర్థులు బెదిరిస్తున్నట్లు సమాచారం. ఇలా మెదక్, వరంగల్ జిల్లాల్లో కూడా కొందరు అభ్యర్థులు రోడ్డున పడ్డారు. డబ్బులు తీసుకుని తమకు ఓటేయలేదని వాపోతున్నారు. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మొదటి విడత పూర్తయ్యింది. రెండో విడతలో ప్రచారం పూర్తి కావడంతో నేడు ఓటింగ్ ప్రారంభం కానుంది. ఇదిలా ఉండగా రెండు, మూడో విడతల్లో కొన్ని పంచాయతీలు ఎకగ్రీవాలయ్యాయి. పోటీ ఉన్న చోట సర్పంచ్, వార్డు అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అంతులేని హామీలతో పాటు, సాయంత్రం మందు, విందులతో పాటు, మహిళలకు చీర, సారెలను అందజేస్తున్నారు. అంతేకాక ఓటుకు, రూ. 2 వేలు ఇస్తామని హామీ ఇస్తుండటంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. ఇప్పటికే వరి కోతలు పూర్తికావటంతో అందరూ ఎన్నికలపై దృష్టి పెట్టారు. గ్రామాల్లో ఎన్నికల సంబురాలు కనిపిస్తున్నాయి. మరో పక్క పోటీలో ఉన్న గ్రామాల్లో కొందరు యువత విజయంపై బెట్టింగ్‌లు వేస్తున్నారు. ఏకగ్రీవం అయిన పంచాయతీల్లో ఎన్నికల వాతావరణం కనిపించటం లేదు. దీంతో ఆయా గ్రామాల్లోని ఓటర్లలో నిరుత్సాహం కనిపిస్తోంది. మందు, విందు, డబ్బులు అందలేదని ఓటర్లలో ఆనందం కానరావడంలేదు. ఓడిన వారు ఏడిస్తే, గెలిచిన వారు ఇంటికి వచ్చి ఏడ్చిన మాదిరి తమ పరిస్థితి ఉందని ఏకగ్రీవాల్లో సర్పంచ్లుగా ఎన్నికైన అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏకగ్రీవం చేస్తాం గ్రామాభివృద్ధికి కొంత మొత్తం ఇవ్వాలని పెద్ద మనుషులు సూచించటంతో తాము అనుకున్న ప్రకారం నగదు ఇచ్చామని, ఎన్నికయ్యాక ఓటర్లు నగదు, మందు, విందులు చేయాలని అంటుండటంతో ఏంచేయాలో దిక్కుతోచని స్థితి ఉందంటున్నారు.

నేటి సాక్షి
కరీంనగర్ | ఆదివారం 14 డిసెంబర్ 2025




## సంపాదకీయం

# భారతీయ ఆత్మను ఆవిష్కరించాలి!

పథకాలు, ఊళ్లు, పట్టణాలు, వీధుల పేర్లు అవసరాన్ని బట్టి మార్చడంలో తప్పులేదు. కొన్ని సందర్భాల్లో అవసరం కూడా. అయితే అవసరంలేని చోట కూడా మార్చడం సరికాదు. ఉపాధిహామీ పథకం పేరు ఇప్పుడు మారింది. దానిని పూజ్య బాపు గ్రామీణ్ రోజ్‌గార్ యోజనగా మార్చారు. దీనితో ఒరిగేదేమీ లేదు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉండగా దానిని మార్చడంలో ఔచిత్యం కనిపించడం లేదు.

దేవ విభజన, స్వాతంత్రా÷–యనాంతరం అనేక పథకాలు, కట్టడాలు, కాలేజీలు, ఎయిర్‌పోర్టులకు రెహ్ఉ, ఇందిర, రాజీవ్ పేర్లే ఉన్నాయి. ముందుగా వీటిని మార్చాలి. దేశానికి ఈ ముగ్గురే ముఖ్యం కాదు. స్వాతంత్ర్యం కోసం ఎందరో ప్రాణత్యాగం చేశారు. వారి పేర్లు ప్రతిబింబించేలా చూడాలి. అలాగే వక్రీకరించిన చరిత్రను సక్రమంగా మార్చుకోవాలి. ఔరంగాబాద్‌ను శంభాజీనగర్‌గా మార్చడంలో ఔచిత్యం ఉంది. దేశానికి అవసరమైన పేర్లు మార్చాలే తప్ప ఇలా మార్చడంలో ఉన్న లాభమేంటో కేంద్రం వివరించాలి. ఇకపోతే ఇటీవల ఢిల్లీలో ప్రధాని కార్యాలయం సౌత్ బ్లాక్ పేరును మార్చారు. ఇది కొంతవరకు ఫర్వాలేదు. ప్రధాని నివాసం కర్తవ్య పథ్ అన్నది నేటివిటీకి తగ్గట్లుగా ఉంటుంది. వలసవాద మనస్తత్వం నుంచి మనం విముక్తి పొందాల్సిందే. ఇందులో ఎలాంటి అనుమానం అవసరం లేదు. 'వలసవాద మనస్తత్వం' నుండి విముక్తి పొందే చర్యల్లో భాగంగా మొఘల్స్ నుంచి బ్రిటిషర్ల వరకు మన ఉనికిని దెబ్బతీసేలా అనేక పథకాలు, పేర్లు పెట్టారు. చరిత్రను మార్చారు. వాటిని మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చరిత్రను మార్చకుండా మన తరానికి, భావి తరానికి భారత ఔన్నత్యాన్ని తెలియచేయలేము. తెలంగాణలో కూడా కొన్ని పేర్లు మార్చుకున్నాం. తెలంగాణకు అనుగుణంగా మార్చుకున్నాం. ఎనిమిది శతాబ్దాల ఇస్లామిక్ పాలన చిహ్నాలను, పేర్లను, చారిత్రక కట్టడాలను మార్చడం ద్వారా భారతదేశ ప్రాచీన సాంస్కృతిక గుర్తింపును పునరుద్ధరించడానికి ప్రయత్నిస్తున్న తీరు స్వాగతించాల్సిందే. కుహనా లౌకిక వాదులు చరిత్రకు వక్రభాష్యాలు చెబుతున్నారు. చరిత్రను మసకబార్చే ప్రయత్నాలు సాగాయి. వలసవాద పాలకులను ఘనంగా కీర్తిస్తూ సాగరు. చరిత్ర అంతా వారిచుట్టే సాగేలా చేశారు. మొఘల్స్, బ్రిటిషర్లు తప్ప మన చరిత్ర అంటూ లేకుండా చేసారు. ఇదంతా ఓ పథకం ప్రకారం సాగింది. ఇలాంటి వారి చరిత్రను మార్చాలి. దేశ సంస్కృతిని దెబ్బతీసిన దుర్మార్గుల చరిత్రలను ముందు మార్చాలి. భారతదేశ అసలు చరిత్రను ఆవిష్కరించుకోవాలి. ఇకపోతే 2016లో ప్రధానమంత్రి అధికారిక నివాసం పేరును 'లోక్ కళ్యాణ్ మార్గ్'గా మార్చారు. అదేవిధంగా, రాజ్‌పథ్ పేరును 'కర్తవ్య పథ్'గా మార్చారు. తాజాగా రాష్ట్ర గవర్నర్ల అధికారిక నివాసాలైన రాజ్ భవన్‌ల పేరును 'లోక్ భవన్'గా మార్చారు. అన్ని రాష్ట్రాల్లో పేర్లు మారి పోయాయి. ఇప్పుడు ప్రధాని కార్యాలయానికి 'సేవాతీర్థ్' అని నామకరణం చేశారు. నగరాలు,వీధుల పేర్లు మార్చడంతో పాటు పాఠ్యపుస్తకాలలో చరిత్రను తిరగరాయాలి. శాస్త్రీయ అధ్యయనాల ఆధారంగా మన చిత్రకు ముందు ప్రాధాన్యం ఇవ్వాలి. మన చరిత్రను మకిలి చేసిన చరిత్ర పాఠ్యాలను తొలగించాలి. రాజ్‌భవన్ అంటే.. గవర్నర్ నివాసం అనుకుంటున్నారు కానీ, దాని వెనుక వలసవాద బానిసత్వం వుందని ఇప్పటి తరానికి అసలే తెలియదు. ఈ అర్థం ప్రజాస్వామ్యంలో ఎవరూ పాటించరు. కానీ, గవర్నర్‌లు గీత దాటి పోతున్నారు. రాజ్యాంగాన్ని ధిక్కరిస్తున్నారు. రాజకీయాలు చేస్తున్నారు. గవర్నర్ పేరు మీద ప్రభుత్వం నడిచినా, ఆయనకు ఎలాంటి అధికారాలు వుండవని రాజ్యాంగం స్పష్టం చేస్తున్నది. కానీ గవర్నర్ల వ్యవస్థనే తొలగిస్తే అందరూ హర్షిస్తారు. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు కంటిలో నలుసుగా, కేంద్రానికి తాబేదార్లుగా మారుతున్నారు. కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో గవర్నర్లు వ్యవహరించే తీరే దీనికి తాజా ఉదాహరణ. వీరి రాజకీయాలన్నీ రాజ్‌భవన్ వేదికగానే నడుస్తున్నాయి. గవర్నర్ల వ్యవస్థను మారిస్తే మంచిది. దేశ రాజ్యాంగం, సమాఖ్య వ్యవస్థను, సుప్రీంకోర్టు, ఎన్నికల సంఘంతో సహా అన్ని రాజ్యాంగ వ్యవస్థలను మరింతగా బలోపేతం చేయాల్సి ఉంది. ఒకేదేశం ఒకే ప్రజ, ఒకే చట్టంతోనే ఇది సాధ్యం అవుతుంది. రాజ్‌భవన్ అయినా, లోక్‌భవన్ అయినా గవర్నర్ల పాత్రలో మార్పేమీ వుండదు. సేవాతీర్థం, లోక్ కళ్యాణ్ మార్గ్, కర్తవ్యపథ్, లోక్‌భవన్ వంటి పేర్లు నేటివిటీకి తగినట్లుగా ఉన్నా..ప్రజల జీవితాల్లో పెద్దగా మార్పు గోచరించదు. రైతుకి మద్దతు ధరలు కల్పించడం కార్మికుడికి భరోసా ఇవ్వడం యువతకు ఉద్యోగం వంటివన్నీ ప్రధాన సమస్యలుగా గుర్తించి అందుకు అనగుణంగా తీసుకునే చర్యలు మాత్రం ప్రభావితం చూపుతాయి. ముందుగా మన భారత చరిత్రను ప్రముఖంగా ప్రజలకు తెలియచేయాలి. వలసవాద ప్రచారాలను తిప్పికొట్టాలి. మన దేశీయ విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి. విదేశీ విద్యా ప్రభావాన్ని తగ్గించాలి. మన సంస్కృతానికి ప్రాధాన్యం ఇవ్వాలి. దేశంలో ప్రతి ఒక్కరూ తలెత్తుకుని తిరిగేలా చేయగలగాలి. కులమతాలు, ప్రాంతీయ భేదాలు, మతభేదాలు లేని సమగ్ర భారత్ నిర్మాణం కోసం కృషి జరగాలి. మతప్రాతిపదికన దేశాన్ని విభజించిన తరవాత కూడా ఇంకా మైనార్టీలు అంటూ దువ్వే ప్రయత్నాలు సరికాదు. హిందువులను అణచివేసిన దురగాతాల నుంచి బయటపడాలి. ప్రజలంతా సమానమన్న భావనను వ్యాప్తి చేయాలి. అందుకు అవసరమైన పాలనా సంస్కరణలు రావాలి. అప్పుడు ఎన్నిపేర్లు మార్చినా అభ్యంతరం ఉండదు. అయితే వలసవాదానికి ప్రతీకగా ఉన్న అనేక పేర్లను మార్చాల్సిందే. ఇందులో అభ్యంతరం కూడా ఉండరాదు. అది ప్రజలకు తక్షణ ఉపయోగమా కాదా అన్నదే ముఖ్యం. అందుకే చరిత్రతో సహా భారత్ ఆవిష్కరణ జరగాలి.



# తిరువనంతపురం కార్పొరేషన్‌పై కాషాయ జెండా

- కార్పొరేషన్ ఎన్నికల్లో లెఫ్ట్ పాలనకు చరమగీతం
- 101 స్థానాలకు 50 సీట్లు గెల్చుకున్న ఎన్డీఏ
- కేరళ రాజకీయాల్లో ఇదో కీలక మలుపు అన్న ప్రధాని
- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సాగుతామని ప్రకటన
- పని చేసిన కార్యకర్తలను అభినందించిన మోడీ




**తిరువనంతపురం, డిసెంబర్ 13:** తిరువనంతపురం కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ విజయం సాధించింది. ఈ గెలుపుతో 45 ఏళ్లుగా ఆ స్థానంలో అధికారంలో ఉన్న వామపక్ష పాలనకు ముగింపు పలికింది. తిరువనంతపురం కార్పొరేషన్‌లోని 101 వార్డుల్లో బీజేపీ 50, ఎల్డీఎఫ్ 29, యూడీఎఫ్ 19, స్వతంత్ర అభ్యర్థులు రెండు స్థానాలు గెలుచుకున్నారు. ఇది ఓ రకంగా చరిత్ర సృష్టించిన విజయంగా భావించాలి. 2020లో జరిగిన ఇదే ఎన్నికల్లో.. ఎల్‌డీఎఫ్ 52 వార్డుల్లో విజయం సాధించింది. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే33 స్థానాల్లో, యూడీఎఫ్ 10 చోట్ల గెలుపొందాయి. అయితే.. 2026లో కేరళలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో.. తాజాగా జరిగిన ఎన్నికల్లో బీజేపీ ఆధిక్యం సాధించడం ప్రాధాన్యం సంతరించుకుంది. సుమారు 4 దశాబ్దాల అనంతరం.. కమ్యూనిస్టు కంచుకోటలో కాషాయ జెండా ఎగరడంతో రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకున్నాయి. తిరువనంతపురం కార్పొరేషన్ ఎన్నికల్లో భాజపా విజయం సాధించడంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. కేరళ రాజకీయాల్లో ఇదో కీలక మలుపుగా అభివర్ణించారు. క్షేత్రస్థాయిలో తమ కార్యకర్తలు చేసిన కృషి వల్లే దాదాపు 45 ఏళ్లుగా ఈ స్థానంలో అధికారంలో ఉన్న ఎల్‌డీఎఫ్‌ను ఓడించ గలిగినట్లు పేర్కొన్నారు. ఈ విజయం కోసం శ్రమించిన భాజపా కార్యకర్తలను అభినందించారు. కేరళ అభివృద్ధి భాజపాతో మాత్రమే సాధ్యమని ప్రజలు నమ్మడం వల్లే తమ పార్టీ విజయం సాధించిందన్నారు. తిరువనంతపురం అభివృద్ధికి, ప్రజల జీవన ప్రమాణాలు పెంచడానికి భాజపా కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. ఇది తొలి అడుగు మాత్రమేనని కూడా వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ అక్కడి ప్రజలకు ఎక్స్ వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయం కేరళ రాజకీయాల్లో ఓ కీలక మలుపు అని ఆయన అభిప్రాయపడ్డారు. తిరువనంతపురం ప్రజలకు ధన్యవాదాలు! నగర కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ–ఎన్డీఏకు ఆధిక్యం లభించడం కేరళ రాజకీయాల్లో ఓ కీలక మలుపు. రాష్ట్ర అభివృద్ధి ఆకాంక్షలను మా పార్టీ మాత్రమే తీర్చగలదని ప్రజలు భావిస్తున్నారు. ఈ శక్తిమంతమైన నగరాభివృద్ధికి, ప్రజలకు జీవన సౌలభ్యాన్ని పెంపొందించేందుకు మా పార్టీ కృషి చేస్తుంది. ఈ ఎన్నికల్లో అద్భుత ఫలితాలను సాధించడంలో శ్రమించిన బీజేపీ కార్యకర్తలందరికీ నా కృతజ్ఞతలు. అట్టడుగు స్థాయి నుంచి పనిచేయడంలో కార్యకర్తల దీర్ఘకాల కృషి, పోరాటాలను నేడు మనం గుర్తుచేసుకోవాలి. మన కార్యకర్తలే మనకు బలం' అని మోదీ పేర్కొన్నారు. తిరువనంతపురం కార్పొరేషన్ ఎన్నికల్లో విజయం సాధించిన భాజపా నేతలకు కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఫలితాలు నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనమన్నారు. 45 ఏళ్లుగా అధికారంలో ఉన్న ఎల్‌డీఎఫ్ చేస్తున్న అక్రమాలను చాలాసార్లు ప్రశ్నించానని..వారి పాలన నుంచి బయటపడాలని ప్రజలు కూడా కోరుకుంటున్నట్లు ఈ ఫలితాలతో తేలిందన్నారు.

## ఉపాధి హామీ పథకం పేరు మార్పులో ఆంతర్యమేమిటో

### దండగమారి ఖర్చు తప్ప మరోటి లేదు: ప్రియాంక



**న్యూఢిల్లీ, డిసెంబరు 13:** మహాత్మాగాంధీ నేషనల్ రూరల్ గ్రాంటీ యాక్ట్ (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ) పేరును పూజ్య బాపు గ్రామీణ ఉపాధి పథకంగా పేరు మార్చేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నించడాన్ని కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాందీ తప్పుపట్టారు. తాజాగా ఈ చట్టం పేరు మార్పుకు సంబంధించిన నివేదికపై కాంగ్రెస్ నేత ప్రియాక గాంధీ శనివారం స్పందించారు. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ పేరును మార్చే ప్రక్రియ కోసం ప్రభుత్వ నిధులు ఖర్చవుతాయి. ఇది అనవసరమైన ప్రక్రియ అని ఆమె కేంద్రాన్ని విమర్శించారు. ఈ విషయంపై మీడియాతో మాట్లాడుతూ.. 'ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ పేరు మార్చడం వెనుక ఉన్న ఆలోచనలేంటో నాకర్థం కాలేదు. మొదట మహాత్మాగాంధీ పేరు పెట్టారు. ఇప్పుడు ఆ పేరును మార్చాలని ప్రయత్నిస్తున్నారు. ఈ పేరు మార్చే పక్రియ కోసం చాలా ప్రభుత్వ నిధుల్ని ఖర్చు చేయాల్సి ఉంది. కార్యాలయాల నుండి, స్టేషనరీ వరకు.. ఇలా ప్రతిదానికీ పేరు మార్చాలి. ఇది ఖర్చుతో కూడుకున్న ప్రక్రియ. అనవసరంగా ఇలా చేయడం వల్ల ప్రయోజనం ఏమిటి? నాకు అర్థం కాలేదు అని ఆమె కేంద్రాన్ని ప్రశ్నించారు.

## భార్యను చంపి, వీడియో పెట్టి భర్త ఆత్మహత్య

### భూపాలపల్లిలో దారుణ ఘటన

**జయశంకర్ భూపాలపల్లి, డిసెంబర్ 13:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. గణపురం మండలం సీతారాంపురం గ్రామంలో భార్యను హతమార్చి భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. గ్రామానికి చెందిన బాలాజీ రామాచారి (50) తన భార్య సంధ్య (42)ను తాడుతో ఉరి బిగించి హత్య చేశాడు. అనంతరం అతను కూడా ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు ముందు రామాచారి ఒక వీడియోను రికార్డు చేశాడు. తన భార్య, కూతురు వేధింపులు తట్టుకోలేకే ఈ దారుణానికి పాల్పడినట్లు వీడియోలో పేర్కొన్నాడు. ఆ వీడియోను తన ఫోన్‌లో స్టేటస్‌గా ఉంచినట్లు సమాచారం. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం, రామాచారికి ఇది రెండో వివాహం. మొదటి భార్య మరణించడంతో సంధ్యను వివాహం చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.




## హిట్ అండ్ రన్ కేసులో బెయిల్ నిరాకరణ

### ఇలాంటి వారికి గుణపాఠం నేర్పాల్సిందే

### ముంబై కేసులో సుప్రీం తీవ్ర వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, డిసెంబరు 13:** ముంబయిలో గతేడాది చోటుచేసుకున్న హిట్ అండ్ రన్ కేసులో సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తనకు బెయిల్ ఇవ్వాల్సిందిగా కోరుతూ.. నిందితుడు మిహిర్ షా వేసిన పిటిషన్‌పై దర్యాప్తునకు నిరాకరించింది. ఇలాంటి అబ్బాయిలకు తగిన గుణపాఠం నేర్పించాల్సిందేనని వ్యాఖ్యానించింది. హిట్ అండ్ రన్ కేసులో బైక్‌పై వస్తోన్న వారిని అతివేగంగా తన కారుతో ఢీకొట్టడమే కాకుండా నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఏజీ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. చేసిన నేరానికి గానూ అతడు కొద్ది రోజుల పాటు జైల్లోనే ఉండాలని ఆదేశించింది. గతేడాది ముంబయిలోని వర్లీ ప్రాంతంలో శివసేన నేత రాజేశ్ షా కుమారుడు మిహిర్ షా మద్యం మత్తులో బీఎండబ్ల్యూ కారును వేగంగా నడుపుతూ ముందు వెళ్తున్న స్కూటీని ఢీకొట్టాడు. దీంతో స్కూటీపై ఉన్న దంపతులు ఎగిరిపడ్డారు. వేగంగా వెళ్తున్న కారు మహిళపై నుంచి దూసుకెళ్లడంతో కావేరి నక్వా (45) అక్కడికక్కడే మరణించగా.. ఆమె భర్త గాయపడ్డారు. అయితే, ప్రమాదం తర్వాత మిహిర్ ఘటనకు కొద్ది దూరంలో తన కారును వదిలేసి ఆటోలో అక్కడి నుంచి పరారయ్యాడు. అనంతరం పోలీసులు అతడిని అరెస్టు చేశారు. ఈ కేసులో బెయిల్ ఇవ్వాలని మిహిర్ ముంబయి హైకోర్టులో పిటిషన్ వేయగా న్యాయస్థానం నిరాకరించింది. దీంతో అతడు సుప్రీంను ఆశ్రయించాడు.

# కాంగ్రెస్ అబద్ధాలను తిప్పికొట్టాలి



- ఎస్ఐఆర్ అంశంపై కాంగ్రెస్‌ది అనవసర రాద్ధాంతం
- బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రత్యూష్ కాంత్
- వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: ఎన్. రామచందర్ రావు
- వర్చువల్ విధానంలో దిశానిర్దేశం చేసిన జాతీయ నేతలు

**హైదరాబాద్, డిసెంబర్ 13 (ఇదే నిజం):** ఎస్ఐఆర్ విషయంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అసత్య ప్రచారాన్ని బలంగా తిప్పికొట్టాలని భారతీయ జనతా పార్టీ పిలుపునిచ్చింది. ఈ అంశంపై వాస్తవాలను పార్టీ శ్రేణులకు వివరించేందుకు బీజేపీ జాతీయ మీడియా విభాగం ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర కార్యాలయంలో ప్రత్యేక అవగాహన సదస్సు (వర్క్ షాప్) నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ వర్క్ షాప్‌లో బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రత్యూష్ కాంత్ వర్చువల్ విధానంలో (వీడియో కాన్ఫరెన్స్ ద్వారా) పాల్గొని మాట్లాడారు. ఎస్ఐఆర్ అంశంపై కాంగ్రెస్ పార్టీ అనవసర రాద్ధాంతం చేస్తోందని, లేనిపోని ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదని, వాస్తవాలను గణాంకాలతో సహా వివరించారు. కాంగ్రెస్ చేస్తున్న విష ప్రచారాన్ని బీజేపీ నాయకులు, అధికార ప్రతినిధులు ఎక్కడికక్కడ తిప్పికొట్టాలని ప్రత్యూష్ కాంత్ సూచించారు. సోషల్ మీడియాలోనూ, ప్రధాన మీడియాలోనూ వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర పదాధికారులు, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# శిక్షణ మాది.. ఉద్యోగం మీది!

- పరిగిలో రూ. 45 కోట్లతో 'అడ్వాన్స్ డ్ టెక్నాలజీ సెంటర్'
- శంకుస్థాపన చేసిన మంత్రి వివేక్
- నైపుణ్యం నేర్చుకోండి.. లగచర్ల ఇండస్ట్రియల్ పార్కులో జాబ్ కొట్టండి
- త్వరలోనే పరిగికి రైల్వే లైన్, ఫోర్ లేన్ రోడ్లు: ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



**నేటి సాక్షి, పరిగి/నస్కల్**

పరిగి నియోజకవర్గం పారిశ్రామికంగా, సాంకేతికంగా శరవేగంగా అభివృద్ధి చెందుతోందని రాష్ట్ర గనులు, కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. పరిగి మండలంలోని నస్కల్ గ్రామంలో రూ. 45 కోట్ల భారీ వ్యయంతో నిర్మించనున్న 'అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్' భవన నిర్మాణానికి శుక్రవారం మంత్రి వివేక్, ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు.

### నైపుణ్యంతోనే కొలువులు..

ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు ప్రతి నియోజకవర్గంలో ఏటీసీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కేవలం ఐటీఐ సర్టిఫికేట్ ఇవ్వడమే కాకుండా, పరిశ్రమలకు అవసరమైన ఆధునిక నైపుణ్యాలను విద్యార్థులకు ఇక్కడ నేర్పిస్తామని తెలిపారు. "2 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ఈ సెంటర్‌లో 200 మందికి శిక్షణ ఇస్తాం. శిక్షణ పూర్తయ్యాక ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పించేలా ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. సమీపంలో వస్తున్న లగచర్ల పారిశ్రామిక వాడలో మన పిల్లలకే ఉద్యోగాలు దక్కేలా ఈ శిక్షణ ఉపయోగపడుతుంది" అని మంత్రి వివరించారు. ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి చొరవతోనే పరిగికి ఇంతటి అభివృద్ధి సాధ్యమైందని, ఇలాంటి నాయకులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని కొనియాడారు.

### పరిగికి కొత్త కళ..

ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. పరిగి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ఒకప్పుడు వెనుకబడిన ప్రాంతంగా ఉన్న పరిగి.. ఇప్పుడు అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు, వికారాబాద్, షాద్‌నగర్ పట్టణాలకు నాలుగు లైన్ల రహదారులు రాబోతున్నాయని తెలిపారు. దశాబ్దాల కల అయిన రైల్వే లైన్ కూడా త్వరలోనే సాకారం కాబోతోందని శుభవార్త చెప్పారు. ఓఆర్ఆర్ నుంచి లగచర్ల వరకు రేడియల్ రోడ్డు, ప్రతిష్టాత్మక ట్రిబుల్ ఆర్ నిర్మాణంతో పరిగి దశ మారబోతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణలో విద్యా విప్లవం



- రూ. 21 వేల కోట్లతో 105 'యంగ్ ఇండియా' ఇంటిగ్రేటెడ్ స్కూల్స్
- కులమతాలకు అతీతంగా ఒకే ప్రాంగణంలో అందరికీ విద్య
- డీఎస్సీ ద్వారా 10 వేల పోస్టుల భర్తీ.. స్కూళ్లకు ఉచిత విద్యుత్
- ఈటీ టెక్ ఎక్స్ సమ్మిట్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**నేటి సాక్షి, హైదరాబాద్**

"ప్రపంచం వేగంగా మారుతోంది.. దానికి అనుగుణంగా మన విద్యావ్యవస్థ కూడా మారాలి. అందుకే సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది" అని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉద్ఘాటించారు. శనివారం హైటెక్స్ లో బ్రెయిన్ ఫీడ్ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఈటీ టెక్ ఎక్స్ 6వ ఎడిషన్' గ్లోబల్ సమ్మిట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గత రెండేళ్లుగా విద్యారంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. "రాష్ట్రంలోని 105 నియోజకవర్గాల్లో సుమారు రూ. 21,000 కోట్ల భారీ పెట్టుబడితో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను నిర్మిస్తున్నాం. ఒక్కో పాఠశాలను 25 ఎకరాల విశాల ప్రాంగణంలో, అత్యాధునిక హంగులతో తీర్చిదిద్దుతున్నాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అనే తేడా లేకుండా విద్యార్థులందరూ ఒకే చోట చదువుకునేలా వీటిని రూపొందించాం" అని మంత్రి వివరించారు.

### మౌలిక సదుపాయాలకు పెద్దపీట

పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనపై మంత్రి మాట్లాడుతూ.. "అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా రూ. 642 కోట్లతో 59 వేల పనులు పూర్తి చేశాం. నిర్వహణ కోసం రూ. 146 కోట్లు కేటాయించాం. ముఖ్యంగా 2024 సెప్టెంబర్ నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ బడులకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. దీనికోసం ఏటా రూ. 140 కోట్లు ఖర్చు చేస్తున్నాం" అని వెల్లడించారు. యువతకు చదువుతో పాటు ఉపాధి నైపుణ్యాలు ఉండాలన్న లక్ష్యంతో 'తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేశామని, ఈ ఏడాది నుంచే కోర్సులు ప్రారంభమవుతాయని మంత్రి తెలిపారు. అలాగే ఐటీఐలను అడ్వాన్స్డ్ ట్రైనింగ్ సెంటర్లుగా మారుస్తున్నామన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. సీఎం దూరదృష్టితో 2024 డీఎస్సీ ద్వారా 10 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి, విద్యా ప్రమాణాలను పెంచామని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. టెక్నాలజీ మరియు విద్య కలిసి భవిష్యత్తును ఎలా నిర్మించాలనే దిశగా ఈటీ టెక్ ఎక్స్ వంటి వేదికలు ఉపయోగపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

# హీరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వెటర్ల పంపిణీ



**నేటి సాక్షి, కరీంనగర్ :** గ్రామీణ ప్రాంతాల మసీదు ఇమామ్‌ల సంక్షేమమే లక్ష్యంగా హీరా ఫౌండేషన్ కరీంనగర్ 25 ఏండ్లుగా ఉమ్మడి జిల్లాలో సేవలందిస్తున్నదని, ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ముఫ్తీ మహమ్మద్ ఘియాస్ మొహియుద్దీన్ అన్నారు. శనివారం నగరంలోని రేకుర్తి షేఖాన్ నగర్ లోని మసీద్-ఏ- షేఖాన్ లో, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని 50 గ్రామాల మసీదుల ఇమామ్‌లకు, వారి కుటుంబ సభ్యులకు శీతాకాలం దృష్ట్యా 100 స్వెటర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఫ్తీ ఘియాస్ మోహియొద్దీన్ మాట్లాడుతూ.. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో శీతాకాలం వచ్చినప్పుడల్లా గ్రామీణ ప్రాంతాల మసీదు ఇమామ్‌లకు రగ్గులు, బ్లాంకెట్లు, సోలాపూర్ బెడ్ సీట్లను అందజేస్తున్నామన్నారు. అంతే కాకుండా హీరా ఫౌండేషన్ ద్వారా రంజాన్ మాసంలో పేదలకు బియ్యం, వంట సామగ్రి, బక్రీద్ మాసంలో మాంసాన్ని పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఇదంతా దాతల సహకారంతో నిర్విరామంగా జరుపుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో హాఫిజ్ అహ్మద్ హిఫ్జి, కలీం షరీఫ్, హాఫీజ్ ఫరీద్, అబ్దుల్ రాఫె, మహమ్మద్ రఫీ అబ్దుల్ హమీద్ తదితరులు పాల్గొన్నారు.



# హైదరాబాద్‌లో కవిత 'జనం బాట'

### విద్యార్థుల కష్టాలపై ఆరా

- బాపూఘాట్‌లో నివాళులు.. దర్గాలో చాదర్.. గోశాలలో గోసేవ
- కార్వాన్, చాంద్రాయణగుట్ట నియోజకవర్గాల్లో జాగృతి అధ్యక్షురాలి విస్తృత పర్యటన
- బీసీ హాస్టల్ విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్న కవిత



**నేటి సాక్షి, హైదరాబాద్:**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేపట్టిన 'జాగృతి జనం బాట' కార్యక్రమం హైదరాబాద్ నగరంలో ఉత్సాహంగా సాగింది. కార్వాన్, చాంద్రాయణగుట్ట అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఆమె సుడిగాలి పర్యటన చేశారు. అన్ని వర్గాల ప్రజలను కలుస్తూ, వారి సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగారు. కార్వాన్ నియోజకవర్గంలోని బాపూఘాట్‌ను సందర్శించిన కవిత, జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ఘన నివాళులు అర్పించారు. అనంతరం లంగర్ హౌస్‌లోని దర్గాను సందర్శించి భక్తిశ్రద్ధలతో చాదర్ సమర్పించారు. మత సామరస్యానికి ప్రతీకగా ఆమె పర్యటన కొనసాగింది. జియాగూడలోని మేకల మండిని సందర్శించి అక్కడి వ్యాపారులు, కార్మికులను పలకరించారు. అనంతరం జియాగూడలోని గోశాలకు వెళ్లి గోవులకు స్వయంగా ఆహారాన్ని, గ్రాసాన్ని అందజేసి గోసేవలో పాల్గొన్నారు. చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో పర్యటించిన కవిత.. అక్కడ అద్దె భవనంలో కొనసాగుతున్న బీసీ హాస్టల్‌ను ఆకస్మికంగా సందర్శించారు. హాస్టల్ గదులను పరిశీలించి, విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను, వసతుల కొరతను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని విద్యార్థులకు భరోసా ఇచ్చారు.

# న్యూ ఇయర్ వేడుకలకు అనుమతి తప్పనిసరి

### పోలీసుల మార్గదర్శకాలు జారీ

**నేటి సాక్షి, హైదరాబాద్, డిసెంబర్ 13:**

నేటి సాక్షి, న్యూఇయర్ వేడుకల సందర్భంగా హైదరాబాద్ పోలీసులు కీలక మార్గదర్శకాలు జారీ చేశారు. డిసెంబర్ 31 అర్ధరాత్రి నుంచి జనవరి 1 వరకు జరిగే వేడుకలపై ఆంక్షలు విధించారు.. వేడుకల కోసం 3 స్టార్ హోటళ్లు, క్లబ్బులు, పబ్‌లు ముందుగానే అనుమతి తీసుకోవలని పోలీసులు తెలిపారు. వేడుకల నిర్వహణలో సీసీ కెమెరాలు, భద్రతా సిబ్బంది, ట్రాఫిక్ నియంత్రణ తప్పనిసరి అని వెల్లడించారు.. పోలీసులు ప్రకటన ప్రకారం.. రాత్రి 10 గంటల తర్వాత అవుట్‌డోర్ సౌండ్ సిస్టమ్స్‌కు అనుమతి లేదు.. ఇండోర్ కార్యక్రమాలు మాత్రమే రాత్రి 1 గంట వరకు నిర్వహించవచ్చు? మైనర్లకు ప్రవేశం నిషేధము.. డ్రగ్స్, అశ్లీల కార్యక్రమాలు, ÷ర్వర్ప్లకు పూర్తిగా నిషేధం విధిస్తున్నారు.. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు.. న్యూ ఇయర్ వేడుకలు సురక్షితంగా, క్రమబద్ధంగా జరగాలి.. నిర్వాహకులు, ప్రజలు పోలీసులకు పూర్తిగా సహకారించాలని పేర్కొన్నారు.

# సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

### వెల్లడించిన దక్షిణమధ్య రైల్వే



**నేటి సాక్షి, హైదరాబాద్:**

సంక్రాంతి పండగ సందర్భంగా ప్రయాణికుల డిమాండ్ మేరకు పలు ప్రత్యేక రైళ్లను నడపడానికి ఏర్పాట్లు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 4, 11, 18 తేదీల్లో సికింద్రాబాద్-అనకాపల్లె(07041), జనవరి 5, 12, 19 తేదీల్లోఅనకాపల్లె- సికింద్రాబాద్ (07042) రైలును నడుపనున్నారు. జనవరి 9,16,23 తేదీల్లో (శుక్ర) హైదరాబాద్-గోరక్‌పూర్ (07075), జనవరి 11, 18, 25 తేదీల్లో (ఆది) గోరక్‌పూర్-హైదరాబాద్ (07076) మధ్య ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు అధికారులు పేర్కొన్నారు. ఈనెల 21న మచిలీపట్నం- అజ్మీర్ (07274), 28న అజ్మీర్-మచిలీపట్నం(07275) మధ్య ప్రత్యేక రైలును నడపడానికి ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. శబరిమలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం జనవరి నెలలో నాలుగు ప్రత్యేకరైళ్లను నడపనున్నట్లు దక్షిణమధ్యరైల్వే ప్రకటించింది. చర్లపల్లి-కొల్లాం మార్గంలో నడిచే 07135/07136 ప్రత్యేకరైళ్లకు కాచిగూడ, కర్నూలు, డోన్, గుత్తి, కడప, తిరుపతి, కాట్పాడి, ఈరోడ్, త్రిచూర్, ఎర్నాకుళం స్టేషన్లలో హాల్ట్ సౌకర్యం కల్పించారు. 07135 ప్రత్యేకరైలు జనవరి 14, 21తేదీల్లో చర్లపల్లి నుంచి కొల్లాంకు బయల్దేరనుండగా, తిరుగు ప్రయాణంలో 07136 ప్రత్యేకరైలు కొల్లాం నుంచి చర్లపల్లికి బయల్దేరనుందని రైల్వే అధికారులు వెల్లడించారు.

# బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

### జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**నేటి సాక్షి, ఆదిలాబాద్:**


రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఓటర్లు బాధ్యతగా ఓటు హక్కును వినియోగించి వంద శాతం పోలింగ్‌కు సహకరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. శనివారం భోరజ్, జైనథ్, బేల, సాత్నాల మండలాల్లోని పోలింగ్ సామాగ్రి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను పరిశీలించి ఏర్పాట్లపై సిబ్బంకి సూచనలు చేశారు. ఆదివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. ఓటర్ స్లిప్‌తో పాటు 18 రకాల ఫోటో గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి తీసుకురావాలని సూచించారు.

# ఊపిరితిత్తులను సహజంగా ఇలా క్లీన్ చేసుకోవచ్చు.!

మన శరీరంలో ఊపిరితిత్తులు అనేవి అతి ముఖ్యమైన అవయవాలలో ఒకటి. ప్రస్తుత జీవనశైలిలో ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం. ఎందుకంటే పెరిగిపోతున్న కాలుష్యం, స్మోకింగ్ వంటివి ఊపిరితిత్తులను నాశనం చేస్తున్నాయి. కాబట్టి, ఊపిరితిత్తులను శుభ్రం చేస్తే, వాటి సామర్థ్యం పెరుగుతుంది. ఊపిరితిత్తులను సహజంగా ఎలా క్లీన్ చేసుకోవచ్చో ఇప్పుడు తెలుసుకుందాం..

**ఊపిరితిత్తులను ఇలా క్లీన్ చేయవచ్చు.. తులసి**

తులసి ఊపిరితిత్తులను సహజంగా శుభ్రపరచడంలో సహాయపడుతుంది. తులసిలో యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఉన్నాయి. ఇవి శ్వాసకోశ సమస్యల నుండి ఉపశమనం కలిగించడానికి సహాయపడతాయి. దీనిని తేనె, అల్లంతో కలిపి క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల దగ్గు, జలుబు వంటి సమస్యలకు కూడా ఉపశమనం లభిస్తుంది.



**అల్లం**

అల్లం కూడా ఊపిరితిత్తులను శుభ్రపరచడంలో సహాయపడుతుంది. ఇందులో యాంటీఇన్ఫ్లమేటరీ గుణాలున్నాయి. ఇవి శ్వాసనాళాల నుండి విషాన్ని తొలగించడంలో సహాయపడతాయి. అల్లం.. పొటాషియం, మెగ్నీషియం, బీటా-కెరోటిన్, జింక్ వంటి అనేక విటమిన్లు, ఖనిజాలను కలిగి ఉంటుంది. అల్లంలోని యాంటీఇన్ఫ్లమేటరీ లక్షణాలు శ్వాసకోశంలోని వాపును తగ్గించడంలో సహాయపడతాయి. క్రమం తప్పకుండా అల్లం నీరు తాగడం వల్ల ఊపిరితిత్తులు క్లీన్ అవుతాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.

**పసుపు**

పసుపులో ఉండే కర్కుమిన్ అనే సమ్మేళనం వల్ల ఊపిరితిత్తుల ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఇది మంటను తగ్గించి, శ్లేష్మం తొలగించడంలో సహాయపడుతుంది. పసుపు సహజంగా ఊపిరితిత్తులను శుభ్రపరచడానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి తోడ్పడుతుంది. ఇది శరీరం నుండి విషపదార్థాలను బయటకు పంపడానికి సహాయపడుతుంది, ఇది ఊపిరితిత్తుల పనితీరును మెరుగుపరుస్తుంది. పసుపును మీరు ఆహారంలో చేర్చుకోవడం ద్వారా మీ ఊపిరితిత్తులు సహజంగా క్లీన్ అవుతాయని నిపుణులు అంటున్నారు.




# డయాబెటిస్ వారికి ఎంతో మేలు చేసే పండ్లు ఇవే!

ఈ రోజుల్లో చాలా మంది చిన్న వయసులోనే వివిధ ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. వాటిలో డయాబెటిస్ కూడా ఒకటి. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం వంటి అంశాలు డయాబెటిస్‌కు కారణమవుతాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. అయితే, డయాబెటిస్ ఉన్నవారు తరచుగా ఏం తినాలి, ఏవ తినకూడదు అనే దాని గురించి ఆందోళన చెందుతారు. అయితే, డయాబెటిస్ ఉన్న వారికి ఈ పండ్లు ఎంతో మేలు చేస్తాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఈ పండ్లు షుగర్ లెవెల్స్‌ను కంట్రోల్ చేస్తాయని చెబుతున్నారు.

**సిట్రస్ పండ్లు:**

నిమ్మకాయలు, నారింజ, చిలగడదుంప వంటి సిట్రస్ పండ్లలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. సిట్రస్ పండ్లలో అనేక ఇతర పోషకాలు, శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. వీటిలో చక్కెర చాలా తక్కువగా ఉంటుందని నిపుణులు అంటున్నారు. వాటిలో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అందువల్ల, డయాబెటిస్ ఉన్నవారు వాటిని వారి రోజువారీ ఆహారంలో చేర్చుకోవాలని నిపుణులు అంటున్నారు.

**రాస్ప్బెర్రీస్:**

రాస్ప్బెర్రీస్‌లో కేలరీలు చాలా తక్కువగా ఉంటాయి. అవి మన శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లతో కూడా సమృద్ధిగా ఉంటాయి. రాస్ప్బెర్రీస్‌ను ప్రతిరోజూ తినడం వల్ల మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రయోజనకరంగా ఉంటుంది. వాటిని తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ఇవి జీర్ణక్రియను కూడా మెరుగుపరుస్తాయని నిపుణులు అంటున్నారు.

**స్ట్రాబెర్రీలు:**

చాలా మంది కొంచెం తీపిగా, కొంచెం పుల్లగా ఉండే స్ట్రాబెర్రీలలో చక్కెర ఎక్కువగా ఉంటుందని అనుకుంటారు. కానీ ఇది నిజం కాదు. 100 గ్రాముల స్ట్రాబెర్రీలలో 7 గ్రాముల చక్కెర మాత్రమే ఉంటుంది. అందువల్ల, మధుమేహ వ్యాధిగ్రస్తులు వాటిని నిస్సందేహంగా తినవచ్చని నిపుణులు అంటున్నారు.

**కివి:**

ఈ పండ్లలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు, ఇతర ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. వీటిని తినడం వల్ల గుండె ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. ఇవి ఎముకల ఆరోగ్యాన్ని కూడా ప్రోత్సహిస్తాయని నిపుణులు అంటున్నారు. 100 గ్రాముల కివి పండులో కేవలం 9 గ్రాముల చక్కెర మాత్రమే ఉంటుంది.

**అవకాడో:**

అవకాడోలో విటమిన్లు C, E, K, B ఉంటాయి. ఈ విటమిన్లు అనేక ఆరోగ్య సమస్యల నుండి రక్షించడంలో సహాయపడతాయి. వీటిని మీ రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల బరువు తగ్గవచ్చని నిపుణులు అంటున్నారు. ఇది మీ రక్తంలో చక్కెరను కూడా నియంత్రిస్తుంది. సగం అవకాడోలో 0.66 గ్రాముల చక్కెర మాత్రమే ఉంటుంది. అందువల్ల, మధుమేహ వ్యాధిగ్రస్తులు ప్రతిరోజూ అవకాడో తినాలని నిపుణులు సిఫార్సు చేస్తున్నారు.

# రక్త ప్రసరణపై చలిపంజా!

రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతున్నది. ఈ పరిస్థితి శరీరంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. రక్తనాళాలు కుచించుకుపోయి.. రక్తం గడ్డకట్టే ప్రమాదం ఉంటుంది. సరైన జాగ్రత్తలు తీసుకోకుంటే.. సమస్య మరింత ముదురుతుంది. చలికాలం వచ్చిందంటే.. కొందరిలో కాళ్లు, చేతులు ముడుచుకు పోతుంటాయి. వేళ్లలో వాపు, దురద లాంటి సమస్యలు కనిపిస్తాయి. వాతావరణంలో చలి పెరగడమే ఇందుకు కారణం. రక్త ప్రసరణపై చలి ప్రభావం వల్లే ఇలాంటి సమస్యలు ఎదురవుతాయని నిపుణుల మాట. ముఖ్యంగా మహిళల్లో ఈ సమస్య ఎక్కువ ప్రభావం చూపుతుంది. తెల్లవారుజామునే లేవడం, చలిలో వాకిలి ఊడ్చడం, కల్లాపి చల్లడం లాంటి పనులు చేస్తుంటారు.

వంట గదిలోనూ కూరగాయలు కడగడం, అంట్లు తోమడం లాంటి నీటితో చేసే పనుల్లోనే రోజంతా తలమునకలై ఉంటారు. చలి తీవ్రత, చల్లని నీటి ప్రభావం వల్ల వారి శరీరంలో సిరలు కుంచించుకుపోతాయి. దాంతో రక్త ప్రసరణ నెమ్మదిస్తుంది. కొన్నిరోజులకు రక్తం గడ్డకట్టడం మొదలవుతుంది. ఫలితంగా.. కాళ్లు, చేతుల వేళ్లలో



వాపు కనిపిస్తుంది. సమస్య ముదిరితే.. దురదతోపాటు నొప్పి కూడా వస్తుంది. దీనివల్ల రోజువారీ పనులలో తీవ్రమైన ఇబ్బంది కలుగుతుంది.

**సమస్యకు పరిష్కారం?**

చలికాలంలో చాలామందిలో కాళ్లు, చేతులలో వాపు సాధారణంగానే కనిపిస్తుంది. అయితే, నిర్లక్ష్యం చేస్తే తీవ్రమైన సమస్యగా మారుతుంది. ఎక్కువ చలిగా ఉన్నప్పుడు బయటికి రాకపోవడమే మంచిది. కాళ్లు, చేతులను కప్పి ఉంచేలా వెచ్చని దుస్తులు ధరించాలి. శరీరం డీహైడ్రేషన్‌కు గురవడం వల్లకూడా ఈ సమస్య కనిపిస్తుంది. కాబట్టి, తగినంత నీరు తీసుకోవాలి. వేళ్ల వాపును తగ్గించడానికి చిన్నచిన్న స్ట్రెచెస్, వ్యాయామాలను ఆశ్రయించాలి. సమస్య మరీ తీవ్రంగా ఉంటే.. వైద్యులను సంప్రదించాలి.

# రాత్రి పూట తినాల్సిన పండ్లు ఇవే..

## వీటిని తింటే ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి..!

ఎప్పటికప్పుడు సీజన్లలో లభించే పండ్లతోపాటు మనకు ఏడాది పొడవునా అందుబాటులో ఉండే పండ్లను తరచూ తినడం వల్ల మనకు ఎన్నో ఆరోగ్యకరమైన ప్రయోజనాలు కలుగుతాయన్న విషయం అందరికీ తెలిసిందే. అందుకనే పండ్లను రోజూ తినాలని పోషకాహార నిపుణులు, వైద్యులు సూచిస్తుంటారు. పండ్లను తినడం వల్ల అనేక పోషకాలు లభిస్తాయి. అనేక రకాల విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లను మనం పండ్ల ద్వారా పొందవచ్చు. ఇవి మనల్ని ఆరోగ్యంగా ఉంచేందుకు ఎంతగానో దోహదం చేస్తాయి. కొందరు పండ్లను కేవలం జ్వరం వచ్చినప్పుడు లేదా అనారోగ్యంగా ఉన్నప్పుడు మాత్రమే తింటారు. కానీ పండ్లను రోజూ తినాల్సిందేనని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. అయితే పగటి పూట పండ్లను తినడం వీలు కావడం లేదన్న వారు రాత్రి పూట వాటిని తినవచ్చు. కానీ రాత్రి పూట ఏ పండ్లను పడితే వాటిని తినకూడదు. రాత్రి పూట తినదగిన పండ్లు కొన్నే ఉన్నాయి. వాటిని ఆహారంలో భాగం చేసుకుంటే ఎంతో మేలు జరుగుతుంది.



**కివి పండ్లు..**

రాత్రి పూట తినదగిన పండ్లలో కివిలు ప్రథమ స్థానంలో నిలుస్తాయని చెప్పవచ్చు. ఈ పండ్లను తినడం వల్ల మన శరీరంలో సెరటోనిన్ ఉత్పత్తి అవుతుంది. ఇది నిద్రను ప్రేరేపించే హార్మోన్. దీని వల్ల ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మైండ్ రిలాక్స్ అవుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్రలేమి తగ్గుతుంది. అలాగే ఈ పండ్లను తింటుంటే యాంటీ ఆక్సిడెంట్లు పెద్ద మొత్తంలో లభిస్తాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడి, వాపులను తగ్గిస్తాయి. దీని వల్ల క్యాన్సర్ వంటి వ్యాధులు రాకుండా చూసుకోవచ్చు. కివి పండ్లను రాత్రి పూట తినడం వల్ల జీర్ణ వ్యవస్థకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ పండ్లలో అధికంగా ఉండే ఫైబర్ జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. దీని వల్ల ఆహారం సరిగ్గా జీర్ణం అవుతుంది. అజీర్తి తగ్గుతుంది. అలాగే మలబద్దకం నుంచి ఉపశమనం లభిస్తుంది.

**చెర్రీలు, అరటి పండ్లు..**

ఇక రాత్రి పూట తినాల్సిన పండ్లలో చెర్రీలు కూడా ఒకటి. ఈ పండ్లను తినడం వల్ల మన శరీరంలో మెలటోనిన్ ఉత్పత్తి అవుతుంది. ఇది కూడా నిద్రను ప్రేరేపిస్తుంది. ఒత్తిడి, ఆందోళన నిద్రలేమి సమస్యలు ఉన్నవారు రాత్రి పూట ఈ పండ్లను తింటుంటే ఉపయోగం ఉంటుంది. చెర్రీ పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఎక్కువగానే ఉంటాయి. ఇవి శరీర రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తాయి. దీంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఫలితంగా దగ్గు, జలుబు వంటి సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. ఇక రాత్రి పూట అరటి పండ్లను తినవచ్చు. కానీ కఫం అధికంగా ఉత్పత్తి అయ్యే వారు, అధిక బరువు ఉన్న వారు ఈ పండ్లను రాత్రి పూట తినకూడదు. మిగిలిన ఎవరైనా ఈ పండ్లను రాత్రి పూట తినవచ్చు. అరటి పండ్లను రాత్రి పూట తినడం వల్ల మెగ్నీషియం అధికంగా లభిస్తుంది. దీని వల్ల రాత్రి పూట నిద్రలో కాలి పిక్కలు పట్టుకుపోకుండా ఉంటాయి. అలాగే అరటి పండ్లలో ఉండే పొటాషియం శరీరంలో రక్త సరఫరాను మెరుగు పరిచి బీపీని నియంత్రిస్తుంది. దీని వల్ల రాత్రి పూట బీపీ పెరగకుండా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా అడ్డుకోవచ్చు.

**బెర్రీలు, అవకాడో..**

ఇక రాత్రి పూట బ్లూబెర్రీలు, రాస్ప్ బెర్రీలను కూడా తినవచ్చు. వీటిల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు మనకు నిద్ర చక్కగా పట్టేలా చేస్తాయి. నిద్రలేమిని తగ్గిస్తాయి. అలాగే క్యాన్సర్ కణాలతో పోరాటం చేస్తాయి. క్యాన్సర్లు రాకుండా అడ్డుకుంటాయి. రాత్రి పూట అవకాడో పండ్లను సైతం తినవచ్చు. వీటిల్లో ఉండే మెగ్నీషియం రాత్రి పూట కాలి పిక్కలు పట్టుకుపోకుండా చూస్తుంది. ఈ పండ్లలోని మోనో అన్‌శాచురేటెడ్ ఫ్యాట్లు కడుపు నిండిన భావనను కలిగిస్తాయి. దీంతో రాత్రి పూట ఆహారం ఎక్కువగా తినకుండా జాగ్రత్త పడవచ్చు. దీని వల్ల బరువు తగ్గడం తేలిగ్గా మారుతుంది. అలాగే రాత్రి పూట పుచ్చకాయలు, తర్బూజాలను కూడా తినవచ్చు. అతి మూత్ర వ్యాధి ఉంటే వీటిని తినకూడదు. రాత్రి పూట ఈ పండ్లను తినడం వల్ల శరీరంలోని ద్రవాలు సమతుల్యంలో ఉంటాయి. దీని వల్ల మలబద్దకం తగ్గుతుంది. అంతేకాకుండా నిద్ర చక్కగా పడుతుంది. ఇలా రాత్రి పూట ఆయా పండ్లను తింటుంటే ఎంతగానో మేలు జరుగుతుంది.

# రోజూ 30 నిమిషాల పాటు స్కిప్పింగ్ చేస్తే..

## ఎన్ని అద్భుతమైన లాభాలు కలుగుతాయో తెలుసా..?


ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ వ్యాయామం చేయాలన్న విషయం అందరికీ తెలిసిందే. ఒకప్పుడు ప్రజలు శారీరక శ్రమ ఎక్కువగా చేసేవారు. రోజూ ఏదో ఒక పనిలో నిమగ్నమై ఉండేవారు. దీంతో వారికి చక్కని వ్యాయామం జరిగేది. దీని వల్ల వారు ఆరోగ్యంగా ఉండేవారు. వృద్ధాప్యం వచ్చినా శారీరక దారుఢ్యం ఉండేది. కానీ ప్రస్తుతం యుక్త వయస్సులోనే అన్ని రోగాలను కొని తెచ్చుకుంటున్నారు. ఇందుకు ప్రధాన కారణం వ్యాయామం లేదా శారీరక శ్రమ లేకపోవడమే అని చెప్పవచ్చు. కనుక ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలంటే కచ్చితంగా రోజూ వ్యాయామం చేయాల్సి ఉంటుంది. అయితే మనకు అనేక రకాల వ్యాయామాలు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో చాలా మంది తమకు సౌకర్యవంతంగా ఉండే వ్యాయామాలను చేస్తుంటారు. ఇక అలాంటి వ్యాయామాల్లో స్కిప్పింగ్ కూడా ఒకటి. దీన్నే రోప్ జంపింగ్ లేదా స్కిప్పింగ్ రోప్స్ అని కూడా పిలుస్తారు. ఈ వ్యాయామాన్ని చాలా మంది చేస్తుంటారు. అయితే దీన్ని రోజూ చేయడం వల్ల మనకు అనేక లాభాలు కలుగుతాయి.

**గుండెకు చక్కని వ్యాయామం..**

స్కిప్పింగ్ ను రోజూ కనీసం 30 నిమిషాల పాటు చేస్తే ఎన్నో లాభాలు ఉంటాయని ఫిట్ నెస్ నిపుణులు చెబుతున్నారు. అయితే స్కిప్పింగ్ అసలు అలవాటు లేని వారు రోజుకు 30 నిమిషాలు చేయడం కష్టం అవుతుంది. కనుక ముందుగా 5 నిమిషాలతో ప్రారంభించాలి. క్రమంగా ఆ సమయాన్ని పెంచుతూ పోవాలి. దీని వల్ల రోజూ 30 నిమిషాల పాటు స్కిప్పింగ్ చేసే సామర్థ్యం వస్తుంది. ఇలా ఈ వ్యాయామం చేస్తే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. స్కిప్పింగ్ వల్ల గుండెకు చక్కని వ్యాయామం అవుతుంది. దీన్ని అత్యుత్తమ, ఖర్చు లేని కార్డియో వ్యాయామంగా చెప్పవచ్చు. దీని వల్ల శరీరంలోని అన్ని అవయవాలకు రక్తం, ఆక్సిజన్ సరఫరా సక్రమంగా అవుతాయి. రక్త సరఫరా మెరుగు పడుతుంది. బీపీ నియంత్రణలో ఉంటుంది. గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది. హార్ట్ ఎటాక్ రాకుండా చూసుకోవచ్చు.

**కొవ్వు కరుగుతుంది..**

స్కిప్పింగ్ వల్ల శ్వాసకోశ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. శరీరంలోని అన్ని భాగాలకు ఆక్సిజన్ సరఫరా పెరుగుతుంది. కార్బన్ డయాక్సైడ్ సులభంగా బయటకు వెళ్లిపోతుంది. స్కిప్పింగ్ చేయడం వల్ల శరీరంలోని అన్ని అవయవాలకు చక్కని వ్యాయామం అవుతుంది. ముఖ్యంగా పొట్ట, తొడలు, పిరుదులకు చక్కని వ్యాయామం అవుతుంది. దీంతో ఆయా



భాగాల్లో ఉండే కొవ్వు కరుగుతుంది. శరీరం సన్నగా నాజూగ్గా మారుతుంది. కండరాలు దృఢంగా మారి చక్కని దేహ దారుఢ్యం సొంతమవుతుంది. శరీరంలో శక్తి సామ ర్థ్యాలు పెరుగుతాయి. యాక్టివ్‌గా ఉంటారు. ఉత్సాహం గా పనిచేస్తారు. నీరసం, అలసట ఉండవు. బద్ధ కం పోతుంది. ఈ వ్యాయామం చేయడం వల్ల శరీరం లోని కొవ్వు సులభంగా కరిగిపోతుంది. రోజూ 30 నిమి షాల పాటు స్కిప్పింగ్ చేస్తే శరీరం సుమారుగా 300 క్యాలరీల వరకు శక్తిని ఖర్చు చేస్తుంది. దీంతో ఎంతో మేలు జరుగుతుంది. అధిక బరువు సులభంగా తగ్గుతారు.

# కోల్‌కతాలో 70 అడుగుల మెస్సీ విగ్రహం

## వర్చువల్‌గా ఆవిష్కరించిన ఫుట్‌బాల్ దిగ్గజం



ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి 'గోట్ టూర్ ఆఫ్ ఇండియా' ప్రారంభమైంది. శనివారం మెస్సి కోల్‌కతాకు చేరుకున్నాడు. ఆయనతో పాటు అతడి ఇంటర్ మియామి జట్టు సహచరులు రోడ్రిగో డిపాల్, లూయిస్ సూవారెజ్ ఇండియాకు వచ్చారు. మెస్సిని చూడటానికి అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఇదే సందర్భంలో కోల్‌కతాలో 70 అడుగుల మెస్సి విగ్రహావిష్కరణ జరిగింది. ఉదయం లేక్‌టౌన్‌లో తన 70 అడుగుల విగ్రహాన్ని బాలీవుడ్ నటుడు షారుక్ ఖాన్‌తో కలిసి మెస్సి వర్చువల్‌గా ఆవిష్కరించాడు. భద్రతా కారణాల రీత్యా అతడు అక్కడికి వెళ్లలేక పోయాడు. తన 70 అడుగుల భారీ విగ్రహంపై మెస్సీ ఎంతో సంతోషం వ్యక్తం చేసినట్లు పశ్చిమ బెంగాల్ మంత్రి, శ్రీభూమి స్పోర్టింగ్ క్లబ్ అధ్యక్షుడు సుజిత్ బోస్ తెలిపారు. ఈ 70 అడుగుల విగ్రహం ఫుట్‌బాల్ అభిమానులను ఆకట్టుకుంటోంది. ఫిఫా వరల్డ్‌కప్ ట్రోఫీని చేతబట్టుకున్న మెస్సీ రూపంలో ఈ విగ్రహాన్ని రూపొందించారు. 2022 ప్రపంచకప్ విజయానికి ఇది ప్రతీకగా నిలుస్తోంది. మేం మెస్సి మేనేజర్‌తో సంప్రదింపులు జరుపుతూనే ఉన్నాం. ఈ విగ్రహ నిర్మాణానికి మెస్సి యాజమాన్యం ముందు అనుమతి ఇచ్చింది. ఈ విగ్రహంపై మెస్సి ఎంతో సంతృప్తిగా ఉన్నాడు. ఎంతో సంతోషం వ్యక్తం చేశాడు. 70 అడుగుల ఎత్తుతో ఇంత భారీ మెస్సీ విగ్రహం ప్రపంచంలో మరెక్కడా లేదు. ఈ నిర్మాణాన్ని కేవలం 40 రోజుల్లో పూర్తి చేశాం. కోల్‌కతాకు మెస్సీ వస్తుండటంతో అభిమానుల్లో అపూర్వమైన ఉత్సాహం నెలకొంది' మంత్రి సుజిత్ బోస్ అన్నారు.

# మ్యాచ్ ఆడకుండానే వెనుదిరిగిన మెస్సీ

### కోల్‌కతాలో అభిమానుల ఆగ్రహం

### కుర్చీలు విరగ్గొట్టి హంగామా

### క్షమాపణలు చెప్పిన మమతా బెనర్జీ





ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సి భారత పర్యటన మొదలయ్యింది. మూడు రోజుల పాటు ఆయన ఇండియాలో పర్యటించనున్నారు. శనివారం కోల్‌కతాతో పాటు హైదరాబాద్‌లో ఆయన పర్యటించారు. ఈ ఉదయం కోల్‌కతాలో ఏర్పాటు చేసిన తన విగ్రహాన్ని వర్చువల్‌గా ఆవిష్కరించారు. అనంతరం సాల్ట్ లేక్ స్టేడియానికి ఆయన వెళ్లారు. కేవలం 10 నిమిషాలు మాత్రమే ఆయన అక్కడ ఉన్నారు. ఆ వెంటనే అక్కడినుంచి వెళ్లిపోయారు. ఆయనను చూడ్డానికి వచ్చిన ఫ్యాన్స్ తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. మ్యాచ్ ఆడతానని చెప్పి ఆడకుండా వెళ్లిపోయాడని ఫ్యాన్స్ తీవ్ర స్థాయిలో రెచ్చిపోయారు. ఆగ్రహం వ్యక్తం చేస్తూ స్టేడియంలో కుర్చీలు విరగ్గగొట్టారు. విరగ్గొట్టిన కుర్చీలను సాల్ట్ లేక్ స్టేడియంలోని ట్రాక్‌పై పడేశారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇక, ఈ సంఘటనపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందించారు. మెస్సీకి క్షమాపణ చెప్పారు. ఈ మేరకు ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'సాల్ట్ లేక్ స్టేడియంలో నిర్వాహణ లోపం గురించి తెలిసి షాక్‌కు గురయ్యాను. బాధ కూడా వేసింది. నేను స్టేడియానికి వస్తూ ఉన్నాను. లియోనల్ మెస్సి, స్పోర్ట్స్ లవర్స్, మెస్సి ఫ్యాన్స్‌కు క్షమాపణ చెబుతున్నాను. సంఘటనపై నేను ఎంక్వైరీ కమిటీ వేస్తున్నాను. కమిటీ ఈ సంఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు చేస్తుంది. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూసుకుంటాము. మరో సారి స్పోర్ట్స్ లవర్స్‌కు నా హృదయ పూర్వక క్షమాపణలు చేబుతున్నాను' అని ఆమె అన్నారు. కాగా, మరికాసేపట్లో మెస్సి హైదరాబాద్ బయలుదేరుతారు. రాత్రి ఏడు గంటల సమయంలో ఉప్పల్ స్టేడియంలో జరిగే ఫుట్‌బాల్ మ్యాచ్‌లో పాల్గొంటారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. మెస్సితో ఫుల్‌బాల్ ఆడనున్నారు.

# నేడు సౌతాఫ్రికాతో మూడో టీ20

## ధర్మశాల వేదికగా టఫ్ ఫైట్



ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా సౌతాఫ్రికాతో రెండో టీ20లో ఓడిన టీమిండియా మరో పోరుకు సిద్ధమైంది. ధర్మశాల వేదికగా ఆదివారం జరిగే మూడో టీ20లో ఇరు జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. తొలి రెండు మ్యాచ్‌ల్లో భారత్, సౌతాఫ్రికా చెరొక మ్యాచ్ గెలిచాయి. దాంతో ఐదు టీ20ల సిరీస్‌లో ఇరు జట్లు 1-1తో సమంగా నిలిచాయి. పేలవ బౌలింగ్, చెత్త బ్యాటింగ్‌తో రెండో టీ20లో ఓడిన టీమిండియా.. ఆ తప్పిదాలను సవరించుకొని మళ్లీ విజయాల బాట పట్టాలని భావిస్తుండగా.. అదే జోరును కొనసాగించి సిరీస్‌పై పట్టు సాధించాలనే యోచనలో ఆతిథ్య సౌతాఫ్రికా ఉంది. తొలి రెండు మ్యాచ్‌లు ఏకపక్షంగా ముగియడంతో మూడో టీ20 అయినా రసవత్తరంగా సాగుతుందని అభిమానులు ఆశిస్తున్నారు. తొలి రెండు టీ20ల్లో దారుణంగా విఫలమైన టీమిండియా ఓపెనర్, వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌పై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గాయం నుంచి కోలుకొని ఈ సిరీస్‌తోనే రీఎంట్రీ ఇచ్చిన శుభ్‌మన్ గిల్ 4, 0 పరుగులతో తీవ్రంగా నిరాశపర్చాడు. గిల్ కోసం అసాధారణ ప్రదర్శన కనబర్చిన సంజూ శాంసన్‌ను టీమిండియా మేనేజ్‌మెంట్ పక్కనపెట్టింది. కానీ గిల్ మాత్రం ఇచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం లేదు. సంజూ తర్వాత 14 ఇన్నింగ్స్‌ల్లో ఓపెనింగ్ చేసిన గిల్ ఒక్క హాఫ్ సెంచరీ కూడా చేయలేదు. ఆసియా కప్‌లో పాకిస్థాన్‌పై చేసిన 47 పరుగులే అత్యధికం. ఈ గణంకాల నేపథ్యంలోనే గిల్‌ను తప్పించి సంజూ శాంసన్‌ను ఓపెనర్‌గా కొనసాగించాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. కానీ గిల్‌కు టీమిండియా మేనేజ్‌మెంట్ మరో అవకాశం ఇవ్వచ్చు. ఒకవేళ గిల్‌ను తప్పిస్తే మాత్రం సంజూ ఓపెనర్‌గా బరిలోకి దిగుతాడు. మరో ఓపెనర్ అభిషేక్ శర్మ రెండు టీ20ల్లో నిరాశపర్చాడు. భారీ షాట్లతో విరుచుకుపడినా పెద్ద స్కోర్లు నమోదు చేయలేకపోయాడు. మూడో టీ20లో అతను చెలరేగాల్సి ఉంది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ పరిస్థితి మరి దారుణంగా తయారైంది. గతేడాదిగా అతను తీవ్రంగా తడబడుతున్నాడు. కనీసం ఈ మ్యాచ్‌లోనైనా అతను బ్యాట్ ఝులిపించాల్సి ఉంది. నాలుగో స్థానంలో తిలక్ వర్మ పర్వాలేదనిపించాడు. గత మ్యాచ్‌లో హాఫ్ సెంచరీతో ఒంటరి పోరాటం చేశాడు. అక్షర్ పటేల్ స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చలేదు. తొలి టీ20లో సత్తా చాటిన హార్దిక్ పాండ్యా.. రెండో మ్యాచ్‌లో నిరాశపర్చాడు. శివమ్ దూబే కూడా చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడలేదు. జితేష్ శర్మ తన వంతు సహకారం అందిస్తున్నాడు. స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా వరుణ్ చక్రవర్తి సత్తా చాటుతున్నాడు. జస్‌ప్రీత్ బుమ్రా పర్వాలేదనిపిస్తున్నా.. అర్ష్‌దీప్ సింగ్ నిలకడలేమి ప్రదర్శనతో జట్టు పరాజయానికి కారణమయ్యాడు. అతను మెరుగ్గా రాణించాల్సి ఉంది.

**భారత్ తుది జట్టు(అంచనా)**

శుభ్‌మన్ గిల్/సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, జితేష్ శర్మ, అక్షర్ పటేల్, జస్‌ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్ సింగ్

**భారత టీ20 టీమ్**

శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, జితేష్ శర్మ,సంజూ శాంసన్, అక్షర్ పటేల్, జస్‌ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్.

# అభిషేక్ శర్మ కింగ్ కోహ్లీని బీట్ చేస్తాడా..?



భారత యువ ఓపెనర్ అభిషేక్ శర్మ ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారారు. సౌతాఫ్రికాతో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత జట్టు తరపున ఆడుతున్న ఈ యువ సంచలనం.. ఇప్పుడు ఏకంగా టీమిండియా దిగ్గజం విరాట్ కోహ్లీ తొమ్మిదేళ్ల నాటి ఓ అరుదైన రికార్డును బద్దలు కొట్టేందుకు చేరువలో ఉన్నాడు. ఈ సిరీస్‌లోని మిగిలిన మూడు మ్యాచ్‌ల్లో అదుతే ప్రదర్శన చేస్తే, ఒక క్యాలెండర్ సంవత్సరంలో అత్యధిక టీ20 పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా చరిత్ర సృష్టించే అవకాశం అభిషేక్ ముందుంది. ప్రస్తుతం దక్షిణాఫ్రికా టీ20 సిరీస్‌లో ఆడుతున్న అభిషేక్ శర్మకు తొలి రెండు మ్యాచ్‌ల్లో మంచి ఆరంభాలు దక్కినా, వాటిని పెద్ద స్కోర్లుగా మలచలేకపోయాడు. రెండు మ్యాచ్‌ల్లోనూ 17 పరుగుల చొప్పున మాత్రమే చేసి పెవిలియన్ చేరాడు. దీంతో జట్టుకు ఆశించిన శుభారంభం దక్కలేదు. అయినప్పటికీ, మిగిలిన మూడు మ్యాచ్‌ల్లో అతడు అదరగొడితే, విరాట్ కోహ్లీ 2016లో నెలకొల్పిన ఓ భారీ రికార్డును బద్దలు కొట్టే అవకాశం ఉంది. భారత మాజీ సారథి విరాట్ కోహ్లీ 2016 క్యాలెండర్ సంవత్సరంలో అదుతే ఫామ్‌తో చెలరేగిపోయాడు. ఆ ఏడాది మొత్తం 31 టీ20 మ్యాచ్‌లు ఆడి ఏకంగా 1,614 పరుగులు సాధించి.. ఒక సంవత్సరంలో అత్యధిక టీ20 పరుగులు చేసిన భారత ఆటగాడిగా అప్పటికే రికార్డు సృష్టించాడు. ఈ రికార్డు ఇప్పటికీ పదిలంగా ఉంది. తాజా క్యాలెండర్ సంవత్సరం (2025)లో అభిషేక్ శర్మ అదుతేమైన ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. ఇప్పటివరకు 39 టీ20 మ్యాచ్‌లు ఆడిన ఈ యువ ఓపెనర్ 1,533 పరుగులు సాధించాడు. ఇప్పటికే అతడు 2022లో సూర్యకుమార్ యాదవ్ (1503 పరుగులు) నెలకొల్పిన రికార్డును అధిగమించాడు. ఇప్పుడు అభిషేక్ దృష్టి మొత్తం విరాట్ కోహ్లీ రికార్డు మీదే ఉంది. కోహ్లీ రికార్డును అధిగమించాలంటే అభిషేక్ శర్మకు ఇంకా కేవలం 82 పరుగులు మాత్రమే అవసరం. దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో ఇంకా మూడు మ్యాచ్‌లు ఉండగా, ఈ యువ బ్యాటర్ ఈ రికార్డును ఖచ్చితంగా బద్దలు కొట్టగలడని అభిమానులు ఆశిస్తున్నారు. భారత్, దక్షిణాఫ్రికా మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ప్రస్తుతం 1-1తో సమమైంది. మూడో టీ20 మ్యాచ్ డిసెంబర్ 14న ధర్మశాలలో జరగనుంది. ధర్మశాల మైదానంలో బౌండరీలు చిన్నగా ఉండటం, అలాగే తొలి ఇన్నింగ్స్ సగటు స్కోరు కూడా 187గా ఉండటం వల్ల బ్యాటర్లకు ఈ పిచ్ బాగా అనుకూలిస్తుంది. కాబట్టి, అభిషేక్ శర్మ ఈ మ్యాచ్‌లో మంచి స్కోరు చేసి రికార్డుకు చేరువయ్యే అవకాశం ఉంది. ఈ మ్యాచ్ సిరీస్‌కు కీలక మలుపుగా మారనుంది. అలాగే అభిషేక్ రికార్డుపై కూడా అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




# గూగుల్ ట్రెండ్స్‌లో టాప్ లేపిన సూర్యవంశీ

2025లో క్రికెట్ సంచలనం వైభవ్ సూర్యవంశీ పేరు మార్మోగిపోతోంది. ఈ ఏడాది ఐపీఎల్‌లో మొదలైన వైభవ్ జోరు ప్రస్తుతం జరుగుతున్న అండర్ 19 ఆసియా కప్‌లోనూ కొనసాగుతోంది. ఈ ఏడాదిలో వైభవ్ ఆయా టోర్నీల్లో కలిపి ఇప్పటిదాకా నాలుగు సెంచరీలు బాది ఔరా అనిపించాడు. ఈ క్రమంలో మరో అరుదైన ఘనత సాధించాడు. ఈ ఏడాది గూగుల్?లో అత్యధిక మంది సెర్చ్ చేసిన వ్యక్తుల పేర్లలో వైభవ్ సూర్యవంశీ టాప్ ప్లేస్ దక్కించుకున్నాడు. గత ఏడేనిమిది నెలలుగా క్రికెట్‌లో రాణిస్తుండడంతో ఈ యువ సంచలనం పేరు మార్మోగిపోతోంది. ఈ క్రమంలో గూగుల్‌లో అతడి గురించి సెర్చ్ చేసేవారి సంఖ్య కూడా అమాంతం పెరిగిపోయింది. దీంతో 2025 గూగుల్ సెర్చ్ ట్రెండ్స్‌లో భారత్‌లో అత్యధిక మంది సెర్చ్ చేసిన క్రికెటర్‌గా రికార్డ్ కొట్టాడు. కాగా, ఈ జాబితాలో ప్రియాంశ్ ఆర్య రెండో ప్లేస్‌లో ఉండగా, టీమ్‌ఇండియా యంగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ మూడో స్థానం దక్కించుకున్నాడు. ఇటీవల ముగిసిన మహిళల వన్డే వరల్డ్‌కప్ సెమీఫైనల్‌లో అదుతే శతకంతో భారత్‌ను గెలిపించిన జెమీమా రోడ్రిగ్స్ పేరు ఐదో ప్లేస్‌లో ఉంది. అయితే స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ కంటే వైభవ్ గురించే ఎక్కువ మంది శోధించడం ఇక్కడ మరో విశేషం. ఈ ఇద్దరు లెజెండ్స్ టాప్ 10లో కూడా లేరు. ప్రస్తుతం వైభవ్ అండర్ 19 ఆసియా కప్?లో ఆడుతున్నాడు. శుక్రవారం భారత్-యూఏఈ మ్యాచ్‌లో వైభవ్ 171 పరుగులతో భారీ ఇన్నింగ్స్ ఆడాడు. అయితే ఈ మ్యాచ్ అనంతరం గూగుల్ ట్రెండ్స్ గురించి అతడు స్పందించాడు. ఇలాంటి వాటిపై తాను పెద్దగా దృష్టి పెట్టనని అన్నాడు. "ఇలాంటి వాటిపై నేను దృష్టి పెట్టను. నా ఆటపైనే దృష్టి పెడతాను. దీని గురించి నేను విన్నాను. ఇవి బాగానే అనిపిస్తాయి. కానీ ఎక్కువగా వీటి గురించి ఆలోచించను. త్వరగా మూవ్ ఆన్ అయిపోతాను" అని మ్యాచ్ తర్వాత జరిగిన వైభవ్ అన్నాడు. కాగా, ఆసియా కప్ అండర్ 19లో యూఏఈపై తాజా మ్యాచ్‌లో చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీ ఆకాశమే హద్దుగా రెచ్చిపోయాడు. 95 బంతుల్లోనే 171 పరుగులు నమోదు చేశాడు. ఆకాశమే హద్దుగా చెలరేగిన అతడు 55 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఓవరాల్‌గా 95 బంతుల్లో 171 పరుగులు చేసి పెవిలియన్‌కు చేరాడు. ఈ ఇన్నింగ్స్‌లో ఏకంగా 14 సిక్స్‌లు, 9 ఫోర్లు బాదడం విశేషం. ఇక ఇటీవల సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలోనూ సెంచరీ నమోదు చేశాడు. ఈ క్రమంలోనే సయ్యద్ ముస్తాక్‌లో శతకం సాధించిన అతి పిన్న వయస్కుడి (14ఏళ్లు)గా రికార్డు సృష్టించాడు.

# కలెక్షన్స్‌లో అఖండ తాండవం



నందమూరి బాలయ్య నటించిన 'అఖండ 2' థియేటర్లలో మాస్ తుఫాను స ృష్టిస్తోంది. బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా డిసెంబర్ 11 రాత్రి ప్రీమియర్లతో ప్రారంభమై తొలి షో నుంచే పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. బాలయ్య నట విశ్వరూపం, హై వోల్టేజ్ యాక్షన్, ఆధ్యాత్మిక ఎలిమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్‌లోనూ షోస్ హౌస్‌ఫుల్‌గా నడుస్తున్నాయి. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం తొలి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ.65 నుంచి రూ.80 కోట్ల వరకు గ్రాస్ వసూలు చేసే అవకాశం ఉంది. ఇదే జోరు కొనసాగితే మొదటి వారంలోనే రూ.150 కోట్ల గ్రాస్ దాటే ఛాన్స్ ఉందని టాలీవుడ్‌లో చర్చ సాగుతోంది.బోయపాటి శ్రీను దర్శకత్వంలో నందమూరి బాలయ్య హీరోగా తెరకెక్కిన ' అఖండ 2 ' థియేటర్లలో భారీ రెస్పాన్స్‌తో దూసుకుపోతోంది. డిసెంబర్ 11 రాత్రి ప్రీమియర్లతో ప్రారంభమైన ఈ సినిమా విడుదలైన తొలి షో నుంచే పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. మాస్, యాక్షన్, ఆధ్యాత్మిక అంశాలు కలగలిసిన కథనం ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా బాలయ్య నట విశ్వరూపం, శివతాండవాన్ని తలపించే హై వోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలు అభిమానులకు పండగ వాతావరణాన్ని తీసుకొచ్చాయి. థియేటర్ల వద్ద భారీ రష్, హౌస్‌ఫుల్ బోర్డులు, ఫ్యాన్స్ సంబరాలు అన్నీ కలిసి 'అఖండ 2' ఆగమనాన్ని గ్రాండ్‌గా మార్చేశాయి. పెద్ద సినిమాలు ప్రస్తుతం థియేటర్లలో లేకపోవడం కూడా ఈ సినిమాకు కలిసొచ్చిందనే అభిప్రాయం వినిపిస్తోంది.సినిమాకు వచ్చిన పాజిటివ్ టాక్ ప్రభావం కలెక్షన్లపై స్పష్టంగా కనిపిస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్ మార్కెట్లలోనూ షోస్ ఫుల్ అవుతున్నాయని సమాచారం. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ట్రేడ్ అంచనాల ప్రకారం, బుక్ మై షోలో గంటకు సుమారు 10-15 వేల టికెట్లు బుక్ అవుతున్నట్లు చెబుతున్నారు. ఈ లెక్కన ప్రపంచవ్యాప్తంగా 'అఖండ 2' తొలి రోజు గ్రాస్ కలెక్షన్స్ రూ.65 కోట్ల నుంచి రూ.80 కోట్ల వరకు ఉండొచ్చని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రీమియర్స్ నుంచే ఈ స్థాయిలో బుకింగ్స్ రావడం బాలయ్య కెరీర్‌లో అరుదైన విషయమనే చెప్పాలి. మరోవైపు సాక్నిల్క్ వెబ్‌సైట్ ప్రచారం.. ప్రీమియర్స్‌తో కలిపి ఫస్ట్ డే తెలుగులో రూ.30.75 కోట్లు, కరా?టకలో రూ.3.77 కోట్లు, తమిళనాడులో రూ.1.13 కోట్లు, కేరళలో రూ.3లక్షలు, ఎన్నో ఆశలు పెట్టుకున్నరెస్టాఫ్ ఇండియాలో కేవలం రూ.5 లక్షలు మాత్రమే వసూలు చేసింది. ఓవరాల్‌గా చూసుకుంటే 'అఖండ 2' సినిమా ఫస్ట్ డే ఇండియాలో రూ.36.18 కోట్ల కలెక్షన్లు సాధించింది. ఈ కలెక్షన్ల విషయమై మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. 2021లో విడుదలైన 'అఖండ' కూడా కరోనా పరిస్థితుల్లోనే భారీ ఓపెనింగ్ సాధించింది. ఆ సినిమా అప్పట్లో తొలి రోజు సుమారు రూ.30 కోట్ల గ్రాస్ వసూలు చేసి సత్తా చాటింది. ఇప్పుడు సీక్వెల్‌గా వచ్చిన 'అఖండ 2' మాత్రం ఆ మార్క్‌ను చాలా రెట్లు దాటే అవకాశాలు ఉన్నాయని టాలీవుడ్ సర్కిల్స్‌లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా మాస్ ప్రేక్షకులు సినిమాను విపరీతంగా ఆదరిస్తుండటంతో వీకెండ్ నాటికి కలెక్షన్స్ మరింత ఊపందుకుంటాయని అంచనా. ట్రేడ్ విశ్లేషకుల మాట ప్రకారం, ఇదే జోరు కొనసాగితే మొదటి వారంలోనే 'అఖండ 2' దాదాపు రూ.150 కోట్ల వరకు గ్రాస్ వసూలు చేసే ఛాన్స్ ఉంది. బాలయ్య--బోయపాటి కాంబినేషన్‌కు ఉన్న నమ్మకం, అభిమానుల్లో ఉన్న ఉత్సాహం, సోషల్ మీడియాలో నడుస్తున్న పాజిటివ్ ప్రచారం ఇవన్నీ కలసి కలెక్షన్లను మరింత పెంచేలా కనిపిస్తున్నాయి. లాజిక్స్ కంటే ఎలివేషన్, మాస్ ఎమోషన్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చిన బోయపాటి టేకింగ్ బాలయ్య ఫ్యాన్స్‌ను ఫుల్‌గా అలరిస్తోంది.





# ఓటీటీలోకి రాజు వెడ్స్ రాంబాయి

తెలంగాణలోని ఖమ్మం జిల్లా ఇల్లెందులో జరిగిన ఓ యదార్థ సంఘటన ఆధారంగా తెరకెక్కిన చిత్రం రాజు వెడ్స్ రాంబాయి. కొత్త డైరెక్టర్ సాయిలు కంపాటి తెరకెక్కించిన ఈ ప్రేమ కథా చిత్రంలో అఖిల్ రాజ్, తేజస్విని రావు హీరో, హీరోయిన్లుగా నటించారు. వీరిద్దరికీ ఇదే మొదటి సినిమా కావడం గమనార్హం. అయినా తమ అద్భుత నటనతో ఆడియెన్స్ తో కన్నీళ్లు పెట్టించారు. ఇక సిద్దు జొన్నలగడ్డ సోదరుడు చైతన్య జొన్నలగడ్డ విలన్ పాత్రలో బాగా భయపెట్టాడు. ఈ సినిమాలో అతని నటనే హైలెట్ అని చెప్పుకోవచ్చు. నవంబర్ 21న విడుదలైన రాజు వెడ్స్ రాంబాయి సినిమా మొదటి షో నుంచే సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది. బాక్సాఫీస్ వద్ద అంచనాలకు మించి కలెక్షన్లు రాబట్టింది చాలా తక్కువ బడ్జెట్ తో తెరకెక్కిన ఈ రూరల్ లవ్ స్టోరీ రూ.17 కోట్ల కు పైగా కలెక్షన్లు రాబట్టింది. థియేటర్లలో సూపర్ హిట్ గా నిలిచిన ఈ సినిమాను ఓటీటీలో చూడాలని చాలా మంది ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. త్వరలోనే వీరి నిరీక్షణకు తెరపడనుంది. రాజు వెడ్స్ రాంబాయి సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ ఈటీవీ విన్ సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో డిసెంబర్ 19 నుంచి ఈ సినిమాను స్ట్రీమింగ్ కు తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు సోషల్ మీడియాలో రాజు వెడ్స్ రాంబాయి ఓటీటీ స్ట్రీమింగ్ పోస్టులు దర్శనమిస్తున్నాయి. త్వరలోనే దీనిపై ఒక అధికారిక ప్రకటన వెలువడవచ్చు.డా. నాగేశ్వర్ పూజారి సమర్పణలో ఈటీవీ విన్ ఒరిజినల్స్, డోలాముఖి సబాల్టర్న్ ఫిల్మ్స్, మాన్సూన్ టేల్స్ బ్యానర్లపై వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి ఈ సినిమాను సంయుక్తంగా నిర్మించారు. వంశీ నందిపాటి, బన్నీ వాస్ఈ మూవీని డిస్ట్రిబ్యూట్ చేశారు. శివాజీ రాజా, అనిత చౌదరి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాకు సురేష్ బొబ్బిలి సంగీతం అందించారు.


# స్టైలిష్ లుక్‌లో వెంకీ

టాలీవుడ్ సీనియర్ హీరో, విక్టరీ వెంకటేష్.. మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటిస్తున్న మన శంకర వరప్రసాద్ గారు సినిమాలో ఓ క్యామియో చేస్తున్న సంగతి తెలిసిందే. ఇవాళ వెంకటేష్ బర్త్ డే సందర్భంగా మేకర్స్ ఓ చిన్న గ్లింప్స్ ద్వారా ఆయన పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్ ను రిలీజ్ చేస్తూ వెంకీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ లుక్ లో వెంకీ చాలా స్టైలిష్ గా, రాయల్ గా కనిపిస్తున్నారు. హెలికాప్టర్ ముందు చుట్టూ బాడీ గార్డ్స్ తో వెంకీ చాలా హుందాగా కనిపిస్తున్నారు. వెంకటేష్ బర్త్ డే సందర్భంగా తన ఫ్రెండ్, టాలీవుడ్ సీనియర్ హీరో, మెగాస్టార్ చిరంజీవి కూడా ఆయనకు బర్త్ డే విషెస్ ను తెలుపుతూ పోస్ట్ చేశారు. నువ్వెక్కడున్నా నీ ప్రెజెన్స్ తో అక్కడ పాజిటివ్ వాతావరణాన్ని క్రియేట్ చేస్తావు, నీతో కలిసి చేసిన మన శంకరవరప్రసాద్ గారు షూటింగ్ లో ప్రతీ క్షణాన్నీ జీవితాంతం గుర్తుంచుకుంటాను, నీకు ఈ ఇయర్ అంతా మంచే జరగాలని కోరుకుంటున్నా అని రాస్తూ సినిమాలో ఇద్దరూ కలిసి ఉన్న ఓ ఫోటోను షేర్ చేశారు చిరంజీవి.



# ఆ హీరోయిన్‌కు ఎప్పుడు కలిసొస్తుందో?

మనమెంత కష్టపడినా, ఎన్ని ప్రయత్నాలు చేసినా దైవానుగ్రహం, కొద్దిపాటి అదృష్టం కూడా ఉంటేనే జీవితంలో అన్నీ అనుకున్నట్టు జరుగుతాయి. ఆ అదృష్టమే లేకపోతే ప్రతీదీ ఆఖరి వరకు వచ్చి రిజల్ట్ తేలే సమయానికి ఆగిపోతుంది. ఇప్పుడు సౌత్ హీరోయిన్ కృతి శెట్టి పరిస్థితి కూడా అలానే ఉంది. ఉప్పెన అనే తెలుగు సినిమాతో కృతి ఇండస్ట్రీకి పరిచయమైన సంగతి తెలిసిందే. మొదటి సినిమానే మంచి బ్లాక్ బస్టర్ గా నిలవడం, దానికి తోడు ఆ సినిమాలో తన నటనకు కృతికి మంచి పేరు రావడంతో టాలీవుడ్ లోకి మరో స్టార్ హీరోయిన్ వచ్చేసిందని అంతా అనుకున్నారు. దానికి తగ్గట్టే ఉప్పెన తర్వాత కృతికి అవకాశాలు కూడా క్యూ కట్టాయి. కానీ అవేవీ కృతికి స్టార్ డమ్ ను తెచ్చిపెట్టలేకపోయాయి. మరీ ముఖ్యంగా కృతి నుంచి తెలుగులో ఆఖరిగా వచ్చిన సినిమాలైతే దారుణమైన ఫలితాల్ని అందుకున్నాయి. ఉప్పెన తర్వాత కృతి చేసిన బంగార్రాజు, శ్యామ్ సింగరాయ్ తప్ప మిగిలిన సినిమాలైన మనమే, కస్టడీ, ది వారియర్, ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి సినిమాలైతే అమ్మడికి నిరాశనే మిగిల్చాయి. దీంతో క్రమంగా కృతికి తెలుగులో అవకాశాలు కూడా తగ్గాయి. ఇక చేసేదేమీ లేక కోలీవుడ్ లో లక్ ను టెస్ట్ చేసుకుందామని తమిళంకు వెళ్లి అక్కడ ప్రయత్నాలు చేసింది కానీ అది కూడా అమ్మడికి ఏ మాత్రం కలిసి రావడం లేదు. ఎంతో కష్టపడి అవకాశాలను అందుకుని, సినిమాలను పూర్తి చేసి సినిమాల ప్రమోషన్స్ వరకు అయితే చేయగలిగింది కానీ అవి ఆఖరి నిమిషంలో రిలీజ్ వాయిదా పడటంతో మరోసారి కృతికి నిరాశ తప్పడం లేదు. కార్తీతో చేసిన అన్నగారు వస్తారు మూవీపై ఎన్నో హోప్స్ పెట్టుకుని ఆ మూవీని ఎంతగానో ప్రమోట్ చేస్తే లాస్ట్ మినిట్ లో అది వాయిదా పడింది. డిసెంబర్ 12న రిలీజ్ కావాల్సిన సినిమా ఫిబ్రవరి అంటున్నారు కానీ అది కూడా కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. ఇక డిసెంబర్ 18న రిలీజ్ కావాల్సిన లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ కూడా వాయిదా పడుతున్నట్టు వార్తలొచ్చాయి. డైరెక్టర్ విఘ్నేష్ శివన్, నిర్మాతకు వచ్చిన విభేదాలే దీనికి కారణమని టాక్. దీంతో ఈ సినిమా కూడా వాయిదా పడింది. ఇక మరో సినిమా జీనీ కూడా ఎప్పుడో మొదలైంది కానీ ఇంకా రిలీజవలేదు. దాని గురించి ఎలాంటి అప్డేట్ లేదు. తెలుగులో ఆఫర్లు రావడం లేదని కోలీవుడ్ కు వచ్చి ఎప్పుడెప్పుడు సక్సెస్ అందుకుందామా అని కృతి చేస్తున్న ప్రయత్నాలు ఎప్పటికప్పుడు వాయిదా పడుతున్నాయే తప్పించి అమ్మడిని సక్సెస్ కు చేరువ మాత్రం చేయలేకపోతున్నాయి. మరి కృతిని తను కోరుకుంటున్న సక్సెస్ ఎప్పుడు వరిస్తుందో చూడాలి.



## ఆరు దేశాల్లో
# ధురంధర్ బ్యాన్

రణ్ వీర్ సింగ్ హీరోగా నటించిన లేటెస్ట్ సినిమా ధురంధర్. యురి ఫేమ్ ఆదిత్య ధార్ తెరకెక్కించిన ఈ సినిమాలో సారా అర్జున్ కథానాయికగా నటించింది. అలాగే అక్షయ్ ఖన్నా, సంజయ్ దత్, అర్జున్ రాంపాల్, మాధవన్ తదితర స్టారాది స్టార్స్ నటించారు. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించింది. ఈ చిత్రంలోని పాటలు, సన్నివేశాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. 'ధురంధర్' చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఇప్పటికే రూ. 300 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టింది. బాక్సాఫీస్ వద్ద రికార్డు వసూళ్లు రాబడుతున్న ఈ మూవీ గురించి ఒక షాకింగ్ న్యూస్ బయటకు వచ్చింది. ఈ సూపర్ హిట్ సినిమాపై నిషేధం విధించారు. ఒకటి కాదు, రెండు కాదు, ఆరు దేశాలు ఈ సినిమాను నిషేధించాయి. బహ్రెయిన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా మరియు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలు ఈ నిషేధాన్ని విధించాయి. స్పై థ్రిల్లర్ గా తెరకెక్కిన ధురంధర్ మూవీలో పాకిస్తాన్ కు వ్యతిరేకంగా సన్నివేశాలు ఉండడంతో ఇస్లామిక్ దేశాలు ఈ సంచలన నిర?యాన్ని తీసుకున్నాయి. గతంలో, 'స్కై ఫోర్స్', 'ఫైటర్', 'ఆర్టికల్ 370', 'టైగర్ 3' సినిమాలను కూడ ఈ దేశాలలో నిషేధించారు. అయితే ధురంధర్ చిత్ర బృందం తమకు ఆసమస్య రాకుండా శాయశక్తులా ప్రయత్నించింది. కానీ అది సాధ్యం కాలేదు. సెన్సార్ బోర్డు ఈ సినిమా రిలీజ్ కు అంగీకరించలేదు. ఈ సినిమా డిసెంబర్ 5న విడుదలైంది. అప్పటి నుండి, ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ. 300 కోట్లు, భారతదేశంలో రూ. 200 కోట్లు వసూలు చేసింది. ఈ వారాంతంలో ఈ సినిమా మరిన్ని వసూళ్లు రాబట్టే అవకాశం ఉంది. కాగా చాలా సంవత్సరాల తర్వాత ఈ సినిమాతో రణ్‌వీర్ సింగ్ హిట్ కొట్టాడు. ఈ సినిమా అతని కెరీర్‌కు మంచి మైలేజ్ ఇచ్చింది. వివాదాలు ఉన్నప్పటికీ, సినిమాకు భారీ కలెక్షన్లు సాధిస్తున్నాయి. అయితే ఇప్పుడు నిషేధం కూడా సినిమా కలెక్షన్లపై పెద్దగా ప్రభావం చూపదని తెలుస్తోంది.

Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : TGTEL/25/A1737 Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 966605221**

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
ఆదివారం
14 డిసెంబర్ 2025
9


# విద్యార్థి, యువజన సంఘాల ఉద్యమం ఉధృతం



- **జాతీయ నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా.. విద్యార్థి, యువజన సంఘాల ఉద్యమం ఉధృతం : ఆదర్శ్ ఎం సాజి**

**నేటి సాక్షి తిరుపతి(బాదూరు బాల) :** ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)-2020కు వ్యతిరేకంగా విద్యార్థి, యువజన సంఘాలతో కలిసి తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు ఆదర్శ ఎం సాజి తెలిపారు. కచీఫ్ ఆడిటోరియంలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఈ విధానం ద్వారా దేశంలోని విద్యా వ్యవస్థను "వ్యాపారీకరణ, కేంద్రీకరణ, మతీకరణ" చేయాలని ప్రయత్నిస్తున్నదని వారు ఆరోపించారు.రాష్ట్రంలో నిర్వహించిన ఓ సమావేశంలో మాట్లాడిన విద్యార్థి నేతలు, గత కొన్ని సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా దాదాపు 89 వేల ప్రభుత్వ పాఠశాలలు మూసివేయబడ్డాయని పేర్కొన్నారు. గత నాలుగేళ్లలో 65 లక్షలకు పైగా విద్యార్థులు చదువులు మానేశారని, ఇది ప్రైవేటు విద్యకు ప్రాధాన్యం ఇచ్చి ప్రభుత్వ విద్యాసంస్థలను నిర్లక్ష్యం చేయడం వల్లే జరిగిందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లోనే 12 వేలకుపైగా పాఠశాలలు ఒక్క ఉపాధ్యాయుడితోనే నడుస్తున్నాయని, ఒకే ఉపాధ్యాయుడు అన్ని తరగతులు, అన్ని విషయాలు బోధించాల్సి రావడం వల్ల పేద, అణగారిన వర్గాల పిల్లల విద్యా నాణ్యత తీవ్రంగా దెబ్బతింటోందని తెలిపారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రభుత్వ విద్యను క్రమంగా "విఛిన్నం" చేస్తోందని ఆరోపించారు. కేంద్ర విశ్వవిద్యాలయాల్లో ఫీజుల పెంపు, స్కాలర్‌షిప్‌ల కోతలతో విద్యను డబ్బు ఉన్నవారికే పరిమితం చేస్తున్నారని అన్నారు. దీంతో వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఆర్థిక భారాలు పెరుగుతున్నాయని తెలిపారు.ఇటీవలి కార్మిక చట్టాల మార్పులను కూడా వారు విమర్శించారు. ఇవి కార్మికులు, యువత, విద్యార్థులపై దాడిగా మారాయని, సాధారణ ప్రజల సంక్షేమంపై కేంద్రానికి నిజమైన నిబద్ధత లేదని ఆరోపించారు.పాఠ్యపుస్తకాల్లో మార్పుల పేరుతో చరిత్రను "వక్రీకరించే" ప్రయత్నాలు జరుగుతున్నాయని సమావేశం తీవ్రంగా ఖండించిందన్నారు. భగత్‌సింగ్, డా. బీఆర్ అంబేడ్కర్ వంటి స్వాతంత్ర్య సమరయోధుల పాఠాలను తొలగించి, వి.డి. సావర్కర్ వంటి వారిని జాతీయ నాయకులుగా ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. అలాగే హిందుత్వ భావజాలం, అశాస్త్రీయ అంశాలను పాఠ్యాం శాల్లోకి తీసుకువచ్చి శాస్త్రీయ దృక్పథం, లౌకిక విలు వలను దెబ్బతీస్తున్నారని అన్నారు.ఎన్ఈపీ-2020ను వారు "జాతీయ బహిష్కరణ విధానం"గా అభివర్ణిస్తూ, దీనికి వ్యతిరేకం గా రాష్ట్రవ్యాప్తంగా, జాతీయ స్థాయిలో ఉద్యమాలను కొనసాగిస్తామని ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఈ సమావేశం రాష్ట్రం మొత్తంలోనే కాక దేశవ్యాప్తంగా విద్యాసంస్థల్లో పోరాటాలకు నూతన ఉత్సాహాన్ని ఇస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.విద్య హక్కుగా కొనసాగాలే తప్ప ఆదాయంపై ఆధారపడి ఉండే ప్రత్యేక హక్కుగా మారకూడదని వారు స్పష్టం చేశారు. ఇందుకోసం విద్యార్థులు, యువత, మహిళలు, రైతులు, కార్మికులు ఐక్య ఉద్యమానికి రావాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కే ప్రసన్న కుమార్ మాట్లాడుతూ మొదటిరోజు తిరుపతి నగరంలో ఉత్సాహంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర 25వ మహాసభలు ప్రారంభం అయ్యాయని తెలిపారు. రాష్ట్రంలో కోటను ప్రభుత్వం తీసుకొస్తున్న మెడికల్ కాలేజీల ప్రైవేటుకరణ కు వ్యతిరేకంగా ఉద్యమించాలని మహాసభ తీర్మానించిందని తెలిపారు. 8000 కోట్ల బకాయిలకు చేరిన ఫీజు రీయింబర్స్మెంట్ వెంటనే చెల్లించాలని కూడా పోరాటం ఉధృతం చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అక్బర్, కార్యదర్శి భగత్ రవి పాల్గొన్నారు.

# బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

**ప్రజా కళావేదిక చైర్మన్ అరవ జయపాల్**

**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) తిరుపతి :** బాలల హక్కుల పరిరక్షణ బాధ్యత అందరిదీ అని ప్రజా కళావేదిక వ్యవస్థాపక చైర్మన్ అరవ జయపాల్ అన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు బాలల హక్కులు, చట్టాల గురించి అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక ఎంసిహెచ్ యస్ మాడవీధిలో ప్రజా కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు హెడ్మాష్టర్ కె. ఆనందకుమార్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి హెచ్ ఎం కె. సోమ శేఖర్ రెడ్డి, టీచర్లు కె. వరలక్ష్మి (తెలుగు పండిట్), సునీత (సోషల్ స్టడీస్), పిడి సుధ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్బంగా జయపాల్ మాట్లాడుతూ, బాలల హక్కుల గురించి ప్రజల్లో చైతన్యం, అవగాహన కల్పించటం కోసం ప్రతి ఏటా నవంబరు 20వ తేదీన అంతర్జాతీయ బాలల హక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తారన్నారు. బాలల సంరక్షణ దేశానికి చాలా ముఖ్యమన్నారు. బాలల హక్కులను పరిరక్షించడం అందరి బాధ్యత అని, సమాజంలో ప్రతి ఒక్కరు ఈ హక్కుల పరిరక్షణ కోసం పాటుపడాలనీ అన్నారు. విద్య అనేది ప్రతి భారతీయ పౌరుడి యొక్క ప్రాథమిక హక్కు అని, విద్య ప్రతి ఒక్కరికీ మౌలికస్థాయిలో ఉచితంగా లభించాలనీ పేర్కొన్నారు. నిరరేధంగానైనా బాలలందరికీ విద్యా హక్కు అమలయినప్పుడే నవభారతంలో కాబోయే నూతన పౌరులు దేశాన్ని రక్షించుకోగలగుతారన్నారు. బాల కార్మికుల




సమస్య కొంతవరకూ తగ్గినప్పటికీ పూర్తిగా మాసిపోలేదన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం, బాలల సంక్షేమం కొరకు పార్లమెంటు కొన్ని చట్టాలు చేసిందన్నారు. జువైనల్ జస్టిస్ చట్టం, బాల కార్మికుల నిషేధ చట్టం, న్యాయసేవల చట్టం, ఉచిత నిరరేధ ప్రాథమిక విద్య హక్కు, బాలల అక్రమ రవాణా నిషేధ చట్టం, శిశు నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం, శిశు పౌష్టికాహార ఉత్పత్తి, సప్లై చట్టం వంటి ఎన్నో చట్టాలను చేసిందన్నారు. రాజ్యాంగం లోని ఆర్టికల్ 15 ద్వారా పిల్లల సంక్షేమానికి ప్రత్యేకమైన నిబంధనలు రూపొం దించవచ్చనీ, సమానత్వ హక్కు ఆర్టికల్ 14 ద్వారా, వివక్షకు వ్యతిరేకంగా హక్కు ఆర్టికల్ 15 ద్వారా వ్యక్తిగత స్వేచ్ఛ, న్యాయ ప్రక్రియ యొక్క హక్కు ఆర్టికల్ 21 ద్వారా, అక్రమ రవాణా నుంచి రక్షించబడే హక్కు ఆర్టికల్ 23 ద్వారా బాలలకు హక్కులు ఏర్పరచ బడ్డాయన్నారు. పిల్లలకు కూడా పెద్ద వారితో సమానంగా పన్నెండు బాలల హక్కులు ఇవ్వబడ్డాయన్నారు. పిల్లల హక్కుల పరిరక్షణకు తల్లిదండ్రులు, సంరక్షకులు బాధ్యత వహించాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా బాలల హక్కుల పట్ల పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నా గాని, ఆచరణలో సాధ్యం కావటం లేదన్నారు. బాలల హక్కుల గురించి భారత రాజ్యాంగంలో ఎన్నో అంశాలు పొందుపరచారన్నారు.

# పంచాయతీ ఎన్నికల పోలింగ్ ను సమర్థవంతంగా నిర్వహించాలి



- **జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్.**
- **పోలింగ్ డిస్ట్రిబ్యూషన్/రిసెప్షన్ కేంద్రాల పరిశీలన.**

**నేటి సాక్షి, నారాయణపేట డిసెంబర్ 13 :** నారాయణపేట జిల్లాలో రెండవ విడతలో ఆదివారం నారాయణ పేట, దామరగిద్ద, ధన్వాడ మరికల్ మండలాల పరిధిలోని గ్రామాలలో నిర్వహించనున్న గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ ను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. గ్రామపంచాయతీ రెండో సాధారణ ఎన్నికలు-2025లో భాగంగా శనివారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ధన్వాడ, నారాయణపేట పోలింగ్ సామాగ్రి డిస్ట్రిబ్యూషన్/ రిసెప్షన్ కేంద్రాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్బంగా కలెక్టర్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లోని ప్రతి కౌంటర్ ను, ఏర్పాట్లను పర్యవేక్షించారు. మొదటి విడత పోలింగ్ లో విధులు నిర్వహించిన వారిలో కొందరు రెండో విడత పోలింగ్ విధులకు నియమింప బడ్డారని, తొలి విడత ను విజయవంతంగా ముగించిన విధంగానే రెండో విడత పోలింగ్ ను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల సామాగ్రిని చెక్ లిస్ట్ ప్రకారం క్షుణ్ణంగా తనిఖీ చేసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా బ్యాలెట్ పేపర్లను ఒకటికి రెండుసార్లు క్షుణ్ణంగా చెక్ చేయాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే జోనల్, రూట్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను పాటిస్తూ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ ను పర్యవేక్షించే అవకాశం ఉందని, పోలింగ్ కేంద్రాల్లో కెమెరాలను ఎవరూ ఆఫ్ చేయవద్దని ఆమె సూచించారు. పోలింగ్ కేంద్రాల లోపలికి పోలీసులు వెళ్లరాదని, కేంద్రాల ఆవరణలోనే బందోబస్తు చేయాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లనున్న ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు.పోలింగ్ సిబ్బందికి ఏర్పాటు చేసిన భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు.రూట్, జోనల్, నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పోలింగ్ సిబ్బంది చెక్ లిస్ట్ ప్రకారం తమకు అందజేసే సామాగ్రిని జాగ్రత్తగా క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, అదనపు సామాగ్రి ఆర్.ఓ జోనల్ అధికారుల వద్ద ఉంటుందని అవసరమైన వారు ఆయా అధికారులను సంప్రదించాలని తెలిపారు. ఫామ్ 9 ప్రకారం సిబ్బంది తప్పనిసరిగా బ్యాలెట్ బాక్స్ చెక్ చేసుకోవాలన్నారు. ఆదివారం సరిగ్గా ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రక్రియను ప్రారంభించాలని, అలాగే మధ్యాహ్నం 2 గంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టాలనీ, ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత అబ్జర్వర్ ఆదేశాల అనంతరమే ఫలితాలను వెల్లడించాలని కలెక్టర్ ఆదేశించారు. పోలింగ్ , కౌంటింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం అందించిన సామాగ్రిని జాగ్రత్తగా సీల్ చేసి డిపాజిట్ చేయాలని పేర్కొన్నారు. సిబ్బందికి సందేహాలు ఉంటే డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ప్రత్యేకంగా ట్రైనింగ్ కూడా ఏర్పాటు చేశామని వాటి ద్వారా సందేహాలను నివృత్తి చేసుకొని ఎలాంటి పొరపాట్లు లేకుండా పోలింగ్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. కాగా జిల్లా అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వర్, శ్రీను దామరగిద్ద, మరికల్ పోలింగ్ సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ / రిసెప్షన్ సెంటర్లను సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారులు, ఎం పి డి ఓ లు, తహసీల్దార్లు, ఇతర ఎన్నికల సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు..

# ఎన్నికల నేపథ్యంలో నల్లబెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసుల కవాత్



**నేటి సాక్షి, నల్లబెల్లి ప్రతినిధి డిసెంబర్ 13 :** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సిఐ సాయి రమణ,ఎస్ ఐ వి. గోవర్ధన్ ఆధ్వర్యంలో పోలీస్ కవాతు నిర్వహించారు. ప్రజలు శాంతి యుత వాతావరణంలో స్వేఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో శాంతి భద్రతల పరిరక్షణ, ఎన్నికల పరిస్థితుల పర్యవేక్షణ కోసం వరంగల్ జిల్లా ఎస్పీ సున్ ప్రిత్ సింగ్ ఆదేశాల మేరకు, దుగ్గొండి సీఐ సాయి రమణ మార్గదర్శకత్వంలో నల్లబెల్లి ఎస్సై గోవర్ధన్ ఆధ్వర్యంలో శనివారం నల్లబెల్లి మండల కేంద్రంలో పోలీసు అధికారులు భద్రతా దళాలతో కలిసి పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందరరేగా సీఐ మాట్లాడుతూ, ఎన్నికలను ప్రజలు స్వేఛా,శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని, ప్రతి ఓటరు తన ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని సూచించారు. ఎలాంటి ఎవరైనా చట్టవ్యతిరేక చర్యలు,ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. పోలీస్ కవాత్ లో సిఐలు, ఎస్ఐలు, ఏఎస్ఐలు హెడ్ కానిస్టేబుళ్లు,కానిస్టేబుళ్లు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# జగిత్యాల జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి...

**మాజీ మంత్రి జీవన్ రెడ్డి..**



**నేటి సాక్షి - జగిత్యాల టౌన్ (పూరెళ్ల బాపు) :** టిపిసిసి సేవాదళ్ సెక్రెటరీ బోగోజి ముఖేష్ కన్నా ఆధ్వర్యంలో కాంగ్రెస్ సేవాదళ్ ఆన్లైన్ మెంబర్షిప్ కార్యక్రమాన్ని మాజీ మంత్రి జీవన్ రెడ్డి,డిసిసి అధ్యక్షులు గాజంగి నందయ్య లు ప్రారంభించారు. ఈ సందరరేగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీలో సేవాదళ్ ఆర్గనైజేషన్ చాలా కీలకమైనదని కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను పార్టీ కార్యక్రమాలను క్రింది స్థాయి వరకు తీసుకెళ్లేది కాంగ్రెస్ సేవాదళ్ కార్యకర్తలేనని సేవాదళ్ సభ్యత్వం లో కార్యకర్తలు ముందుండాలని తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలను పేద ప్రజలకు అందే విధంగా సేవా సేవాదళ్ కార్యకర్తలు కష్టపడాలని వారు పిలుపిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి,మాజీ మున్సిపల్ కౌన్సిలర్ గాజుల రాజేందర్, నాయకులు దేవనపల్లి రాజేందర్, నాగభూషణం,మహేందర్,వినయ్ రాకేష్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ నాయకులు బిఆర్ఎస్ పార్టీలో చేరిక




**నేటి సాక్షి,నారాయణపేట, డిసెంబర్ 13 :** నారాయణపేట జిల్లాలోని మక్తల్ మండలం చిన్నగోపుర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి గారు సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరన వారికి కండువా కప్పి బిఆర్ఎస్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు బిఆర్ఎస్ పార్టీలో చేరిన వారు తిరుపతి రెడ్డి,పెద్ద కురుమూర్తిగౌడ్, కావాలి ఆంజనేయుకురుమ, చిన్న హనుమంతు,పోతుల ఆంజనేయులు,నడిపికురు వనగౌడ్, బోయగోపాల్, బోయ ఆనంద్,రాంపురం నరసింహ గోప్లాపూర్ సర్పంచ్ అభ్యర్థి వీరారెడ్డి గారి కత్తెర గుర్తుకు ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామోహన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి.నరసింహ గౌడ్ పట్టణ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జుట్ల హనుమంతు గ్రామ టిఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచి కృష్ణయ్య శెట్టి విష్ణువర్ధన్ రెడ్డి శివ శంకర్ లక్ష్మణ్ నారాయణ గౌడ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
10
ఆదివారం
14 డిసెంబర్ 2025

# గ్లోబల్ రెయిన్ స్కూల్స్ కు ఎక్స్ లెన్స్ అవార్డు..



**నేటి సాక్షి పాలేరు ,డిసెంబర్ 13:** కూసుమంచి మండల కేంద్రంలోని గ్లోబల్ రెయిన్ స్కూల్స్ కు ఎక్స్ లెన్స్ అవార్డు లభించింది. శనివారం హైదరాబాద్ హైటెక్స్ లో ఈటీ టెక్ ఎక్స్ 6వ వార్షిక సమావేశంలో అవార్డును స్కూల్స్ కరస్పాడెంట్ మహ్మద్ ఎర్షాద్ అహ్మద్ కు బ్రెయిన్ ఫీడ్ మ్యాగజైన్ అధినేత బ్రహ్మం అందజేశారు. ఈ సందర్భంగా కరస్పాడెంట్ మాట్లాడుతూ.. తమ పాఠశాలలో క్రమ శిక్షణతో కూడిన విద్య, ఆధునిక బోధనా పద్ధతుల ద్వారా పిల్లలలో సృజనాత్మకత వెలికితీస్తున్నామని అందుకే అత్యంత ప్రతిష్టాత్మక అవార్డు తమ పాఠశాలకు లభించిందని తెలిపారు. విద్యార్థుల బహు ముఖాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. సృజనాత్మకత శక్తికి వెలికితీసేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యా ప్రమాణాలు, సామాజిక సేవ, వినూత్న బోధనా పద్ధతులు తదితర అంశాలలను పరిగణలోకి తీసుకొని అవార్డు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కరస్పాడెంట్ మహ్మద్ ఎర్షాద్ అహ్మద్ ను పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.


# అక్రమ మద్యం పట్టివేత

**పేట టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు**



**నేటి సాక్షి,నారాయణపేట, డిసెంబర్ 13 :** ఎన్నికల నిబంధనల అమలులో భాగంగా నారాయణపేట మండలం పేరపల్లి గ్రామంలోని అశోక్ గౌడ్ కిరాణా దుకాణంలో అక్రమంగా మద్యం నిల్వ ఉంచినట్లు పక్కా సమాచారం అందడంతో నారాయణపేట టౌన్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మొత్తం 181 లీటర్ల మద్యంను స్వాధీనం చేసుకొని నారాయణపేట టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారణలో స్వాధీనం చేసుకున్న మద్యం విలువ సుమారు రూ. 65,600/-లిగా నిర్ధారించబడిందని తెలిపారు. అక్రమంగా మద్యం నిల్వ ఉంచినందుకు సంబంధిత వ్యక్తి అశోక్ గౌడ్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని నారాయణపేట టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఎన్నికల సమయంలో అక్రమ మద్యం, డబ్బు పంపిణీపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

# రాజనాల బండ పై విశేష పూజలు



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి డిసెంబర్ 13 :** పుంగనూరు నియోజకవర్గం చౌడేపల్లి మండలంలో వెలసిన సత్య ప్రమాణాలకు పేరుగాంచిన రాజనాల బండ పై శనివారం విశేష పూజలు జరిగాయి టీటీడీ ఆధ్వర్యంలో ఉదయాన్నే ప్రధానార్చకులు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శ్రీ నరసింహ స్వామి క్షేత్రపాలకుడు ప్రసన్న ఆంజనేయ స్వామికి విశేష పూజలు నిర్వహించారు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కొందరు ప్రమాణాలు చేయగా మరికొందరు వాయిదాలు వేసుకొని వెళ్లారు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో భక్తుల రద్దీ కనిపించింది విశేష సంఖ్యలో వచ్చిన భక్తులకు టీటీడీ సిబ్బంది భోజన వసతి కల్పించారు.

# ఎన్డీఏ సర్కార్ అవలంబిస్తున్న విధానాలు ఏంటి..?

- సెషన్స్ కోర్టుల ఏర్పాటు విషయంలో ఎన్డీఏ సర్కార్ అవలంబిస్తున్న విధానాలు ఏంటి..?
- గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్లో సెషన్స్ కోర్టుల స్థాపనకు మంజూరు చేసిన నిధులు, వాటి వివరాలు
- కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు
- సానుకూలంగా స్పందించిన భారత ప్రభుత్వ చట్టం,న్యాయ శాఖ



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) చిత్తూరు (ఢిల్లీ) :** ఆంధ్రప్రదేశ్లో నూతనంగా విభజించిన జిల్లాలో సెషన్స్ కోర్టుల ఏర్పాటుకు సంబంధించి, ప్రభుత్వం అవలంబిస్తున్న విధి ,విధానాలను తెలియజేయాలని ఎన్డీఏ సర్కార్కు విజ్ఞప్తి చేశారు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు.గత ఐదేళ్లలో ఏపీలో సెషన్స్ కోర్టుల పునః విస్తరణకు, మంజూరు చేసిన నిధులు, వాటి వివరాలను తెలియజేయాలని ఆయన భారత ప్రభుత్వాన్ని కోరారు. ఏపీ కూటమి ఎంపీలు చేసిన విన్నపాన్ని మన్నించిన కేంద్ర చట్టం,న్యాయ శాఖ తక్షణం స్పందించిందనీ.., తాము కోరిన సమాచారాన్ని అందించినట్లు చిత్తూరు ఎంపీ తెలియజేశారు.న్యూఢిల్లీ పార్లమెంటు శీతాకాల సమావేశాలకు హాజరైన చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు.., తన కర్తవ్యాన్ని చిత్తశుద్ధితో నిర్వర్తిస్తున్నారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ప్రోత్సాహంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రగతి, తాను ప్రాతినిధ్యం వహిస్తున్న చిత్తూరు పార్లమెంటు అభివృద్ధి కోసం భారత ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, దీనికి సంబంధించిన నిధులను రాబట్టేందుకు సహచర ఎంపీల బృందంతో కలిసి, తన వంతు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఆంధ్రప్రదేశ్లో సెషన్స్ కోర్టులు ఏర్పాటు, కొత్తగా ఏర్పడిన జిల్లాల సంఖ్య, కొత్త జిల్లాల్లో సెషన్స్ కోర్టులను ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నుండి అందిన ప్రతిపాదనలు, ఆమోదానికి సంబంధించిన తాజా పరిస్థితి, ఏర్పాటుకు గడువులు, గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్లో సెషన్స్ కోర్టుల ఏర్పాటు, మంజూరు కోసం విడుదల చేసిన నిధులు, కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో సెషన్స్ కోర్టుల కార్యాచరణ, ఆలస్యమవుతున్న మౌలిక సదుపాయాలు, పరిపాలనా లేదా న్యాయపరమైన అంశాలను ప్రభుత్వం గుర్తించిందా..? అన్న వివరాలను జిల్లాల కోరారు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు.ఇందుకు వెంటనే స్పందించిన కేంద్ర చట్టం, న్యాయ శాఖ సహాయ మంత్రి, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ .. ఏపీ కూటమి ఎంపీల బృందం కోరిన అంశాలకు లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చినట్లు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు మీడియాకు వెల్లడించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 235 ప్రకారం, జిల్లా కోర్టులు, దాని కింద ఉన్న కోర్టులపై నియంత్రణ, జిల్లా జడ్జి అంతకంటే తక్కువ పదవిలో ఉన్న ఏదైనా పోస్టుతో పాటు, రాష్ట్ర జుడిషియల్ సర్వీస్‌కు చెందిన వ్యక్తుల పోస్టింగ్, ప్రమోషన్, సెలవు మంజూరుతో సహా హైకోర్టు పరిధిలో ఉంటుందని సంబంధిత శాఖ వివరణ ఇచ్చినట్లు తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, అమరావతి అందించిన సమాచారం ప్రకారం, ఆంధ్రప్రదేశ్లో కొత్తగా ఏర్పడిన 13 జిల్లాల్లో సెషన్స్ కోర్టుల ఏర్పాటు విషయంలో, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోందనీ, కేంద్ర ప్రభుత్వం 1993–94 నుండి జిల్లా , అధీన కోర్టులలో న్యాయవ్యవస్థ మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రాయోజిత పథకాన్ని అమలు చేస్తోందని కేంద్ర చట్టం, న్యాయ శాఖ సహాయ మంత్రి,పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జవాబు ఇచ్చినట్లు ఆయన తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం, రాష్ట్రం మధ్య నిధుల పంపిణీ నిష్పత్తి 60:40 అనీ, ఈ పథకం ప్రారంభం నుండి ఆంధ్రప్రదేశ్‌కు ₹286.37 కోట్ల కేంద్ర సహాయం అందించిందనీ.., ఇందులో ₹126.73 కోట్లు 2014–15 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన విషయాన్ని తమకు కేంద్ర న్యాయశాఖ తెలియపరిచినట్లు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు వివరించారు.

# ప్రజలు మరియు ప్రయాణికులు జాగ్రత్తలు వహించాలి

- శీతాకాలంలో ఉండే పొగ మంచు వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు మరియు ప్రయాణికులు జాగ్రత్తలు వహించాలి : జిల్లా ఎస్పీ నితిక పంత్



**నేటి సాక్షి కొమురం భీమ్ ఆసిఫాబాద్ :** శీతాకాలం తీవ్రంగా ప్రారంభమైన నేపథ్యంలో, తెల్లవారుజామున మరియు రాత్రి సమయంలో పొగమంచు (ఫాగ్) అధికంగా ఏర్పడుతుంది. ఈ పరిస్థితుల్లో రోడ్డు ప్రమాదాలు పెరిగే అవకాశం ఉన్నందున వాహనదారులు మరియు ప్రజలకు జిల్లా ఎస్పీ నితిక పంత్ పలు సూచనలు తెలిపారు. పట్టణాలు%--%గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా ఉదయం వాకింగ్ చేసే వారు రోడ్డు ప్రమాదాలకు గురి అయ్యే అవకాశం ఉంటుందని, పొగమంచు కారణంగా డ్రైవర్లకు ముందున్న వ్యక్తులు కనిపించకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అన్నారు. పొగమంచు సమయంలో వాహనదారులు తప్పనిసరిగా పాటించాల్సిన సూచనలు 1. హెడ్‌లైట్లు, ఫాగ్ లైట్లు ఎప్పటికప్పుడు ఆన్‌లో ఉంచాలిబీ ఎక్కువ పొగమంచు ఉన్నప్పుడు లో బీమ్ మాత్రమే వాడాలి. 2. వేగాన్ని నియంత్రించాలిబీ ఓవర్ స్పీడ్ పూర్తిగా నిషేధం. 3. ముందున్న వాహనానికి సురక్షిత దూరం తప్పనిసరిగా పాటించాలి.4. రోడ్డుపై ఉన్న వైట్ మార్కింగ్ లైన్స్‌ను దాటి వెళ్లకూడదు. 5. అవసరమైనప్పుడు మాత్రమే డిప్పర్– హారన్ వాడాలి. 6. వాహనంలోని ఇండికేటర్లు, బ్రేక్ లైట్లు, వైపర్లు సరిగా పనిచేస్తున్నాయో ముందే చెక్ చేసుకోవాలి. 7. ఎదురువారిని బ్లైండ్ చేసే హై బీమ్ వాడకూడదు. 8. టైర్లు, బ్రేకులు, వాహనం మొత్తం కండిషన్ ముందుగానే పరిశీలించాలి. 9. రోడ్డు పక్కన వాహనాలను అవసరం లేకుండా ఆపరాదుబీ ఆపాల్సి వస్తే పార్కింగ్ లైట్లు ఆన్ చేయాలి. 10. మద్యం సేవించి వాహనాలు నడపరాదు.

**రోడ్లపై వాకింగ్ చేసే ప్రజలకు ప్రత్యేక సూచనలు**

1. ఉదయాన్నే పొగమంచు ఎక్కువగా ఉండే సమయంలో హైవేలు, ప్రధాన రోడ్లపై వాకింగ్ చేయడం ప్రమాదకరం. 2. డ్రైవర్లకు విజిబిలిటీ తగ్గినప్పుడు ముందున్న వ్యక్తులు కనిపించకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ. 3. వాకింగ్ చేయాల్సిన వారు గ్రౌండ్స్, కాలనీలు, పార్కులు వంటి సురక్షిత ప్రదేశాలను మాత్రమే ఉపయోగించాలి. 4. రోడ్డు పక్కన నడవాల్సిన పరిస్థితిలో రెఫ్లెక్టివ్ దుస్తులు లేదా లైట్ కలర్ దుస్తులు ధరించడం మంచిది. 5. పిల్లలు, వృద్ధులు, మహిళలు రోడ్డు పక్కన వాకింగ్ చేయకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. "పొగమంచు ఎక్కువగా ఉండే ఉదయం 5 నుండి 8 గంటల వరకు, అలాగే రాత్రి 8 తర్వాత అనవసర ప్రయాణాలు చేయరాదని" సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రయాణించవద్దని, కుటుంబ సభ్యులు ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. "ప్రతి పౌరుడి ప్రాణ భద్రత మా ప్రాముఖ్యత. పొగమంచు సమయంలో తగిన విజిబిలిటీ ప్రమాదాలకు దారి తీస్తుంది. డ్రైవర్లు, వాకింగ్ చేసే వారు సూచనలు తప్పనిసరిగా పాటిస్తేనే ప్రాణాలను కాపాడుకోవచ్చు," అని ఎస్పీ పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 / 112 కు వెంటనే సమాచారం అందించవచ్చని తెలిపారు.

# విద్యార్థి లేనిదే ఏ ఉద్యమం లేదు..





- స్వాతంత్ర్యోద్యమంలోనూ వారిదే కీలకపాత్ర..
- ఉన్నత విద్యలో సమూల మార్పుకు నడుం బిగించాలి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభల్లో సంఘీభావ వక్తలు

**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :**'విద్యార్థి లేనిదే ఏ ఉద్యమం లేదని చరిత్ర చెబుతోంది...నాడు స్వాతంత్ర్యోద్యమంలోనూ విద్యార్థులకు కీలక భూమిక పోషించారు.. నేడు కాషాయీకరణ, వ్యాపారీకరణ, కేంద్రీకరణతో కూడిన నూతన విద్యను సమూలంగా మార్చాలంటూ బలమైన విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించాలి' అని వక్తలు పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు తిరుపతి కచ్చపి ఆడిటోరియంలో శనివారం రెండో రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా ఈ మహాసభలకు సంఘీభావం తెలుపుతూ రాష్ట్రసంఘాల ప్రతినిధులు ప్రసంగించారు. పిడిఎఫ్ మాజీ ఎంఎల్‌సి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ 'నేను ఎస్ఎఫ్ఐ నుంచే నాయకత్వ లక్షణాలు అలవరచుకున్నాను. ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన విద్యార్థి ఎన్నికల్లో పోటీచేసి జనరల్ సెక్రటరీగా ఎన్నికయ్యాను. తరువాత 25 ఏళ్లపాటు లెక్చరర్‌గా పనిచేశాను. 14 ఏళ్లపాటు పిడిఎఫ్ ఎంఎల్‌సిగా ఉన్నాను. ఇంత స్థాయికి రావడానికి కారణం ఎస్ఎఫ్ఐ క్రమశిక్షణ, ఉద్యమం నేర్పిన పాఠాలు. సమాజంలో పేదల కోసం విద్యార్థులు పని చేయాల్సిన అవసరం ఉంది. ఉన్నత విద్యను వ్యాపారమయంగా మార్చేశారు. ఇంజినీరింగ్ విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ అధ్యయనం చేసి పోరాటాల రూపకల్పన చేయాల్సిన అవసరం ఉంది. వారికోసం వర్కుషాపులు, శిక్షణా తరగతులు, టెక్నాలజీతో కూడిన శిక్షణ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేయాలి. ఎన్నికలకు ముందు అధికారంలోకి వచ్చిన వెంటనే జీవో 77 రద్దు చేస్తామని ప్రకటించిన మంత్రి నారా లోకేష్ విస్మరించారన్నారు. జగన్ హయాంలో ఆరు పాఠశాలలను చేస్తే, నారా లోకేష్ ఆధ్వర్యంలో తొమ్మిది రకాల పాఠశాలలుగా విభజించి 25వేల స్కూళ్ల మూతబడేలా చేశారన్నారు. రాష్ట్రంలో 66 లక్షల మంది ప్రజలు చదువుతుంటే 34లక్షల మంది పిల్లలు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో చదువు తున్నారన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఊరికి వెళ్లేటప్పుడు ఇంటికి ఏ విధంగా తాళం వేసుకుని వెళతామో స్కూలుకు వెళ్లే విద్యార్థులు కులం, మతాలన్నింటినీ ఇంటి గడప లోపలే వదిలేసి వెళ్లాలన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన ప్రతి ఒక్కరికీ చదువు అనేది నేటి పాలకులు విస్మరిస్తున్నారన్నారు. నాణ్యమైన, ఉన్నత విద్య అభివృద్ధికి ఎస్ఎఫ్ఐ చేసే పోరాటంలో యుటిఎఫ్ క్రియాశీలకంగా భాగస్వామ్యం అవుతుందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమం లేనిదే ఏ ఉద్యమమూ లేదన్నారు. సామ్రాజ్యవాద అమెరికాలో కీలకనగరమైన న్యూయార్క్‌లో సోషలిస్ట్ పవనాలు వీస్తున్నాయన్నారు. సామ్రాజ్యవాదం బీటలు వారుతుందనడానికి నిదర్శన మన్నారు. రాష్ట్రంలో 40శాతం మంది వ్యవసాయ కూలీల పిల్లలేనని అన్నారు. రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబాల్లో చదివించడమే ఎక్కువైతే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న నూతన విద్యా విధానం వల్ల డ్రాపౌట్స్ పెరిగే ప్రమాదం ఉందన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థి, కార్మిక సంఘాలు కలసి పని చేయాల్సిన అవసరం ఉంది. విద్యను వ్యాపారీకరణ చేసేశారు. ఎన్నో త్యాగాల ఫలితంగా సాధించుకున్న స్వాతంత్ర్య ఫలాలను అదానీ, అంబానీలకు ప్రధాని మోడీ దోచిపెడుతున్నారన్నారు. దేశంలో లేబర్‌కోడ్‌లను తెచ్చి కార్మిక శక్తిని బలహీనపరిచేందుకు మోడీ సర్కార్ కుట్ర పన్నుతుందన్నారు. దేశం క్లిష్టపరిస్థితులు ఉన్న నేపథ్యంలో బలమైన ఉద్యమం జరగాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో చంద్రబాబునాయుడు మోడీ కనుసన్నల్లో పాలన చేస్తున్నారు తప్ప స్వయం పాలన లేదన్నారు. కేరళలో కేంద్రం సహాయ సహకారాలు లేకపోయినప్పటికీ పేదరికాన్ని జయించిందన్నారు. సామ్రాజ్యవాదానికి సవాల్ విసురుతూ చైనా, క్యూబాలు ధీటైన ప్రత్యామ్నాయాలతో ముందుకు పోతున్నాయన్నారు. పాండిచ్చేరి యూనివర్సిటీలో ఇటీవల ఎన్నికైన యూనియన్ ఉపాధ్యక్షురాలు శ్రేష్ఠ ఎస్ఎఫ్ఐ ఉద్యమ ఫలితాలను వివరించారు. అఖిలభారత అధ్యక్షులు ఆదర్శ్ ఎం.సాజి, కార్యదర్శి శ్రీజన్ భట్టాచార్య, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కె.రామ్మోహన్, కె.ప్రసన్నకుమార్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అక్బర్, భగత్‌రవి పాల్గొన్నారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
ఆదివారం
14 డిసెంబర్ 2025


# ఇన్సిడెంట్ ఫ్రీగా ఎన్నికలు నిర్వహించాలి





- ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి పనిచేయాలి
- రెండవ విడత ఎన్నికలకు 700 మంది పోలీసు అధికారులు సిబ్బంది తో భారీ బందోబస్తు ఏర్పాటు
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలకాల మొహరంపు
- పేట ఎస్పీ డాక్టర్ వినీత్....

**నేటి సాక్షి,నారాయణపేట, డిసెంబర్ 13 :** రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యం లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా, నిరభయంగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఇన్సిడెంట్ ఫ్రీగా ఎన్నికల నిర్వహించాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. నారాయణపేట, దామరగిద్ద, ధన్వాడ, మరికల్ మండలాలలో ఎన్నికల విధులు నిర్వర్తించే పోలీసు అధికారులు, సిబ్బంది అందరికి నారాయణపేట జిల్లా కేంద్రంలోని గాయత్రి ఫంక్షన్ హాల్ లో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ భద్రతాపరమైన సూచనలు చేశారు. ఈ సందరరేగా ఎస్పీ మాట్లాడుతూ... గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో 700 మంది పోలీసు అధికారులు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని, నాలుగు మండలాలలో మొత్తం 28 రూట్లుగా విభజించి బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, ఏమైనా జరిగిన వెంటనే అక్కడికి చేరుకుని సమస్య పరిష్కరించేందుకు 05 స్ట్రైకింగ్ ఫోర్స్, 05 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ ఏర్పాటు చేయడం జరిగిందని వీరు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ అప్రమత్తంగా ఉండాలని, సంబంధిత పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే పోలీసులతో మాట్లాడుతూ ఉండాలని సూచించారు. అదేవిధంగా ఆయా పోలీస్ స్టేషన్ పరిదిలో ఉన్న మొబైల్ రూట్ లను, వాటి పరిధిలో కి వచ్చే గ్రామాలు, సమస్యత్మక పోలింగ్ కేంద్రాల వివరాలను, ఆక్కడ నియమించిన పోలీస్ అధికారుల వివరాలను పరిశీలించి ఆయా రూట్ లలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పై పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. పోలింగ్ రోజు, పోలింగ్ కేంద్రాల దగ్గరా పాటించాల్సిన నియమాలను తెలియజేశారు. పోలీస్ అధికారులు ఎలక్షన్ సమయంలో సమస్యలు సృష్టించే వారి పై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసు అధికారులు సిబ్బంది అందరూ ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి పని చేయాలని సూచించారు. ఎలక్షన్స్ సమయంలో పోలీసు అధికారులు ఎలక్షన్ రోజు, ఎలక్షన్ తర్వాత కౌంటింగ్ పూర్తి అయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాల పై పూర్తిగా అవగాహన కలిగి ఉండి, పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ రోజు పోలింగ్ స్టేషన్ల దగ్గర 163 (బి.యన్.ఎస్.ఎస్)యాక్ట్ అమల్లో ఉంటుందని, పోలింగ్ కేంద్రాల చుట్టూ 200 మీటర్ల లోపల ఎవ్వరినీ రానివ్వకూడదని ఓటు హక్కు వినియోగించుకోనే వారు పోలింగ్ కేంద్రాలకు ఎట్టి పరిస్థితిలో సెల్ ఫోన్లు, ఇంక్ బాటిల్స్,ఇతర హాని కలిగించే వస్తువులు తీసుకు రాకుండా జాగ్రత్తగా తనిఖీ చేయాలని అన్నారు. ఏదైనా సమస్య వస్తె వెంటనే సంబంధిత పై అధికారులు సమాచారం అందించాలని అన్నారు. ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులు విజయోత్సవ ఊరేగింపు, ర్యాలీలకు అనుమతి లేదని ఈ సందర్భంగా ఎస్పీ తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు నల్లపు లింగయ్య, మహేష్, రఘునాథ్, సీఐ లు ఎస్ఐ లు, పోలీసు సిబంది తదితరులు పాల్గొన్నారు.

# సాంఘిక గిరిజన సంక్షేమపాఠశాల ఆకస్మిక తనిఖీ




- సాంఘిక గిరిజన సంక్షేమపాఠశాలను ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ
- విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి
- విద్యార్థులకు సరైన ఆహారం అందించకపోతే చర్యలు తప్పవు
- ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు

**నేటి సాక్షి,బాపట్ల జిల్లా (బాపట్ల రూరల్) :** విద్యార్థులకు సరైన ఆహారం అందించకపోతే చర్యలు తప్పవు అని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు అన్నారు. బాపట్ల మండలం స్టువర్టుపురం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ గిరిన సంక్షేమ పాఠశాల ను బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ వేగేశన నరేంద్ర వర్మ రాజు ఆకస్మికంగా తనిఖీ చేసి పిల్లలకు మెను ప్రకారం పెడుతున్నారా అని నేరుగా పిల్లలను అడిగి తెలుసుకున్నరూ. మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని ఎమ్మెల్యే ద ృష్టికి తీసుకువచ్చిన విద్యార్థులు రోజూ కోడి గుడ్డు పెట్టడం లేదని, ఇప్పటివరకు స్వీట్ అసలు పెట్టలేదని ఎమ్మెల్యే ద ృష్టికి విద్యార్థులు తీసుకువచ్చారు. అదే విధంగా చాలీచాలకుండా భోజనం పెడుతున్నారని విద్యార్థులు వాపోయారు. వెంటనే ప్రిన్సిపల్ సోమయ్య పై బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు మండిపడ్డారు. ప్రభుత్వం చిన్నపిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేసినా పట్టించుకోకపోవడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సందరరేగా బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు మీడియాతో మాట్లాడుతూ ప్రిన్సిపాల్ సోమయ్య పై కలెక్టర్ డాక్టర్ వాసుదేవ వినోద్ కుమార్ కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. నాణ్యమైన ఆహారం విద్యార్థులకు అందించడంలో ఉద్యోగులు విఫలమయ్యారని విచారం వ్యక్తం చేశారు. చిన్న పిల్లలకు స్నాక్స్, స్వీట్, రాగి లడ్డు అసలు పెట్టడంలేదని, మిగిలిన ఆహారం చాలీచాలకుండా పెడుతున్నారని, వీరిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ద ృష్టికి తీసికెళతానన్నారు. ఆయన వెంట అధికారులు, నాయకులు తదితరులు ఉన్నారు.

# తమ్ముడి ఓటమి తట్టుకోలేక అక్క మృతి





- ఎన్నికల ఫలితాలు.. కుటుంబాన్ని కుదిపేశాయి
- సర్పంచ్ ఎన్నికల ఫలితాలతో గంభీర్ పూర్'లో విషాదం
- ఛాతినొప్పితో కుప్పకూలి మార్గమధ్యంలో ప్రాణాలు విడిచిన మహిళ

**నేటి సాక్షి - కథలాపూర్ ( రాధారపు నర్సయ్య ) :** జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం గంభీర్ పూర్ గ్రామంలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలు ఓ కుటుంబాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టాయి. గ్రామ మాజీ సర్పంచ్ పోతు రాజశేఖర్ మరోసారి సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలవగా, గురువారం జరిగిన మొదటి విడత ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఆయన ఓటమిపాలయ్యారు. ఈ వార్తను తట్టుకోలేక ఆయన అక్క కొక్కుల మమత (38) తీవ్ర మానసిక కలతకు గురయ్యారు.

## ఛాతినొప్పితో కుప్పకూలిన మమత

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రానికి చెందిన కొక్కుల మమత ప్రస్తుతం కోరుట్ల పట్టణంలో నివాసం ఉంటోంది. తమ్ముడు రాజశేఖర్ ఎన్నికల నేపథ్యంలో తన పుట్టినిల్లు అయిన గంభీర్ పూర్ గ్రామానికి వచ్చారు. అయితే తమ్ముడు ఓడిపోయాడనే బాధను పదేపదే మనసులో మోసుకుంటూ దిగులుతో ఉన్న మమతకు అకస్మాత్తుగా ఛాతినొప్పి రావడంతో స్పృహ తప్పి పడిపోయారు. వెంటనే కుటుంబ సభ్యులు హుటాహుటిన కోరుట్లలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించగా, మార్గమధ్యంలోనే ఆమె ప్రాణాలు విడిచినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

## విషాదంలో కుటుంబం, గ్రామస్తులు

మమత భర్త ఉపాధి నిమిత్తం సౌదీ అరేబియాలో ఉంటుండగా, ఆమెకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఒక్కసారిగా జరిగిన ఈ విషాద ఘటనతో గంభీర్పూర్ గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. సర్పంచ్ ఎన్నికల ఫలితాలు ఓ కుటుంబాన్ని ఇలా కుదిపేయడం గ్రామస్తులను కలిచివేసింది. మమత మ ృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తుండగా, గ్రామస్తులు పెద్ద ఎత్తున సంతాపం తెలిపారు.

# ప్రశాంతంగా ముగిసిన నవోదయ పరీక్షలు



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి డిసెంబర్ 13 :** పుంగునూరు నియోజవర్గం చౌడేపల్లి మండల కేంద్రమైన చౌడేపల్లి లో గల ఉన్నత పాఠశాలలో జవహర్ నవోదయ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ పరీక్షలు జవహర్ నవోదయ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశానికి గాను జరుగుతున్నట్లు ఎంఈఓ కేశవరెడ్డి తెలిపారు. ఇంగ్లీష్ మీడియం లో 124 మంది తెలుగు మీడియంలో 36 మంది మొత్తం 160 మంది విద్యార్థులకు ప్రవేశ పరీక్షలు నిర్వహించడం జరిగిందని ఆయన వివరించారు. ఇందులో బాలురు 89 మంది 71 మంది బాలికలు రాయాల్సి ఉండగా 24 మంది పరీక్షలకు గైహరాజరయ్యారన్నారు. చీఫ్ సూపర్ండెండెంట్ గా ప్రధానోపాధ్యాయుడు నాగరాజు రెడ్డి సి ఎల్ వో సెంటర్ లెవెల్ అబ్జర్వర్ గా నవోదయ పాఠశాల అధికారి శారద ల పర్యవేక్షణలో పరీక్షలు జరిగాయన్నారు. చౌడేపల్లి తహసిల్దార్ పార్వతి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు విజయ కుమార్,మంజుల, విఆర్ ఏ లు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**నేటి సాక్షి నల్లబెల్లి ప్రతినిధి డిసెంబర్ 13 :** సమయపాలన పాటిస్తూ ఎన్నికలను సమర్థవంతంగా పారదర్శకంగా నిర్వహించాలి. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద. రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికలను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికలు-2025లో భాగంగా శనివారం నల్లబెల్లి మండలంలోని సుమంగళి ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందరరేగా ప్రతి కౌంటర్‌ను తనిఖీ చేసి, ఎన్నికల సామాగ్రి చెక్‌లిస్ట్ ప్రకారం క్షుణ□ంగా పరిశీలించుకోవాలని సిబ్బందికి సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే జోనల్, రూట్ అధికారులకు తెలియజేయాలని అన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. పోలింగ్ సిబ్బందికి ఏర్పాటు చేసిన భోజన ఏర్పాట్లను కూడా పరిశీలించారు. ఫారం-9 ప్రకారం బ్యాలెట్ బాక్స్ తప్పనిసరిగా చెక్ చేయాలని, ప్రక్రియ ముగిసిన అనంతరం సామాగ్రిని సీల్ చేసి డిపాజిట్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రాం రెడ్డి, ఎంపీడీవో డాక్టర్ జె సుభానివాస్ తహసిల్దార్ ముప్పు క ృష□ జిల్లా ఎన్నికల పరిశీలకురాలు, మండల ప్రత్యేక అధికారులు, ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# 40 వేల మద్యం పట్టివేత

**మండలంలో అక్రమ మద్యం విక్రయాలపై టాస్క్ ఫోర్స్ దాడులు**



**నేటి సాక్షి,నల్లబెల్లి డిసెంబర్ 13 :** నల్లబెల్లి మండలంలో అక్రమ మద్యం విక్రయాలపై టాస్క్ ఫోర్స్ కఠిన చర్యలు చేపట్టింది. నమ్మదగిన సమాచారం మేరకు మెడపల్లి గ్రామంలో దాడులు నిర్వహించి పెద్ద ఎత్తున ఐఎంఎఫ్ఎల్ మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో మొత్తం రూ. 40,140 విలువైన మద్యం పట్టుబడింది. అక్రమంగా మద్యం విక్రయాలు చేస్తే చట్టం తప్పకుండా శిక్షిస్తుందన్న స్పష్టమైన సందేశం ఇచ్చారు. నిందితుడు పరారీలో ఉండగా పోలీసులు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. స్వాధీనం చేసిన మద్యాన్ని నల్లబెల్లి పోలీసులకు అప్పగించారు. ఎన్నికల వేళ అక్రమ కార్యకలాపాలను అరికట్టడమే లక్ష్యంగా అధికారులు పనిచేస్తున్నారు. చట్టాన్ని గౌరవిస్తే సమాజం సురక్షితంగా ఉంటుందన్నది ఈ చర్యల ఉద్దేశ్యం. గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం అవసరమని సూచించారు. అక్రమ మద్యం వల్ల కుటుంబాలు, యువత నష్టపోతారని హెచ్చరించారు. చట్టబద్ధమైన మార్గాల్లోనే ఉపాధి సాగించాలని పిలుపునిచ్చారు. ఇలాంటి దాడులు కొనసాగుతాయని టాస్క్ ఫోర్స్ స్పష్టం చేసింది. నిజాయితీగా జీవించడమే ఉత్తమ మార్గమని ఈ ఘటన గుర్తు చేస్తోంది. సమాజ శ్రేయస్సే లక్ష్యంగా పోలీసుల చర్యలు సాగుతున్నాయి. ప్రజలు కూడా చట్టానికి తోడ్పడుతూ బాధ్యతగా ఉండాలని అధికారులు కోరారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
12
ఆదివారం
14 డిసెంబర్ 2025

# రాష్ట్రాన్ని అప్పుల మయంలో నెడుతున్న సీఎం చంద్రబాబు..

## ఇన్ని అప్పులు చేసినా ఒక్క కొత్త పెన్షన్ అయినా ఇచ్చారా.. బొత్స సత్యనారాయణ



**నేటి సాక్షి అన్నమయ్య జిల్లా, శర్మ, డిసెంబర్ 13** : అన్నమయ్య జిల్లా :-: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అప్పుల అంధ్రప్రదేశ్ మారుస్తున్నారని మాజీ మంత్రి, వైయస్ఆర్‌సీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ ధ్వజమెత్తారు. చంద్రబాబు అప్పులే పరమావధిగా చేస్తున్నారని విమర్శించారు. ఇన్ని అప్పులు చేసినా ఒక్క కొత్త పెన్షన్ అయినా ఇచ్చారా అని బొత్స ప్రశ్నించారు. శనివారం విశాఖపట్నం నుంచి మీడియాతో బొత్స మాట్లాడుతూ ' చంద్రబాబు 18 నెలల కాలంలో 2 లక్షల 66 వేల కోట్లు అప్పులు చేశారు. చంద్రబాబు రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చారు. వైయస్ఆర్‌సీపీ హయాంలో చేసిన అప్పులకు లెక్కలు చెప్పాము. మరి కూటమి పాలనలో చంద్రబాబు చేసిన అప్పులకు ఎందుకు లెక్కలు చెప్పడం లేదన్నారు. వైయస్ఆర్‌సీపీ హయాంలో చేసిన అప్పులతో రాష్ట్రంలో మెడికల్ కాలేజీలు, పోర్ట్‌లు, ఆర్బీకేలతో పాటు అనేక అభివ ృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేశామని చంద్రబాబు చేసిన అప్పులు పారదర్శకంగా ప్రజలకు వివరించాలన్నారు. చంద్రబాబు ఇన్ని అప్పులు చేసినా ఒక్క కొత్త పెన్షన్ కూడా ఇవ్వలేదని మండిపడ్డారు..

# 98వ సారి రక్తదానం చేసిన మహ్మద్ బాబు జాన్

## అత్యవసర వేళ స్పందించిన సేవాభావం




**నేటి సాక్షి - కోరుట్ల ( రాధారపు నర్సయ్య ) :** సమాజ సేవలో ఆదర్శంగా నిలుస్తున్న మహ్మద్ బాబు జాన్ మరోసారి తన సేవా మనసును చాటుకున్నారు. అత్యవసర పరిస్థితిలో తక్కళ్లపెల్లి గ్రామానికి చెందిన దస్తగిరి అనే వ్యక్తికి చికిత్స నిమిత్తం సిద్ధిపేట జిల్లా ములుగు పట్టణంలోని ఆర్వీఎం (RVM) ఆసుపత్రిలో అవసరమైన Bo ఆర్‌డీపీ ప్లేట్‌లెట్స్‌ను దానం చేసి ప్రాణదాతగా నిలిచారు. తీవ్ర పరిస్థితుల్లో ఉన్న వ్యక్తికి సమయానికి ప్లేట్‌లెట్స్ అందడంతో వైద్యులు చికిత్స కొనసాగించగలిగారని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.

## 98వ రక్తదానంతో మైలురాయి

ఈ రక్తదానంతో మహ్మద్ బాబు జాన్ మెత్తం 98 సార్లు రక్తదానం చేసిన ఘనతను సాధించారు. సాధారణ రక్తదానంతో పాటు అవసరమైనప్పుడు ప్లేట్‌లెట్స్ డొనేషన్ కూడా చేస్తూ ఎన్నో కుటుంబాల్లో ఆనందం నింపుతున్నారు. రక్తం కొరత ఉన్న వేళల్లో స్వఛరేదంగా ముందుకొచ్చి సేవలందించడం ద్వారా యువతకు, సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని పలువురు ప్రశంసించారు.

## పుట్టినరోజు జరుపుకునే రక్తదాతలకు అంకితం

డిసెంబర్ నెలలో పుట్టినరోజు జరుపుకుంటున్న రక్తదాతలు, సామాజిక సేవకులకు ఈ 98వ రక్తదానాన్ని మహ్మద్ బాబు జాన్ అంకితం చేశారు. రక్తదానం చేయడం ద్వారా మనం మరొకరి జీవితానికి వెలుగు నింపగలమని, ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా రక్తదానం చేయాలని ఆయన ఈ సందఠరేగా పిలుపునిచ్చారు.

# మేగ్ గోపి స్కూల్ కు అరుదైన గౌరవం ఎక్సలెంట్ అవార్డు



**నేటి సాక్షి కొమరం భీమ్ ఆసిఫాబాద్ ప్రతినిధి డిసెంబర్ 13 :** హైటెక్ సిటీ హైదరాబాదులో , స్కూల్ ఎక్స్లెంట్ అవార్డ్. 2025-2026. ఎం.సి. మేగ్ గోపి హై స్కూల్ కాగజ్నగర్. కు ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శివరాత్రి .మరియు ట్రస్మా గౌరవ అధ్యక్షుడు యాదగిరి శేఖర్ రావు మరియు వివిధ జిల్లాల. అధ్యక్షుల ఈ అవార్డు అందరి సమక్షంలో ఇవ్వడం జరిగింది ఈ అవార్డును కరస్పాండెంట్ ఎండి తాజుద్దీన్ తీసుకోవడం జరిగింది. కొమరం భీం జిల్లాలో స్కూల్. ఎక్సలెన్స్ అవార్డు. మెగ్ గోపి హై స్కూల్. కు రావడం హర్షణీయమని కరస్పాండెంట్. తాజుద్దీన్. అన్నారు

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దుర్మార్గం..!

- కోటి సంతకాల సేకరణలో విద్యార్థి సంఘమే కీలకం
- 15న జరిగే మహా ర్యాలీని విజయవంతం చేయాలి
- విద్యార్థి సంఘం నేతలకు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పిలుపు



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :** గత ప్రభుత్వం నిర్మించిన మెడికల్ కాలేజీలను చంద్రబాబు ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడం దుర్మార్గమని రాష్ట్ర వైఎస్ఆర్‌సీపీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ఆరోపించారు. తిరుపతి రూరల్ మండలం తుమ్మల గుంటలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలకు ఉచిత వైద్యం, వైద్యవిద్యను దూరం చేయడం దుర్మార్గమైన చర్యగా భావిస్తున్నామన్నారు. చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న ప్రైవేటీకరణ నిర□యాన్ని తప్పుబడుతూ జగనన్న ఇచ్చిన పిలుపుతో సైన్యంలా కదిలిన పార్టీ కార్యకర్తలు, విద్యార్థి విభాగం నేతలు అనుకున్న సమయానికి కోటి సంతకాలను పూర్తి చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల నుంచి కోటి కంటే ఎక్కువగానే సంతకాలు సేకరించారంటే ప్రభుత్వం తీసుకున్న ఆ నిర□యాన్ని ప్రజలు ఎంతలా వ్యతిరేఖిస్తున్నారో పాలకులు గుర్తించాలన్నారు.

## 15న జరిగే ర్యాలీని విజయవంతం చేయండి

కోటి సంతకాల సేకరణలో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి సేకరించిన సంతకాల పత్రాలను అన్ని నియోజకవర్గాల నుంచి జిల్లా పార్టీ కార్యాలయంకు ఇప్పటికే చేర్చడం జరిగిందన్నారు. అయితే ఈనెల15వ తేదీన తిరుపతి నగరంలోని పద్మావతీపురంలో వున్న జిల్లా పార్టీ కార్యాలయం నుంచి తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంకు సంతకాలు పూర్తి చేసిన పత్రాలను పంపడం జరుగుతుందన్నారు. భారీ ర్యాలీగా ఆ కార్యక్రమంను నిర్వహించాలని పార్టీ పెద్దలు నిర□యించినందున ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి విద్యార్థి విభాగం నాయకులు తప్పక హాజరుకావాలన్నారు. తమ వద్దనున్న వాహనాలతో తిరుపతి పద్మావతీపురంలోని జిల్లా పార్టీ కార్యాలయంకు చేరుకోవాలన్నారు.

## విద్యార్థి విభాగం నేతలకు ధన్యవాదాలు

కోటి సంతకాల ప్రజా ఉద్యమంలో యూనివర్శిటీలు, కాలేజీల చుట్టు తిరిగి పెద్ద ఎత్తున విద్యార్థులను చైతన్య పరచి ప్రభుత్వ నిర□యానికి వ్యతిరేకంగా సంతకాలు సేకరించిన విద్యార్థి విభాగం నేతలు అందరికీ చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. సంతకాల సేకరణలో విద్యార్థులదే కీలకమైన పాత్ర కావడంతో ఆ విభాగం బాగా పనిచేసిందని, భవిష్యత్తులో కూడా ఇలాగే విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటం చేయాల్సి ఉంటుందన్నారు.

# రేగులగూడ సర్పంచ్ ఏకగ్రీవం

## ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరిక

### గ్రామ అభివృద్ధిని చేసుకుందాం



**నేటి సాక్షి కొమరం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి డిసెంబర్ 13 :** కాగజ్ నగర్ మండలంలోని రేగులగూడ గ్రామపంచాయతీ సర్పంచ్ గా సుశీలభాయి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉప సర్పంచ్ గా సోయం లచ్చు,మరో ఐదుగురు వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు, గ్రామాన్ని అన్ని రకాలుగా అభివ ృద్ధి చేసుకోవాలనే లక్ష్యంతో వారంతా డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ రోజు పార్టీ కండువా కప్పుకొని బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందఠరేగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ,సర్పంచ్ మరియు ఉపసర్పంచ్ ఇతర వార్డు సభ్యులందరికి డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అభినందనలు తెలిపారు. ఈ గ్రామ అభివృద్ధి కోసం ప్రభుత్వ నిధులతో పాటు ప్రపంచ దేశాల్లో పని చేస్తున్న ఎన్జీవోల సహాయం కూడా తీసుకొని ఆదర్శ గ్రామపంచాయితీగా తీర్చిదిద్దుతామని మాటిచ్చారు. సిర్పూర్ మార్పే నా ధ్యేయంగా పని చేస్తానని స్పష్టం చేశారు. ఇసుక,కలప,భూ దందాల వంటివి నాకు లేవని నేను కేవలం సిర్పూర్ ప్రజల అభివ ృద్ధి కోసమే వచ్చానన్నారు. అనంతరం కోసిని గ్రామపంచాయితీలో పర్యటించారు. సర్పంచ్ అభ్యర్థి వసాకె పుల్లభాయి బంతి గుర్తుకే ఓటేయాలని కోరారు. మిత్ర కాలనీలో ఇళ్లకు పట్టాలు రావాలన్నా,మిషన్ భగీరథ నీరు,కరెంట్ రోడ్డు సమస్యలు తీరుస్తామని మాటిచ్చారు. చింతగూడ కోయగూడ గ్రామ పంచాయితీలో తమ అభ్యర్థి లక్ష్మిని గెలిపించాలని కోరారు. ఇంతవరకు చింతగూడ కార్యకర్తలతో కలప దందా,ఇసుక దందా,మట్టి దందా చేసుకోవడానికి వాడుకున్నారని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో తమ అభ్యర్థిని గెలిపిస్తే ఈ గ్రామానికి దొంగల నుండి విముక్తి లభిస్తుందన్నారు. దరిగాం గ్రామపంచాయితీలోని ఎన్జివోస్ కాలనీలో ప్రచారంలో పాల్గొని తమ అభ్యర్థి కన్నయ్యను గెలిపిస్తే రోడ్లను కబ్జా చేసిన దొంగలను రోడ్డుకు ఈడ్చి,పేదలకు న్యాయం చేస్తామన్నారు. కరెంట్ మిషన్ భగీరథ,కరెంట్ స్తంభాలు వేయిస్తామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు, ఉద్యమకారులు, సీనియర్ నాయకులు కొంగ సత్యనారాయణ, వసాకె హన్మంత్, మినాజ్, పోషం, బాబర్, మహమూద్, కన్నయ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే వేగేశన



- బధిరుల ఆశ్రమ పాఠశాల విద్యార్థుల కు 6 లక్షల రూపాయలు 90 మంచాలు అందజేత
- ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు

**నేటి సాక్షి, బాపట్ల జిల్లా (బాపట్ల రూరల్) :** ఇచ్చిన మాట నిలబెట్టుకునే నాయకుడు ,ప్రజాసేవకుడు బాపట్ల నరేంద్ర వర్మ అని అనడం లో ఎటువంటి సందేహం లేదని అన్నారు. బాపట్ల మండలం వెదుళ్ళపల్లిలోని బధిరుల ఆశ్రమ పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం, సుమారు ₹6 లక్షల రూపాయల విలువగల 90 మంచాలను ఆయన శనివారం లాంఛనంగా అందజేశారు. ఈ సందఠరేగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ గతంలో ఇచ్చిన మాట ప్రకారం ఈ కార్యక్రమం లో శనివారం నాడు ఆయన సొంత నిధులతో రాయల్ మెరైన్ హేచరీస్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా 90 మంచాలు విద్యార్థులకు అందజేశాను. ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయడం నాకు ఎంతో సంతృప్తినిచ్చింది. వెదుళ్ళపల్లి బధిరుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మెరుగైన వసతి కల్పించడం మనందరి సామాజిక బాధ్యత అన్నారు. గతంలో ఈ పాఠశాలను సందర్శించినప్పుడు విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గమనించాను. వారికి మంచాలు సమకూరుస్తానని అప్పుడే మాట ఇచ్చాను. ఆ మాటను నిలబెట్టుకోవడం నాకు ఎంతో ఆనందాన్ని ఇస్తోంది. మన ప్రభుత్వం విద్యారంగానికి, ముఖ్యంగా ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది. నా నియోజకవర్గంలో ఏ ఒక్క విద్యార్థి కూడా వసతుల లేమితో ఇబ్బంది పడకూడదు అనేది నా లక్ష్యం. ఈ మంచాల వల్ల విద్యార్థులు హాయిగా, సౌకర్యవంతంగా చదువుకోవడానికి అవకాశం లభిస్తుంది. భవిష్యత్తులో కూడా ఈ పాఠశాల అవసరాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, వారికి అండగా ఉంటానని హామీ ఇస్తున్నాను. సమాజంలో ప్రతి ఒక్కరూ ఇలాంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ డిఎస్ రజియా, తెలుగుదేశం పార్టీ నాయకులు ఎస్.కె నిజాం, స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే అందించిన సహాయానికి బధిరుల పాఠశాల విద్యార్థులు, చేతిపై థాంక్యూ ఎమ్మెల్యే సార్ అని విద్యార్థులు ఎమ్మెల్యేకు విద్యార్థుల చేతి మీద రాసి చూపించారు. వారి సైగలతో తెలియపరిచారు. పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# సర్పంచుల ఫోరం- బిఆర్ఎస్ పార్టీ కైవసం

- సర్పంచుల ఫోరం అధ్యక్షులుగా మరాఠీ మల్లిక్...



**నేటి సాక్షి :** చందుర్తి మండల కేంద్రంలో శనివారం రోజున బిఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షులు మేకల ఎల్లయ్య ఆధ్వర్యంలో సమావేశమై ఇటీవల నూతనంగా ఎన్నికైన సర్పంచులు చందుర్తి మండల సర్పంచుల ఫోరం మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు అధ్యక్షులు- మరాటి మల్లిక్,ఉపాధ్యక్షులు- నరాగుల వాణి గంగస్వామి, ప్రధాన కార్యదర్శి-కొక్కుల నరేష్, కోశాధికారిగా- కపిల శంకర్, కార్యదర్శి భూక్య మోహన్, సహాయ కార్యదర్శి-ఎండి సహనాజ్ సమీర్. కార్యవర్గ సభ్యులు ,చిలక మర్లేశ్వరి అంజి బాబు, అసినపర్తి శోభా సుధాకర్, పోతరాజు భారతి , మందాల శారద అబ్రహంలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కేడీసీసీ డైరెక్టర్ జలగం కిషన్ రావు మాజీ ఏఎంసి చైర్మన్ దప్పుల అశోక్ మాజీ ఎంపీటీసీ దగ్గర రమేష్ రావు మాజీ సర్పంచ్ లు కమలాకర్ రావు, దుమ్మ ఆనంద్, భైరవని రమేష్ గుంటి గంగాధర్ గొల్లపల్లి పరశురాం ఆకుల ఎల్లయ్య గంగరాజు శేఖర్ రావు తదితరులు పాల్గొన్నారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
ఆదివారం
14 డిసెంబర్ 2025


# దుర్గం నగేష్ విశిష్ట కృషికి అంతర్జాతీయ గుర్తింపు




**నేటి సాక్షి గోదావరిఖని (రమేష్ ) :** సామాజిక సేవను బాధ్యతగా భావిస్తూ నిరంతరం ప్రజల కోసం పనిచేస్తున్న తెలంగాణకు చెందిన సామాజిక కార్యకర్త మార్షల్ దుర్గం నగేష్ (నాగేశ్వరరావు)కు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిషా'త్మక లభించింది. అమెరికా గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ ఆయనను డాక్టర్ ఆఫ్ సోషల్ సర్వీస్తో సత్కరించింది. సామాజిక సేవ రంగంలో ఆయన చేసిన విశిష్ట క ృషిని గుర్తించి ఈ గౌరవాన్ని ప్రకటించినట్లు యూనివర్సిటీ అధికారికంగా వెల్లడించింది.

## చెన్నైలో ఘనంగా కాన్వొకేషన్

గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ వార్షిక కాన్వొకేషన్ కార్యక్రమం డిసెంబర్ 13, 2025న చెన్నైలో నిర్వహించగా, అదే వేదికపై దుర్గం నగేష్ ( నాగేశ్వరరావు )కు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. యూనివర్సిటీ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ డా. పి. మాన్యువెల్ తో పురస్కారాన్ని అందజేశారు. విద్య, ఆరోగ్యం, పేదల సంక్షేమం, హక్కుల సాధన, సామాజిక న్యాయం వంటి రంగాల్లో గత కొన్నేళ్లుగా దుర్గం నగేష్ (నాగేశ్వర రావు) చేస్తున్న సేవా కార్యక్రమాలు దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ వేదికల ద ృష్టిని కూడా ఆకర్షించాయని. బలహీన వర్గాల అభివ ృద్ధే లక్ష్యంగా పలు సంస్థలతో నగేష్ కలిసి చేపట్టిన కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పును తీసుకొచ్చాయని కొనియాడారు. అసాధారణమైన సామాజిక సేవా ద ృక్పథంతోప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలనే నిబద్ధతతో పని చేస్తున్న వ్యక్తికి ఇవ్వబడుతున్న అత్యున్నత గౌరవమే ఇది అని యూనివర్సిటీ బోర్డు చైర్మన్ స్పష్టం చేశారు. సందర్భంగా దుర్గం నగేష్ ,( నాగేశ్వరరావు) మాట్లాడుతూ... నాకు మాత్రమే కాదు సమాజ మార్పు కోసం నిరంతరం శ్రమిస్తున్న ప్రతి సేవాకారునికి లభించిన గుర్తింపు. ఇంత గొప్ప అవకాశం కల్పించిన గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ కి, గత 20 సంవత్సరాలుగా చేస్తున్న సేవలను గుర్తించి నాకు ఇప్పించిన డా . మహమ్మద్ ఆరిఫ్ ఉద్దీన్ కు, తనను కన్న తల్లిదండ్రులకు సహకరిస్తున్న సతీమణి ప్రమీలకు, సమతా ఫౌండేషన్ సమతా సైనికుల సభ్యులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఇది నాకు మరింత బాధ్యతను గుర్తు చేస్తోంది అని అన్నారు. సామాజిక సేవకు అంతర్జాతీయ గుర్తింపుగా నిలిచిన డాక్టరేట్, మార్షల్ దుర్గం నగేష్ సేవా ప్రస్థానానికి మరో మైలురాయిగా నిలిచింది. డాక్టరేట్ పొందిన దుర్గం నగేష్ ను పలువురు ప్రజా సంఘాల నాయకులు స్వఛేద సేవకులు ప్రశంసిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

# రెండవ విడుత ఎన్నికలకు భద్రత ఏర్పాట్లు పూర్తి

- **ఎన్నికల నిర్వహణకు 853 మంది పోలీస్ లతో పటిష్ట బందోబస్తు**
- **నిశపక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి**
- **ఎస్ పి అశోక్ కుమార్ అన్నారు**

**నేటి సాక్షి - జగిత్యాల టౌన్ (పూరెళ్ల బాపు) :** డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుండి ఆయా ప్రాంతాలకు ఎన్నికల సామాగ్రిని పటిష్ట పోలీస్ బందోబస్తు మధ్య తరలించడం జరిగిందని రూట్ మొబైల్స్ ను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు రెండో విడతకి సంబంధించి 1276 పోలింగ్ కేంద్రాలలో, 134 సర్పంచ్, 946 వార్డులకు పోలింగ్ జరుగుతుంది అని దీనికి సంబంధించి 853 మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు అని అన్నారు.పటిష్ట ఎస్కార్ట్ తో పోలింగ్ సామాగ్రిని పోలింగ్ కేంద్రాలకు తరలించడం జరిగింది . 57 రూట్స్ లలో సిబ్బంది అప్రమత్తంగా ఉ



ంటారని స్పెషల్ సైక్లింగ్ ఫోర్స్ సైక్లింగ్ ఫోర్ టీమ్స్ మరియు ఎస్ ఐ లతో పెట్రోలింగ్ టీమ్స్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఓటరు స్వేఛకు భంగం కలగకుండా ప్రలోభాలకు తావు లేకుండా ప్రతి ఓటరు తమ ఓటును స్వేఛగా వినియోగించుకునే ఏర్పాట్లు చేయడం జరిగిందని అన్నారు. ఓటర్లు ఎవరు కూడా సెల్ ఫోన్లు, మందు గుండు సామాగ్రి, ఇంకు బాటిల్స్,వాటర్ బాటిల్స్, పోలింగ్ బూత్ లోనికి తీసుకువెళ్లరాదని, సెల్ఫీలు దిగడం నిషేధం అన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యఫలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠినంగా వ్యవహరిస్తామన్నారు ఎన్నికల సంఘం చే జారీ చేయబడిన నియమాలను పక్కాగా అమలు చేస్తామన్నారు.ఎన్నికలు ముగిసే వరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (MCC)అమల్లో ఉందని, కావున విజయోత్సవ ర్యాలీలు, సభలు,బైక్ ర్యాలీలు, డీ జే లు వంటి కార్యక్రమాలు నిర్వహించడం పూర్తిగా నిషేధం అన్నారు. MCC అమల్లో ఉన్నందున ఆంక్షలు తప్పనిసరిగా పాటించాలని,నియమాలను అతిక్రమించే ఏ చర్యనైనా సహించేది లేదని ఉల్లంఘనలు జరిగితే వెంటనే చట్టపరమైన కేసులు నమోదు చేస్తామన్నారు.

# ప్రజా ప్రయోజనాల పరిరక్షణే వైయస్ఆర్‌సీపీ పోరాటాలు

- **రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో కూటమి ప్రభుత్వం వైయస్ఆర్‌సీపీని లేకుండా చేయాలన్న కూటమి కుట్ర..**

**నేటి సాక్షి అన్నమయ్య జిల్లా, శర్మ, డిసెంబర్ 13 :** అన్నమయ్య జిల్లా :-: ఈ నెల 15న జిల్లా కేంద్రాల్లో జరిగే ర్యాలీలను విజయవంతం చేయాలని వైయస్ఆర్‌సీపీ స్టేట్ కో□ - ఆర్డినేటర్ సజ్జల రామక ృషా□రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆయన ఆ పార్టీ అధికార ప్రతినిధులు, రాష్ట్ర కార్యదర్శులు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అధికారిక ప్రతినిధులు, జిల్లా అనుబంధ విభాగ అధ్యక్షులు, అసెంబ్లీ అనుబంధ విభాగ అధ్యక్షులు. జనరల్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో టెలికానారేన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సజ్జల రామక ృషా□రెడ్డి మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైయస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు చేపట్టిన కోటి సంతకాల సేకరణ ఉద్యమ స్ఫూర్తితో కొనసాగిందన్నారు. ఇది ఇప్పుడు తుది అంకానికి చేరుకుందని లక్ష్యానికి మించి సంతకాల సేకరణ కార్యక్రమం కొనసాగిందని సజ్జల వివరించారు. "గ్రామాలు, వార్డుల్లో వైయస్ఆర్‌సీపీ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం ఏర్పాటు చేసి మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ ప్రజల మద్దతు కూడగట్టామని ఇప్పటికే సంతకాలు చేసిన పత్రాలను నియోజకవర్గ కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు తరలించారు. ఈ మహా యజ్ఞంలో పాల్గొన్న వైయస్ఆర్‌సీపీ నియోజకవర్గ కో - ఆర్డినేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలను వైఎస్ జగన్ ప్రత్యేకంగా అభినందించారు. వైద్య విద్యను అభ్యసించి, ప్రజలకు వైద్య సేవలు అందించాలనుకుంటున్న పేద విద్యార్థుల స్వప్నాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర□యం సమాధి చేస్తోంది. ఈ దిశగా ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరించేందుకు చంద్రబాబు సర్కారు తీసుకున్న



నిర□యంపై వైఎస్ జగన్ ప్రజా ఉద్యమానికి పిలుపునిచ్చారు. ఆయన రూపొందించిన ఉద్యమాలకు ప్రజల నుంచి, పార్టీ శ్రేణుల నుంచి మద్దతు వెల్లువెత్తుతోంది. ఇప్పటికే చలో మెడికల్ కాలేజీ ఉ ద్యమాన్ని నిర్వహించగా, దీనికి కొనసాగింపుగా నియోజకవర్గంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగింది. గ్రామ గ్రామాన, పట్టణాల్లోని డివిజన్లలోనూ కొద్ది రోజులుగా రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వలన కలిగే నష్టాలను ప్రజలకు వివరిస్తూ సంతకాలు సేకరించారు. ఇందులో భాగంగా కోటి సంతకాల సేకరణను ఉద్యమ స్ఫూర్తితో నిర్వహించారు. దీనికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. సంతకాల సేకరణలో వివిధ గ్రామాల నేతలు ఒకరితో మరొకరు పోటీ పడ్డారు. అందుకే ఒక్కో నియోజకవర్గంలో 50 వేల నుంచి 60 వేల సంతకాల సేకరించాలనేది పెద్ద లక్ష్యంగా కాకుండా అంతకుమించి సేకరించగలిగామని సజ్జల పేర్కొన్నారు. పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా పార్టీలో అన్ని స్థాయిల నేతలతో పాటు అనుబంధ విభాగాల ప్రతినిధులు కూడా ఎక్కడికక్కడ రెట్టించిన ఉత్సాహంతో సంతకాల సేకరణ ముమ్మరంగా చేశారు. పట్టణాలు, నగరాల్లో అయితే డివిజన్లను క్లస్టర్లుగా విభజించి, పార్టీ నేతలంతా బాధ్యతలు పంచుకుని మరీ సంతకాల సేకరణ చేశారు. మీ అందరి కష్టం, శ్రమను వైఎస్ జగన్ ప్రత్యేకంగా అభినందించారు. ఇక కోటి సంతకాల కార్యక్రమం తుది దశకు చేరుకుంది. పార్టీ నాయకత్వమంతా కూడా ఈ నాలుగు రోజుల పాటు మీ ఫోకస్ అంతా దీనిపైనే ఉ ండాలి. ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలి.ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా చర్చించుకునేంత స్థాయిలో విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నానని సజ్జల రామక ృషా□రెడ్డి అన్నారు. టెలి కానారేన్స్ చివరిలో పార్టీ సెంట్రల్ ఆఫీస్ ఇంఛార్జ్ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రయోజనాల పరిరక్షణే ధ్యేయంగా వైయస్ఆర్‌సీపీ అలుపెరుగని పోరాటాలు చేస్తోందన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో వైయస్ఆర్‌సీపీని లేకుండా చేయాలన్న కూటమి కుట్రలను అధిగమిస్తూ యువత, ఉద్యోగులు, మహిళలు, కార్మికుల పక్షాన పోరాడుతున్నామన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం, వ్యాపారం ఏ వర్గానికి ఆపదొచ్చిన వారి పక్షాన నిలబడి వైయస్ఆర్‌సీపీ గళమెత్తుతోందని ఆయా వర్గాల సమస్యలను పరిష్కరించే దిశగా ఏడాదిన్నరగా కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై నినదిస్తూనే ఉన్నామని అందులో భాగంగానే మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణతో వైయస్ఆర్‌సీపీ ఒక పెద్ద ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించిందన్నారు. చంద్రబాబు నిర□యాన్ని వ్యతిరేకిస్తూ ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కాపాడుకునేం దుకు వైయస్ఆర్‌సీపీ తలపెట్టిన ఉ ద్యమానికి ప్రజలు స్వఛ్ఛందంగా తరలివచ్చి పెద్ద ఎత్తున మద్దతు పలికారు. చంద్రబాబు తీసుకున్న ప్రైవేటీకరణ నిర□యాన్ని వెనక్కి తీసుకోవాలని కోటి మందికి పైగా ప్రజలు రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే సంతకాలు చేశారు. ఇకనైనా చంద్రబాబు తన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలని లేళ్ల అప్పిరెడ్డి అన్నారు..

# అవిశ్వాస తీర్మానంపై ఎన్నిక జరిగితే వైయస్ఆర్‌సీపీనే గెలుపు

- **రాజ్యాంగబద్ధంగా అవిశ్వాస తీర్మానంపై ఎన్నిక జరిగితే వైయస్ఆర్‌సీపీనే గెలుపు..**
- **బిఎన్ఎస్ చట్టాలంటే 'బాబు అన్యాయ సంహిత' చట్టాలుగా మార్చేశారని వైసీపీ ఆగ్రహం..**

**నేటి సాక్షి అన్నమయ్య జిల్లా, శర్మ, డిసెంబర్ 13 :** అన్నమయ్య జిల్లా :-: చంద్రబాబు రాజకీయాలన్నీ హొటల్స్‌లో రహస్యంగా జరుగుతున్నాయని పైరవీలు, ప్రలోభాలన్నీ అక్కడే చేయిస్తుంటారని వైయస్ఆర్‌సీపీ అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్ అన్నారు. శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ నెల్లూరు కార్పొరేషన్ వ్యవహారాన్ని కూడా పాండిచ్చేరిలోని హొటళ్ల కు చేర్చారని నెల్లూరు 54 డివిజన్లలో మొత్తం వైయస్ఆర్‌సీపీనే గెలుపొందిందని అలాంటి చోట ఏమాత్రం బలం లేకున్నా ఎలా గెలవాలని చూస్తున్నార ంటూ నాగార్జున యాదవ్ ప్రశ్నించారు. " వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బీఫామ్ మీద గెలిచిన వారిని టీడీపీ వైపు లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని పోలీసులను అడ్డం పెట్టుకుని బెదిరింపులకు దిగుతున్నారని రాజ్యాంగబద్ధంగా అవిశ్వాస తీర్మానం మీద ఎన్నిక జరిగితే వైయస్ఆర్‌సీపీనే గెలుస్తుందని కిడ్నాప్‌లు చేయటానికి ఖాకీలను వాడుకుంటున్నారని కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా పోలీసులు ఖాకీ క్యాబ్ సర్వీసులుగా మారారని కొందరు పోలీసులు బిఎన్ఎస్ చట్టాలు అంటే 'బాబు అన్యాయ సంహిత' చట్టాలుగా మార్చారంటూ నాగార్జున యాదవ్ దుయ్యబట్టారు. "టీడీపీకి బలమే వుంటే వైసీపీ కార్పొరేటర్లను కిడ్నాప్ చేయటం దేనికని నాగార్జున యాదవ్ ప్రశ్నించారు. అవిశ్వాస తీర్మానంలో టీడీపీ



నైతికంగా ఎప్పుడో ఓడిపోయింది. అధికార బలం ఎల్లవేళలా పని చేయదు. చంద్రబాబు అనైతిక రాజకీయాలకు ప్రజలు చెక్ పెట్టే రోజు వస్తుందని నాగార్జున యాదవ్ పేర్కొన్నారు..

# జవహర్ నవోదయ పరీక్ష కేంద్రాల తనిఖీ



**నేటి సాక్షి - జగిత్యాల ( రాధారపు నర్సయ్య ) :** శనివారం జగిత్యాల లో జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష జరుగుతున్న 4 కేంద్రాలైన శ్రీనిధి, గౌతమ, చైతన్య మరియు ప్రభుత్వ పురాతన పాఠశాలలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) బి.ఎస్ లత ఆకస్మికంగా పరిశీలించారు. పరీక్ష జరుగుతున్న తీరును, కల్పించిన సౌకర్యాలను పరిశీలించి మరియు పరీక్ష నిర్వహణకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ పరిశీలనలో అర్బన్ మండలం ఎమ్మార్వో రామ్ మోహన్, నవోదయ పరీక్ష కేంద్రాల ఇంచార్జి మరియు తదితరులు పాల్గొన్నారు.

# రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం

**జగిత్యాల జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు జి. రమేష్**



**నేటి సాక్షి - కోరుట్ల ( రాధారపు నర్సయ్య ) :** ఆదివారం జరిగే రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు జి. రమేష్ తెలిపారు. శనివారం రోజున జగిత్యాల అర్బన్ మండలంలో ఆదివారం జరగనున్న రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పర్యటించి ఎలక్షన్ మెటీరియల్ పంపిణిని పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ మరియు రిసెప్షన్ కేంద్రాలను సందర్శించి, పోలింగ్ అధికారులకు ఇచ్చిన మెటీరియల్ ని చెక్ చేశారు.పోలింగ్ మెటీరియల్ పంపిణీ ఏర్పా ట్లను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సామాగ్రిని, బ్యాలెట్ పేపర్లను, పోలింగ్ బాక్సులను పరిశీలించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో కావాల్సిన సామాగ్రిని పోలింగ్ కేంద్రం వారిగా వేరు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. బ్యాలెట్ పత్రాలు జాగ్రత్తగా చెక్ చేసి ప్యాక్ చేయాలని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి పోలింగ్ కేంద్రం చేరుకొని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను మరోసారి నిర్ధారణ చేసుకోవాలన్నారు. సిబ్బంది రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం కల్పించాలని, విద్యుత్ అంతరాయం లేకుండా 24 గంటలు విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. ఏమైనా లోపాలు కనిపిస్తే వెంటనే తెలియజేయాలని, త్రాగునీరు, లైటింగ్, పార్కింగ్ ప్రదేశాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.ఈ పర్యటనలో జిల్లా నోడల్ అధికారులు పి. నరేష్, ఎమ్మార్వో, ఎంపిడివో, ఎస్సై, ఎంపివో, జోనల్ ఆఫీసర్లు సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రక్రియను జాగ్రత్తగా నిర్వహించాలి

**లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్**



**నేటి సాక్షి - జగిత్యాల ( రాధారపు నర్సయ్య ) :** రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను జాగ్రత్తగా నిర్వహించాలని లోకల బాడీస్ అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ తెలిపారు.శనివారం రోజున కొడిమ్యాల మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పర్యటించి ఎన్నికల సామగ్రిని పంపిణిని పరిశీలించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని, రిసెప్షన్ సెంటర్ ను పరిశీలించారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీ ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సామాగ్రిని, బ్యాలెట్ పేపర్లను, పోలింగ్ బాక్సులను తరలించడానికి పోలింగ్ సిబ్బందికి ఏర్పాటు చేసిన బస్సులను ప్రారంభించారు. బ్యాలెట్ పత్రాలు జాగ్రత్తగా చెక్ చేసి ప్యాక్ చేయాలని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి పోలింగ్ కేంద్రం చేరుకొని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను మరోసారి క్షుణ□ంగా పరిశీలించాలని తెలిపారు. సిబ్బంది రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, ఏమైనా లోపాలు కనిపిస్తే వెంటనే తెలియజేయాలని సూచించారు.ఈ పర్యటనలో అడిషనల్ ఎస్పీ శేషాద్రిని రెడ్డి, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ కన్నం హరిణి, ఎమ్మార్వోలు, ఎంపీడీవో లు, ఎం.పి.ఓ.లు, పోలీస్ సిబ్బంది, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# రెండో విడత సర్పంచ్ ఎన్నికలకు పటిష్ట భద్రత

## 1276 పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో పోలింగ్‌కు చర్యలు

### జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



**నేటి సాక్షి - జగిత్యాల ( రాధారపు నర్సయ్య ) :** జగిత్యాల జిల్లాలో జరగనున్న రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను శాంతియు-ంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహిం చేందుకు జిల్లా పోలీస్ శాఖ అన్ని భద్రతా ఏర్పాట్లను పూర్తి చేసినట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. ఎన్నికల సామగ్రిని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ కేంద్రాలకు పటిష్ట పోలీస్ బందోబస్తు మధ్య తరలిస్తూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టామని స్పష్టం చేశారు.

### పోలింగ్ ఏర్పాట్లు-పోలీస్ బందోబస్తు

రెండో విడత ఎన్నికలలో భాగంగా జిల్లాలోని 1276 పోలింగ్ కేంద్రాల్లో 134 సర్పంచ్, 946 వార్డు స్థానాలకు పోలింగ్ జరగనుందని ఎస్పీ తెలిపారు. ఈ ఎన్నికల నిర్వహణ కోసం మొత్తం 853 మంది పోలీసు సిబ్బందిని విధుల్లో నియమించినట్లు వెల్లడించారు. పోలింగ్ సామగ్రి తరలింపునకు 57 రూట్లను ఏర్పాటు చేసి, ఆయా మార్గాల్లో రూట్ మొబైల్స్‌తో పాటు ప్రత్యేక ఎస్కార్ట్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అదనంగా స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలు, ఎస్.ఐల ఆధ్వర్యంలో పెట్రోలింగ్ టీమ్స్‌ను రంగంలోకి దింపినట్లు తెలిపారు.

### ఓటరు స్వేఛ-కఠిన నిబంధనలు

ప్రతి ఓటరు ఎలాంటి భయభ్రాంతులు లేకుండా స్వేఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు చేశామని ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, మందుగుండు సామగ్రి, ఇంక్ బాటిల్స్, వాటర్ బాటిల్స్ తీసుకెళ్లడం నిషేధమని, సెల్ఫీలు దిగడాన్ని పూర్తిగా నిషేధించినట్లు స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఎవరైనా చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఎన్నికల సంఘం జారీ చేసిన అన్ని నియమాలను పకడ్బందీగా అమలు చేస్తామని చెప్పారు.

### ఎంసీసీ అమలు - ఉల్లంఘనలకు కేసులు

ఎన్నికలు పూర్తయ్యే వరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (MCC) అమలులో ఉంటుందని ఎస్పీ గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో విజయోత్సవ ర్యాలీలు, సభలు, బైక్ ర్యాలీలు, డీజే కార్యక్రమాలు పూర్తిగా నిషేధమని తెలిపారు. ఎంసీసీ నిబంధనలు అతిక్రమించిన వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు, రాజకీయ పార్టీలు పోలీస్ శాఖకు సహకరించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా తోడ్పడాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ కోరారు.

# పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్స్‌ల తరలింపు

## డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను పరిశీలించిన అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి




**నేటి సాక్షి - జగిత్యాల ( రాధారపు నర్సయ్య ) :** జగిత్యాల జిల్లాలో జరుగుతున్న రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పటిష్ట భద్రతా చర్యలు చేపట్టిందని అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్స్‌లు, ఎన్నికల సామగ్రిని కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్త్ మధ్య తరలించినట్లు వెల్లడించారు.

### డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల పరిశీలన

రెండో విడత ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా కొడిమ్యాల, బీర్పూర్, సారంగాపూర్ మండలాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి ఐపీఎస్ స్వయంగా సందర్శించి పరిశీలించారు. ఈ సెంటర్ల నుంచి ఆయా గ్రామాల పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని పటిష్ట పోలీస్ బందోబస్త్ మధ్య తరలిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

### 57 రూట్ మొబైల్స్‌తో కట్టుదిట్ట భద్రత

ఎన్నికల సామగ్రి తరలింపులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తుగా 57 రూట్ మొబైల్స్‌ను ఏర్పాటు చేసినట్లు అదనపు ఎస్పీ తెలిపారు. ప్రతి రూట్‌లో పోలీస్ సిబ్బంది నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా పోలీస్ శాఖ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని, ప్రజలు కూడా సహకరించాలని ఆయన కోరారు.

# మండల.సమైక్య.అధ్యక్షురాలు సర్పంచ్ అభ్యర్థి

- అధికారులను బోల్తా కొట్టిస్తూ నామినేషన్.
- రాజీనామా చేయకుండానే ఎన్నికల బరిలో అభ్యర్థి
- పట్టించుకోని కొమరం భీం జిల్లా అధికారులు




**నేటి సాక్షి కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి డిసెంబర్ 13 :** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం లోని కుకుడ గ్రామపంచాయతీ ఎన్నికలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఎన్నికల బరిలో దిగిన ఒక సర్పంచ్ అభ్యర్థి ఏకంగా ప్రభుత్వ అనుబంధ సంస్థలో ఉద్యోగిగా ఉంటూ, నిబంధనలను ఉల్లంఘిస్తూ అధికారులను బోల్తా కొట్టించడం గమనార్హం. కుకుడ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పూర్తేటి శ్రీదేవి అనే మహిళ సర్పంచ్ పదవికి నామినేషన్ వేశారు. అయితే, ఆమె ప్రస్తుతం ఐకేపీ (మహిళా సమైక్య కార్యాలయం) లో ఉద్యోగిగా పనిచేస్తున్నట్లు వెల్లడైంది. నిబంధనల ప్రకారం, ప్రభుత్వ ఉద్యోగులు లేదా ప్రభుత్వ అనుబంధ సంస్థల్లో పనిచేసేవారు ఎన్నికల్లో పోటీ చేయాలంటే తప్పనిసరిగా తమ పదవికి రాజీనామా చేయాలి.అయితే, శ్రీదేవి మాత్రం తన ఉద్యోగానికి సంబంధించిన రాజీనామా పత్రాలను లిఖితపూర్వకంగా అధికారులకు సమర్పించకుండానే నామినేషన్ దాఖలు చేసినట్లు తెలుస్తోంది. ఉద్యోగులు ఎన్నికల ప్రచారం చేయకూడదు, పోటీ చేయకూడదు అనే నిబంధనలు ఉన్నప్పటికీ, అధికార పార్టీ బలంతో ప్రభుత్వ కొలువు చేస్తూనే ఎన్నికల బరిలో దిగడం చర్చనీయాంశంగా మారింది. అధికారుల వివరణ: రాతపూర్వక రాజీనామా రాలేదు ఈ విషయంపై ఐకేపీ కార్యాలయం ఏపీఎం (అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్) ను చరవాణి లో వివరణ కోరగా, తమ వద్దకు పూర్తేటి శ్రీదేవి నుంచి ఎటువంటి రాజీనామా పత్రం లిఖితపూర్వకంగా అందలేదని ఆయన స్పష్టం చేశారు. శ్రీదేవి ప్రస్తుతం ఐకేపీలో గ్రామస్థాయి అధ్యక్షురాలు మరియు మండల స్థాయి అధ్యక్షురాలుగా కూడా విధులు నిర్వహిస్తున్నారని సమాచారం. ఈ విధంగా ఒక ప్రభుత్వ అనుబంధ పదవిలో ఉంటూ, నిబంధనలను అతిక్రమించి సర్పంచ్ పదవికి నామినేషన్ వేసి, అధికారులను తప్పుడు దారి పట్టిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. కుకుడ గ్రామపంచాయతీ ఎన్నికలు ఒకే పార్టీలో రెండు వర్గాలు, మరియు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మద్దతుతో మూడవ అభ్యర్థి పోటీ పడటంతో రసవత్తరంగా మారిన నేపథ్యంలో, నిబంధనలను ఉల్లంఘించి నామినేషన్ వేసిన శ్రీదేవిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది ఇప్పుడు వేచి చూడాలి.


# రాష్ట్రాన్ని కూటమి సర్కార్ అప్పుల కుప్పగా మార్చింది




- వైఎస్ జగన్ సీఎంగా ఉంటే ఒక రాజ్యాంగం. చంద్రబాబు సీఎంగా ఉంటే మరో రాజ్యాంగమా.. కురసాల కన్నబాబు

**నేటి సాక్షి అన్నమయ్య జిల్లా, శర్మ, డిసెంబర్ 13 :** అన్నమయ్య జిల్లా :-: రాష్ట్రాన్ని కూటమి సర్కార్ అప్పుల కుప్పగా మార్చిందని వైయస్ఆర్‌సీపీ నేత, మాజీ మంత్రి కురసాల కన్నబాబు మండిపడ్డారు. శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర అప్పులపై ప్రజలకు చంద్రబాబు పచ్చి అబద్ధాలు చెప్పారన్నారు. వైయస్ఆర్‌సీపీ హయాంలో రాష్ట్ర అప్పులపై టీడీపీ నేతలు దుర్మార్గంగా ప్రచారం చేశారన్నారు. "ఎఫ్ఆర్‌బీఎం నిబంధనలకు విరుద్ధంగా చంద్రబాబు అప్పులు చేస్తున్నారు. టీడీపీ నేతలకు వైఎస్ జగన్ సీఎంగా ఉంటే ఒక రాజ్యాంగం చంద్రబాబు సీఎంగా ఉంటే మరో రాజ్యాంగం ఉంటుందా అంటూ కన్నబాబు ప్రశ్నించారు. వైఎస్ జగన్ చేసిన అప్పులపై రాష్ట్రం శ్రీలంక అవుతోందని గ్లోబెల్ ప్రచారం చేశారు. చంద్రబాబు ఈ 18 నెలల కాలంలో రూ.2,66,175 కోట్లు అప్పు చేశారు. జగన్ అప్పు చేస్తే శాపమని చంద్రబాబు చేస్తే వరమని సొంత అనుబంధ మీడియా డప్పు కొట్టుకుంటూ ఉందని కన్నబాబు ఎద్దేవ చేశారు. కోవిడ్ వంటి కష్టకాలంలో వైఎస్ జగన్ సంక్షేమ పథకాలు ఆపలేదనేది ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. చెప్పిన అబద్దం చెప్పకుండా వైఎస్ జగన్‌పై పచ్చి అబద్దాలను ప్రజల చెవుల్లోకి వినిపించే ప్రయత్నం చేస్తున్నారని చంద్రబాబు తెచ్చిన అప్పులు ప్రజల సొమ్ముల్లో వేశారా అంటే అది లేదని రూ.5,400 కోట్లు ఎక్సైజ్ భవిష్యత్తు ఆదాయాన్ని తాకట్టు పెట్టి అప్పు తెచ్చారు. ఏపీ బేవరేజ్ ద్వారా అప్పు తీసుకురావాలని వైఎస్ జగన్ భావిస్తే కేంద్రానికి లేఖ రాసి, కోర్టులో కేసులు వేశారు. వైఎస్ జగన్ చేసిన అప్పులు రాజ్యంగ విరుద్దమన్నారు. ఇప్పుడు అవే అప్పులు మీరు చేస్తుంటే రాజ్యాంగం ఏమైనా మారిందానని కురసాల కన్నబాబు అన్నారు. చంద్రబాబు చేసే అప్పులకు ఏపీ సౌత్ సూడాన్‌లా మారుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ 18 నెలల కాలంలో చంద్రబాబు చేసిన అప్పు వైఎస్ జగన్ చేసిన అప్పుకంటే 80 శాతం ఎక్కువ. చంద్రబాబు చేసిన అప్పులు ఏమవుతున్నాయని కురసాల కన్నబాబు ప్రశ్నిస్తూ చంద్రబాబు చేసిన అప్పులు సంపద సృష్టి ఎలా అయ్యిందని ప్రశ్నించారు. చంద్రబాబు లేకపోతే రాష్ట్రం అదోగతి అయిపోతుందని ఒక కుట్రపూరిత ప్రచారం జరుగుతుంది. పరిమితికి మించి అప్పులు చేయమని చంద్రబాబుకు ఏ చట్టం చెప్పిందన్నారు. అమరావతి కోసం మరో 7,8 వేల కోట్లు అప్పు చేయడానికి సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదు. మీరు చేస్తున్న అన్యాయాలపై ఎవరైనా ప్రశ్నిస్తే రెడ్ బుక్ ద్వారా కేసులు పెడతారు. రోడ్డు మీద గోతులు పూడ్చడం లేదు. కానీ గ్రోత్ ఇంజన్లు, గ్రోత్ కారిడార్‌ల కోసం మాట్లాడుతున్నారంటూ కురసాల కన్నబాబు దుయ్యబట్టారు..

# 'థాంక్స్ రా..ఫ్రెండ్స్'..మంచి గుణపాఠం చెప్పింద్రు.!




### వేములకుర్తి 6వ వార్డు- ఓటమి వెనుక 'అతని-మనసులోమాట'

**నేటి సాక్షి - ఇబ్రహీంపట్నం ( రాధారపు నర్సయ్య ) :** 'థాంక్స్ రా..ఫ్రెండ్స్..' నాకు చాలా గుణపాఠం చెప్పారు.! జీవితాంతం గుర్తుపెట్టుకుంటా.! అట్లనే మీరూ 'చెక్' చేసుకోండీ దోస్తులూ..'స్నేహం' ముసుగులో కొందరు మన వెనకే ఉండి బొందతోడి పెడతారని ఓ 'స్నేహితుడు' తన మనసులో మాటను 'కరపత్రాల' రూపంలో ప్రచారం చేసుకుంటున్న వైనం చర్చానీయాంశమైంది.!

### నా ఓటమికి కారణం నా దోస్తుగాళ్లే.!



ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి 6వ వార్డు ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత, అక్కడి రాజకీయ వాతావరణంలో ఒక కొత్తరకమైన కదలిక కనిపించింది. ఓటమిని ఒప్పుకుంటూనే, తన గుండెల్లో దాగిన భావోద్వేగాలను బహిరంగంగా చెప్పిన అభ్యర్థి 'మొగిలి దేవదాస్' మాటలు ఇప్పుడు ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి. గెలుపు-ఓటముల మధ్య నిలిచే నిజమైన బంధాల విలువను గుర్తుచేసేలా ఆయన స్పందన ఉండటం ప్రత్యేకతగా నిలిచింది. ఈ ఎన్నికల్లో తన విజయానికి శ్రమించిన ప్రతి ఓటరికి, మద్దతుగా నిలిచిన ప్రతి వ్యక్తికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఓటమి తన వ్యక్తిగత పరాజయం కాదని, ప్రజాస్వామ్యంలో అది ఒక సహజ ప్రక్రియ అని ఆయన స్పష్టంగా చెప్పారు. అయితే ఈ పోటీ తనకు ఓ చేదు అనుభవాన్ని మిగిల్చిందని, దశాబ్దాలుగా కొనసాగిన స్నేహబంధాలు ఒక్క వార్డు ఎన్నిక కారణంగా దూరమయ్యాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 'స్నేహమనే ముసుగులో నా ఓటమికి కారణమైన మిత్రులకూ ప్రత్యేక ధన్యవాదాలు'అన్న




మాటలు, రాజకీయ పోరాటాల్లో దాగి ఉండే నిజాలను బయటపెట్టినట్లయ్యాయి.

### గుండెల్ని పిండేసిన 'విజ్ఞప్తి'

చివరగా ఆయన చేసిన విజ్ఞప్తి మాత్రం హృదయాన్ని తాకేలా ఉంది. స్నేహం అనే పదాన్ని ఉపయోగించి ఎవరినీ తొక్కివేయొద్దని, అవసరమైతే దూరంగా ఉండొచ్చుగానీ అన్యాయం మాత్రం చేయవద్దని కోరారు. ఓటమి తర్వాత కూడా తనను 'సదా మీ శ్రేయభిలాషి'గా పరిచయం చేసుకోవడం, రాజకీయాలకతీతంగా మనిషితనాన్ని నిలబెట్టే ప్రయత్నంగా పలువురు భావిస్తున్నారు. వేములకుర్తి 6వ వార్డులో ఈ మాటలు ఓ ఎన్నికల కథకు తెరలేపినట్టుగా, లోతైన ఆలోచనలకు దారి తీస్తున్నాయి.!

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
ఆదివారం
14 డిసెంబర్ 2025


# అయ్యప్ప గిరి ప్రదక్షిణతో కోర్కెల సఫలత

- అయ్యప్ప గిరి ప్రదక్షిణతో కోర్కెల సఫలత-మానసిక ప్రశాంతత

**నేటి సాక్షి - కోరుట్ల టౌన్ ( నీలి అనిల్ కుమార్ ) :** కోరుట్ల పట్టణంలోని అయ్యప్పగుట్టపై గల శ్రీ జ్ఞాన సరస్వతి%--%శనేశ్వర సహిత అయ్యప్ప స్వామి ఆలయంలో ఉత్తర నక్షత్రం పురస్కరించుకొని నిర్వహించిన గిరి ప్రదక్షిణలో పాల్గొంటే కోరిన కోర్కెలు తీరడంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆలయ అర్చకులు తెలిపారు.



### ఉత్తర నక్షత్ర గిరి ప్రదక్షిణ మహత్యం

అయ్యప్ప స్వామిని భక్తి పారవశ్యంతో నమ్ముకుని ఉత్తర నక్షత్రం నాడు గిరి ప్రదక్షిణ నిర్వహిస్తే స్వామివారి కృపతో అనేక కోర్కెలు నెరవేరుతాయని అర్చకులు వెల్లడించారు. భక్తులు గిరి ప్రదక్షిణ అనంతరం సాయంత్రం ఇంటిలో నేతి దీపం వెలిగించి, శనగపప్పు నైవేద్యం సమర్పించి సంకల్పం తీసుకుంటే, వారి జీవితాల్లో శుభఫలితాలు కలుగుతాయని వివరించారు. ఈ విధంగా భక్తి నియమాలతో చేసే ఆచరణ వల్ల మానసిక ప్రశాంతతతో పాటు ఆధ్యాత్మిక శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు.

### భక్తి పారవశ్యంతో గిరి ప్రదక్షిణ

శనివారం ఉదయం ఆలయ శాశ్వత అధ్యక్షులు చిద్రాల నారాయణ గురుస్వామి, ఆలయ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్ నేత ృత్వంలో ఉత్తర నక్షత్ర గిరి ప్రదక్షిణ ఘనంగా జరిగింది. ముందుగా అయ్యప్ప స్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, ప్రత్యేక అర్చన పూజలు చేపట్టారు. అనంతరం అయ్యప్ప దీక్ష స్వాములతో పాటు సాధారణ భక్తులు కాషాయ జెండాలు చేతబట్టి, గోమాతలతో కలిసి "స్వామియే శరణమయ్యప్ప", "హర హర శంకర జయ జయ శంకర" నినాదాలతో గిరి ప్రదక్షిణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాలు భక్తి పారవశ్యంతో పండగ వాతావరణాన్ని తలపించాయి.

### భవిష్యత్ ఆలయ అభివృద్ధి లక్ష్యం

ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, నిర్వాహకులు మాట్లాడుతూ కోరుట్ల పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఈ పవిత్ర అయ్యప్పగుట్ట ఆలయాన్ని దర్శించి గిరి ప్రదక్షిణలో పాల్గొనడం ద్వారా స్వామివారి ఆశీస్సులు పొందాలని పిలుపునిచ్చారు. రాబోయే ఉత్తర నక్షత్ర సమయంలో మరింత పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. అలాగే త్వరలో మూడు కోట్ల రూపాయల భారీ వ్యయంతో ద్వాదశ జ్యోతిర్లింగ సహిత శివాలయ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ మహత్తర కార్యం ప్రజల సహకారంతోనే సాధ్యమవుతుందని, పట్టణం మరియు పరిసర గ్రామాల ప్రజలు భాగస్వాములు కావాలని శాశ్వత అధ్యక్షులు చిద్రాల నారాయణ గురుస్వామి, అధ్యక్షులు అంబటి శ్రీనివాస్ గురుస్వాములు స్పష్టం చేశారు.

# ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ

- 40 సంవత్సరాలు ఇండస్ట్రీ అని చెప్పుకుంటే సరిపోదు..
- ప్రజా పాలన ఎలా చేయాలో వైయస్ జగన్ ను చూసి నేర్చుకోండి.. దేవినేని అవినాష్



**నేటి సాక్షి అన్నమయ్య జిల్లా, శర్మ, డిసెంబర్ 13 :** అన్నమయ్య జిల్లా :-: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ జరిగిందని జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఏలూరులోని వైసీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా వాళ్లు మాట్లాడుతూ అక్టోబర్ 10వ తేదీ నుండి ప్రతి నియోజకవర్గంలో ఉద్యమంలా సాగిన ఈ కార్యక్రమంలో ప్రజలు స్వఛ్ఛందంగా పాల్గొన్నారని ఎన్టీఆర్ జిల్లాలో 4 లక్షల 25 వేల సంతకాలు సేకరించగా రాష్ట్రవ్యాప్తంగా కోటి సంతకాలు దాటాయని ఈ నెల 15వ తేదీన కోటి సంతకాల ప్రతులను పార్టీ నాయకులు, అభిమానులతో కలిసి పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి జిల్లాలోని ప్రతీ వైసీపీ నాయకులు, ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు. ప్రజా నిర□యానికి వ్యతిరేకంగా టీడీపీ ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర□యం తీసుకుంది. మరో 6 కోట్లు ఖర్చు చేస్తే మిగిలిన మెడికల్ కాలేజీలు పూర్తవుతాయని 40 సంవత్సరాలు ఇండస్ట్రీ అని చెప్పుకోవడం కాదని ప్రజా పాలన ఎలా చేయాలో చంద్రబాబు తెలుసుకోవాలని హితువు పలికారు. వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో కరోనా లాంటి మహమ్మారి వచ్చిన కూడా ఎంత కాలం ఎదురొచ్చిన కూడా సంక్షేమ పథకాలు మాత్రం ఆగకుండా వైయస్ జగన్ సుపరిపాలన అందించారు. తూర్పు నియోజకవర్గంలో 600 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరిగాయి. మళ్ళీ ఎన్నికలు ఎప్పుడూ వస్తాయానని ఎదురు చూస్తున్నారు. వైఎస్ఆర్ సీపీ ప్రజా ప్రభుత్వాన్ని గెలిపించుకోడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ నెల 18వ తేదీన రాష్ట్ర గవర్నర్‌కు కోటి సంతకాలను మాజీ సీఎం వైఎస్ జగన్ అందజేయనున్నారని దేవినేని అవినాష్ వెల్లడించారు..

# 80% మంది టీడీపీ ఎమ్మెల్యేలు రెడ్ జోన్ పరిస్థితి

- చంద్రబాబు పేదల భూములు లాక్కొని ధనవంతులకు ఇచ్చారని ధర్మాన ప్రసాదరావు మండిపాటు..

**నేటి సాక్షి అన్నమయ్య జిల్లా, శర్మ, డిసెంబర్ 13 :** అన్నమయ్య జిల్లా :-: ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు చేసిందేమీలేదని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. బాబు పేదల భూములు లాక్కొని ధనవంతులకు అప్పజెప్పారని ధర్మాన ప్రసాదరావు ఆరోపించారు. బ్రిటీష్ పాలన తర్వాత వైఎస్ జగన్ మళ్లీ భూముల రీసర్వే చేపట్టారని ధర్మాన చెప్పుకొచ్చారు. మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు శనివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌పై సమీక్ష చేయడానికి సీఎం చంద్రబాబుకు ఏడాది కాలం పట్టింది. సంస్కరణలు తెచ్చామని చంద్రబాబు అంటున్నారు. 2019లో జగన్ వచ్చే వరకు పేదల భూములకు ఎవరూ ఎలాంటి సంస్కరణలు తీసుకురాలేదు. ఏది ఎవరి భూమి అనేది గుర్తించలేని అయోమయ పరిస్థితి నెలకొంది. దశాబ్దాల తరబడి ఉన్న భూములను కారు చౌకగా అమ్మేసిన పరిస్థితి ఉండేది. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం పెద్ద ఎత్తున రెవెన్యూ సంస్కరణలు తెచ్చింది. 2012కి ముందు ఉన్నవారికి చుక్కల భూమి పట్టాలు ఇవ్వటం జరిగింది. దీని వల్ల పేదలకు భూ హక్కులు వచ్చాయి. లాభం చేకూరింది. బ్యాంకు లోన్లు వచ్చాయి. ప్రభుత్వానికి ఆదాయం వచ్చింది. 1952 తర్వాత మళ్ళీ 2019లో జగన్ భూ సంస్కరణలు తెచ్చారు. భూ సంస్కరణల కోసం తమిళనాడు, కరా□టక వెళ్ళి స్టడీ చేశాము. ఏడాదిన్నర అయింది. దాన్ని మీరు ఆపారు. జగన్ తప్ప భూముల విషయంలో బీదలకు అనుకూలంగా చంద్రబాబు ఒక్క నిర□యం అయిన చేయగలిగారా. చంద్రబాబు ఇతరుల వద్ద భూములు లాక్కొని ధనవంతులకు ఇచ్చారు. వైఎస్ జగన్ తెచ్చిన సంస్కరణలు అన్ని పేదలకు మేలు చేశాయి. వాటిని మభ్యపెట్టి ఎన్నికల్లో మీరు లబ్ధి పొందారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు భూములు అన్ని 22Aలో పెట్టి గందరగోళానికి గురి చేశారు. మేము వాటిని సరిచేద్దామంటే కేసులు పెట్టి అధికారులను ఎంత భయపెట్టారు. తహసిల్దార్ కార్యాలయాలు పూర్తిగా ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల చేతుల్లోకి వెళ్ళిపోయాయి. ఆయా తహసిల్దార్ కార్యాలయాల్లో కేవలం టీడీపీ ఎమ్మెల్యేలు, ఇంచార్జు లు చెప్తుంటేనే పనులు జరుగుతున్నాయి. వైసీపీ వాళ్లు ఎవరు వెళ్లిన పనులు జరగటం లేదు. ప్రస్తుతం ఉన్న తరుణంలో 80 శాతం టీడీపీ ఎమ్మెల్యేలు రెడ్ జోన్‌లోకి వెళ్ళిపోయారు. నాలుగో సారి సీఎం అయిన చంద్రబాబు ప్రజలకు ఏం మేలు చేస్తున్నారని ధర్మాన ప్రసాదరావు ప్రశ్నించారు. సంస్కరణలు మీరు చేయలేరు. చేసిన సంస్కరణలను తప్పుడు మార్గంలో భూతద్దంలో చూపిస్తున్నారని ధర్మాన మండిపడ్డారు..



# సమన్వయంతో ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాలి

- చెక్ లిస్ట్ చూసుకోవాలి
- జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్

**నేటి సాక్షి - జగిత్యాల ( రాధారపు నర్సయ్య ) :** ఆదివారం జరిగే రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రతి అధికారి జాగ్రత్తగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ తెలిపారు. శనివారం రోజున బీర్పూర్ మండలంలో రేపు జరగనున్న రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ క్షేత్రస్థాయిలో పర్యటించి ఎలక్షన్ మెటీరియల్ పంపిణిని పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని, రిసెప్షన్ సెంటర్ ను సందర్శించి, పోలింగ్ అధికారులకు ఇచ్చిన మెటీరి యల్ ని చెక్ చేశారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీ ఏర్పా ట్లను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సామాగ్రిని, బ్యాలెట్ పేపర్లను, పోలింగ్ బాక్సులను పరిశీలించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో కావాల్సిన సామాగ్రిని పోలింగ్ కేంద్రం వారిగా వేరు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. బ్యాలెట్ పత్రాలు జాగ్రత్తగా చెక్ చేసి ప్యాక్ చేయాలని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి పోలింగ్ కేంద్రం చేరుకొని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను మరోసారి నిర్ధారణ చేసుకోవాలన్నారు. సిబ్బంది రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం కల్పించాలని, విద్యుత్ అంతరాయం లేకుండా 24 గంటలు విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. ఏమైనా లోపాలు కనిపిస్తే వెంటనే తెలియ జేయాలని, త్రాగునీరు, లైటింగ్, పార్కింగ్ ప్రదేశాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జడ్పీ సీఈవో గౌతం రెడ్డి, జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, నోడల్ ఆఫీసర్ మదన్ మోహన్, ఎమ్మార్వోలు, ఎంపీడీవో లు, ఎం.పి.ఓ.లు, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.



# కథలాపూర్‌లో ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు ఘన సన్మానం



**నేటి సాక్షి - కథలాపూర్ ( రాధారపు నర్సయ్య ) :** కథలాపూర్ గ్రామంలో నూతనంగా ఎన్నికైన ఉపసర్పంచ్‌తో పాటు అన్ని వార్డు సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నాగేశ్వర్ రావు, శ్రీసాయి ఫర్టిలైజర్స్ ఎల్లాల సాయిరెడ్డి, ఏలేటి జీవన్ రెడ్డి, లింగారావు పాల్గొని ప్రజాప్రతినిధులను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

### గ్రామాభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలి

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ఉపసర్పంచ్, వార్డు సభ్యులు సమిష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రజల ఆశలకు అనుగుణంగా పారదర్శకంగా పనిచేస్తే గ్రామానికి మరింత మంచి రోజులు వస్తాయని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధుల సేవాభావాన్ని ప్రశంసిస్తూ, ప్రతి విషయంలో తమ సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. సన్మాన కార్యక్రమం గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగగా, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు.

# గోవిందాపురం కాంగ్రెస్ అభ్యర్థిని ఆశీర్వదించిన మంత్రి సీతక్క



**నేటి సాక్షి,నల్లబెల్లి ,డిసెంబర్ 13 :** గోవిందపురం కాంగ్రెస్ అభ్యర్థి వాసం తిరుపతమ్మ సాంబయ్యను రాష్ట్ర మంత్రి సీతక్క నల్లబెల్లి మండలం గోవిందపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిని కలిసి యోగక్షేమాలను తెలుసుకొని తన ఆశీర్వాదాలను అందజేశారు. సీతక్క గ్రామానికి చేరుకున్న వార్త తెలుసుకున్న వెంటనే గ్రామస్తులు, బంధువులు ఆమెను కలుసుకోవడానికి పోటీపడ్డారు. గ్రామంలో సీతక్కకు దగ్గరి బంధువులు ఎక్కువగా ఉండటంతో ఆమె రాకతో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ప్రజలతో మమేకమై మాట్లాడిన సీతక్క, బంధువులను దగ్గరికి తీసుకొని యోగక్షేమాలు తెలుసుకున్నారు. సీతక్క రాకను తెలుసుకున్న గ్రామ మాజీ ఎంపీటీసీ జిల్లా మునీందర్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటరాజు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మాలోతు రమేష్ సీతక్కను కలుసుకున్నారు. అధిక సంఖ్యలో మహిళలు, యువత, గ్రామస్తులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సీతక్క పర్యటన గ్రామంలో కొత్త ఉత్సాహం, ప్రేరణను నింపిందని గ్రామస్తులు పేర్కొన్నారు.

# ఇండిపెండెంట్ సర్పంచ్ కడారి రాజేష్ కాంగ్రెస్ పార్టీలో చేరిక



**నేటి సాక్షి - మెట్‌పల్లి ( రాధారపు నర్సయ్య ) :** మెట్‌పల్లి మండలం మేడిపల్లి గ్రామ సర్పంచ్‌గా ఇండిపెండెంట్ అభ్యర్థిగా గెలుపొందిన కడారి రాజేష్ కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కండువా కప్పి ఆహ్వానం ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగ్ రావు కడారి రాజేష్‌కు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామస్థాయి నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరడం పార్టీకి మరింత బలం చేకూరుస్తుందని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధికి కలిసి పనిచేస్తాం కడారి రాజేష్ మాట్లాడుతూ, మేడిపల్లి గ్రామ అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితుడై పార్టీలో చేరినట్లు తెలిపారు. గ్రామ ప్రజల ఆశలు నెరవేర్చేందుకు పార్టీ నాయకత్వంతో కలిసి పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.